సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+12 వెల: ₹ 5.00

సంపుటి: 12
సంచిక: 336

బుధవారం 26-2-2020

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



‘గ్రామం ప్రగతిపథంలో ఉంటే ఎవ్వరూ మురా కక్షల జోలికి వెళ్లరు’



**పదికి పది వికెట్లు...**
మహిళల అండర్–19 వన్డేలో చండీగఢ్ బౌలర్ కశ్వీ గౌతమ్ రికార్డు – స్పోర్ట్స్‌లో



**మా దగ్గర ఇన్వెస్ట్ చేయండి..**
భారత కంపెనీల సీఈవోలతో భేటీలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ – బిజినెస్‌లో

## ఇచ్చింది శాంపిల్
# వచ్చేది బిగ్ డీల్!

### 24 రోమియోలు.. 6 అపాచీలు

- ‘రక్షణ’ కోసం 30 హెలికాప్టర్లను కొనుగోలు చేయనున్న భారత్
- 300 కోట్ల డాలర్లపైచిలుకు విలువైన ఒప్పందం ఖరారు
- మరో మూడు ఒప్పందాల పైనా సంతకాలు

### త్వరలో భారీ వాణిజ్య ఒప్పందం..

- అమెరికాతో కుదరబోతోందంటూ ప్రధాని మోదీ సంకేతాలు
- ఇరుదేశాల సంబంధాలు 21వ శతాబ్దంలోనే అత్యంత కీలకం
- ఇండో– యూఎస్ చర్చల తర్వాత మోదీ–ట్రంప్‌ల ప్రెస్‌మీట్

భారత్‌లో ఈ రెండు రోజులు అద్భుతంగా సాగాయి. ముఖ్యంగా, మొతెరా స్టేడియంలో కార్యక్రమం గొప్పగా జరిగింది. అది నాకు లభించిన గొప్ప గౌరవం. నిజానికి ఆ స్టేడియానికి భారీగా తరలివచ్చిన ప్రజలు నా కోసం కాదు.. మీ(మోదీ) కోసమే వచ్చారనిపించింది. - ట్రంప్

ఒక అతిపెద్ద వాణిజ్య ఒప్పందానికి సంబంధించి చర్చలు ప్రారంభించాలని కూడా నిర్ణయించాం. ఆ ఒప్పందం ఇరు దేశాలకు ప్రయోజనకర ఫలితాలను సాధిస్తుందని ఆశిస్తున్నాం. ఈ రెండు దేశాల మధ్య సంబంధాలు ప్రభుత్వాల స్థాయికే పరిమితం కాదు.. ఇరుదేశాల ప్రజల భాగస్వామ్యంతో ఏర్పడినవి. - మోదీ



వీడ్కోలు పలుకుతూ..

**కోరితే కశ్మీర్‌పై మధ్యవర్తిత్వం!**
- వివరాలు 10లో



చిన్నారితో మెలానియా

**సర్వోదయ బడి ఫస్ట్‌లేడీ సందడి**
- ఫ్యామిలీలో



మంగళవారం రాష్ట్రపతి భవన్‌లో ట్రంప్ దంపతులతో రాష్ట్రపతి దంపతులు, ప్రధాని

## విందుకు వేళాయె..

రాష్ట్రపతి భవన్‌లో ట్రంప్ దంపతులకు విందు

## మహాత్ముడికి ఘన నివాళి

పూర్తి వివరాలు 9,10 పేజీల్లో

## ట్రంప్ పర్యటిస్తున్న వేళ..
# భగ్గుమన్న ఢిల్లీ

**సీఏఏపై ఈశాన్య ఢిల్లీలో రెచ్చిపోయిన ఆందోళనకారులు**

**ఘర్షణల్లో పోలీస్ కానిస్టేబుల్ సహా మరణించిన వారి సంఖ్య 13**

- 200 మందికి గాయాలుకాగా, పలు ప్రాంతాల్లో ఆస్తులు ధ్వంసం అయ్యాయి
- చాలాచోట్ల 144వ సెక్షన్ విధించినా దాన్ని పాటించేవారే కరువయ్యారు.
- రాళ్లు, రాడ్లు, ఆఖరికి కత్తులు కూడా పట్టుకుని ఆందోళనకారులు రెచ్చిపోయారు.
- గోకుల్‌పురిలో అల్లరిమూకలు రెండు అగ్నిమాపక వాహనాల్ని ధ్వంసం చేశారు.
- కనిపిస్తే కాల్చివేత ఉత్తర్వులిచ్చారన్న స్థానికులు.. అలాంటిదేమీ లేదన్న డీసీపీ

- వివరాలు 12లో



దుకాణానికి నిప్పంటించిన ఆందోళనకారులు

అగ్రరాజ్యాధిపతి డొనాల్డ్ ట్రంప్ ఢిల్లీలో పర్యటిస్తుండగానే... అక్కడకు కాస్త దూరంలో హింస పెచ్చరిల్లింది. సీఏఏకు మద్దతుదారులు, వ్యతిరేకులు పేట్రేగిపోయారు. ఫలితంగా రెండు రోజుల్లో మొత్తం 13 మంది బలయ్యారు. 200 మంది వరకు గాయపడ్డారు. వీరిలో 48 మంది పోలీసులే. ఈశాన్య ఢిల్లీలోని పలు ప్రాంతాల్లో సోమవారం మొదలైన ఈ ఘర్షణలు మంగళవారం మరింత తీవ్రరూపం దాల్చాయి. ఆందోళనకారులు దుకాణాల్ని, వ్యాపార సముదాయాల్ని తగలబెట్టేశారు. మారణాయుధాలతో వీధుల్లో స్వైరవిహారం చేశారు. ఇరు వర్గాలవారూ రాళ్లు రువ్వుతూ, ఆస్తుల ధ్వంసానికి తెగబడ్డారు.



ట్రంప్ గౌరవార్థం రాష్ట్రపతి ఇచ్చిన విందులో అమెరికా అధ్యక్షుడితో సీఎం కేసీఆర్

## రాష్ట్రపతి విందుకు
# కేసీఆర్ హాజరు

సాక్షి, న్యూఢిల్లీ

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గౌరవార్థం రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ రాష్ట్రపతి భవన్‌లోని అశోకా హాల్‌లో ఏర్పాటు చేసిన విందు సమావేశానికి తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ హాజరయ్యారు. మంగళవారం సాయంత్రం ఢిల్లీ చేరుకున్న ఆయన.. రాత్రి 7.30 గంటలకు ప్రారంభమైన విందు భేటీలో పాల్గొన్నారు. వివిధ రంగాలకు చెందిన పలువురు ప్రముఖులను ఈ విందు సమావేశానికి అతిథులుగా ఆహ్వానించగా ఆ జాబితాలో కేసీఆర్ కూడా ఉన్నారు. డొనాల్డ్ ట్రంప్, ఆ దేశ ప్రథమ పౌరురాలు మెలానియా ట్రంప్ అతిథులను పరిచయం చేసుకుంటూ వారితో ముచ్చటిస్తూ ముందుకు సాగారు. సీఎం కేసీఆర్ వారితో కరచాలనం చేసి తనను పరిచయం చేసుకున్నారు. డొనాల్డ్ ట్రంప్, మెలానియా ట్రంప్ వెంట రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, రాష్ట్రపతి సతీమణి సవితా కోవింద్, ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, ఆయన సతీమణి ఉష, ప్రధాని నరేంద్ర మోదీ అతిథులను పలకరిస్తూ ముందుకు సాగారు.

NECC — National Egg Co-ordination Committee | Vencobb Chicken

సూచించిన నేటి గ్రుడ్లు & చికెన్ హైదరాబాద్ జోన్ ధరలు

| | | | | |
|---|---|---|---|---|
| గ్రుడ్ల రిటైల్ ధర ₹ 42 డజన్ | ఫారం దగ్గర లైవ్ బర్డ్ | 50 కిలో | డ్రెస్డ్ స్కిన్‌తో | 104 కిలో |
| | రిటైల్ లైవ్ బర్డ్ | 72 కిలో | స్కిన్‌లెస్ | 119 కిలో |

వినియోగదారుల శ్రేయస్సు దృష్ట్యా జారీచేయడమైనది



ఆ అసంతృప్తిని ఈ విధంగా వెళ్లగక్కారు.. మాంసాహారం కూడా పెట్టాల్సింది సార్!

## ‘రాజ్యసభ’ షెడ్యూల్ విడుదల

**తెలంగాణ నుంచి రెండు, ఏపీ నుంచి నాలుగు స్థానాలకు ఎన్నికలు**

- రాజ్యసభ ద్వైవార్షిక ఎన్నికల షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేసింది. 17 రాష్ట్రాలకు సంబంధించి 55 మంది సభ్యుల పదవీకాలం పూర్తవుతున్న నేపథ్యంలో ఆయా స్థానాల భర్తీకి ఎన్నికలు జరగనున్నాయి. ఇందులో ఏపీ నుంచి నాలుగు, తెలంగాణ నుంచి రెండు స్థానాలు ఉన్నాయి.

- వివరాలు 2లో

## తప్పుడు పత్రాలతో
# హస్తగతం!

**రేవంత్, ఆయన సోదరుడి పేరుతో 6 ఎకరాల భూమి మ్యుటేషన్**

- ప్రభుత్వ విచారణలో బట్టబయలు..
- అసలు హక్కుదారులు ఎవరో స్పష్టత లేదు
- సీఎస్‌కు నివేదిక పంపిన రంగారెడ్డి జిల్లా కలెక్టర్
- సహకరించిన అప్పటి డిప్యూటీ కలెక్టర్‌పై సస్పెన్షన్ వేటు

- వివరాలు 2లో

## అమెరికాలో రోడ్డు ప్రమాదం



దివ్య, రాజు (ఫైల్)

- హైదరాబాద్‌కు చెందిన దంపతుల మృతి
- వారితోపాటు గుంటూరుకు చెందిన స్నేహితుడు కూడా..
- రాజు, దివ్యల కారును వెనుక నుంచి ఢీకొట్టిన మరో కారు
- డాలస్ సమీపంలోని ఫ్రిస్కో పట్టణంలో దుర్ఘటన
- పుట్టిన రోజు, పుట్టిన సమయానికే తనువు చాలించిన దివ్య

- వివరాలు 14లో

Sabse Pehle Life Insurance

SBI Life INSURANCE
With Us, You're Sure

మీ కోసం కూడా ఏదైనా చేయండి.
మీ వాళ్ల రక్షణ కోసం
SBI Life ప్రొటెక్షన్ ప్లాన్స్.



TERM INSURANCE | LOAN INSURANCE | GROUP TERM INSURANCE | HEALTH INSURANCE

www.sbilife.co.in | Apno Ki #HimmatWaaliSeeti

IRDAI రెజి. నం. 111. CIN: L99999MH2000PLC129113 • వెబ్‌సైట్: www.sbilife.co.in • ఈమెయిల్: info@sbilife.co.in • టోల్ ఫ్రీ: 1800-267-9090 • 'Celebrate' అని 56161 కి SMS చేయండి.

HWS.ver.01-02-20 ADVT TEL




## రావి కొండలరావుపై ప్రత్యేక తపాలా కవర్ విడుదల

సాక్షి, హైదరాబాద్: తపాలా శాఖ సినీ నటుడు రావి కొండలరావుపై స్పెషల్ పోస్టల్ కవర్‌ను విడుదల చేసింది. మంగళవారం హైదరాబాద్ డాక్ సదన్‌లో జరిగిన కార్యక్రమంలో ఆ శాఖ తెలంగాణ సర్కిల్ చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్ కె.సంధ్యారాణి కవర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు డాక్టర్ కేవీ రమణ, రిటైర్డ్ ఐఏఎస్ మోహన్‌కందా తదితరులు పాల్గొన్నారు.

## ఢిల్లీ హింస బాధాకరం: కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: దేశరాజధాని ఢిల్లీలో చెలరేగిన హింస చాలా బాధాకరమని టీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ అన్నారు. 'భారతీయులంతా అత్యంత సున్నిత మనస్కులని ఈ ఘటన మరోసారి రుజువు చేసింది. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంలో తలెత్తిన భేదాభిప్రాయాలను పరిష్కరించుకోవాల్సిన అవసరముంది'అని మంగళవారం ఆయన ట్విట్టర్‌లో పేర్కొన్నారు.

## రోడ్డు ప్రమాదాలను 20 శాతం తగ్గించాలి: డీజీపీ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలను ఈ ఏడాది 20 శాతం వరకు తగ్గించడమే లక్ష్యంగా పెట్టుకోవాలని డీజీపీ మహేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం భారత జాతీయ రహదారుల ప్రాధికారిక సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) ఆధ్వర్యంలో నిర్వహించిన సమన్వయ సదస్సులో డీజీపీ మహేందర్‌రెడ్డి, టీఆర్ అండ్ బీ ముఖ్యకార్యదర్శి సునీల్ శర్మ, లా అండ్ ఆర్డర్ ఏడీజీ జితేందర్, రోడ్‌సేఫ్టీ ఏడీజీ సందీప్ శాండిల్య, నగర కమిషనర్ అంజనీ కుమార్‌తోపాటు రాచకొండ, సైబరాబాద్, నిజామాబాద్, వరంగల్, ఖమ్మం కమిషనర్లు ఇతర జిల్లాల ఎస్పీలు, ఎన్‌హెచ్‌ఏఐ రీజినల్ ఆఫీసర్ కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ ఏడాది రోడ్డు ప్రమాదాలను తగ్గించడమే లక్ష్యంగా పనిచేయాలని, ఇందుకోసం స్వల్ప, మధ్యస్థ, దీర్ఘకాలిక ప్రణాళికలు విధించుకుని జాతీయ రహదారులపై ఉన్న బ్లాక్‌స్పాట్లను క్రమంగా ప్రమాదరహిత ప్రాంతాలుగా మార్చాలని మహేందర్‌రెడ్డి తెలిపారు.



## మూడు రోజులు పొడి వాతావరణం

సాక్షి, హైదరాబాద్: దక్షిణ బిహార్, దాని పరిసర ప్రాంతాల నుంచి తెలంగాణ వరకు ఛత్తీస్‌గఢ్ మీదుగా ఉపరితల ద్రోణి ఏర్పడింది. అలాగే రాష్ట్రంలో ప్రధానంగా నైరుతి దిశ నుంచి గాలులు వీస్తున్నాయి. దీంతో రానున్న మూడు రోజులు పొడి వాతావరణం ఏర్పడే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఇదిలావుండగా గత 24 గంటల్లో నిజామాబాద్, భద్రాచలంలలో పగటి ఉష్ణోగ్రతలు 36 డిగ్రీల చొప్పున నమోదయ్యాయి. ఆదిలాబాద్, హైదరాబాద్, మహబూబ్‌నగర్, మెదక్‌లలో 35 డిగ్రీల చొప్పున గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదైనట్లు వాతావరణ కేంద్రం వెల్లడించింది.

## 6,236 గంటలు... 47.52 టీఎంసీలు

- లక్ష్మి పంప్‌హౌస్ నుంచి ఈ సీజన్‌లో భారీగా నీటి ఎత్తిపోతలు

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ఎత్తిపోతల్లో భాగంగా మేడిగడ్డ (లక్ష్మి) బ్యారేజీ నుంచి రివర్స్ పంపింగ్ ప్రక్రియ నిరంతరాయంగా కొనసాగుతోంది. మేడిగడ్డ బ్యారేజీలో లభ్యత నీటిని అన్నారం (సరస్వతి), సుందిళ్ల (పార్వతి) బ్యారేజీల ద్వారా ఎల్లంపల్లికి ఎత్తిపోస్తున్నారు. మరో మూడు రోజులపాటు లక్ష్మి పంప్‌హౌస్ ద్వారా నీటిని తరలించనున్నట్లు తెలుస్తోంది. లక్ష్మి బ్యారేజీ నుంచి నీటిని ఎత్తిపోసే ప్రక్రియ గత ఏడాది జూలై 6న మొదలుకాగా, ఇప్పటివరకు నాలుగు విడతలుగా పంప్‌హౌస్‌లలోని మోటార్ల ద్వారా 47.52 టీఎంసీ నీటిని ఎత్తిపోశారు. 6,236 గంటల పాటు మోటార్లు నడిచినట్లు ప్రాజెక్టు వర్గాలు వెల్లడిస్తున్నాయి. నాలుగో విడత పంపింగ్‌ను ఈనెల 21న ఆరంభించగా, ఇప్పటివరకు 818 గంటల పాటు మోటార్లను నడిపించి 6.24 టీఎంసీల నీటిని ఎత్తిపోసినట్లు ఆ వర్గాలు తెలిపాయి. మంగళవారం సైతం నాలుగు మోటార్ల ద్వారా నీటిని ఎత్తిపోస్తున్నారు. ప్రస్తుతం బ్యారేజీలో 7 టీఎంసీల మేర నిల్వ ఉంది. మరో నాలుగు టీఎంసీ నీటిని ఎత్తిపోసేలా ప్రణాళిక సిద్ధం చేశారు. ఇక లక్ష్మి నుంచి వస్తున్న నీరంతా సరస్వతి బ్యారేజీకి వస్తుండగా, ఇక్కడి పంప్‌హౌస్‌లోని 5 మోటార్ల ద్వారా నీటిని దిగువ పార్వతి బ్యారేజీకి తరలిస్తున్నారు. ప్రస్తుతం సరస్వతి బ్యారేజీలో 10.87 టీఎంసీలకు గానూ 8 టీఎంసీల నిల్వలున్నాయి.



# తప్పుడు పత్రాలతో హస్తగతం!

### రేవంత్, ఆయన సోదరుడి పేరుతో 6 ఎకరాల భూమి మ్యుటేషన్

- ప్రభుత్వ విచారణలో బట్టబయలు..
- అసలు హక్కుదారులు ఎవరో స్పష్టత లేదు
- సీఎస్‌కు నివేదిక పంపిన రంగారెడ్డి జిల్లా కలెక్టర్
- సహకరించిన అప్పటి డిప్యూటీ కలెక్టర్‌పై సస్పెన్షన్ వేటు



సాక్షి, హైదరాబాద్: టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎంపీ ఎనుముల రేవంత్‌రెడ్డి, ఆయన సోదరుడితో కలసి తప్పుడు పత్రాలతో అత్యంత ఖరీదైన భూమిని తమ పేరిట మ్యుటేషన్ చేయించుకున్నారని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ విచారణలో బహిర్గతమైంది. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం గోపనపల్లిలోని సర్వే నంబర్ 127లో 10.21 ఎకరాల పట్టా భూమి ఉండగా, అందులో 6 ఎకరాల 7 గుంటల భూమిని రేవంత్‌రెడ్డి అక్రమ మార్గంలో హస్తగతం చేసుకున్నారని నివేదిక వెల్లడించింది. గోపనపల్లిలోని సర్వే నంబర్ 127లో గల భూమికి సంబంధించి తమకు హక్కు ఉందని, రేవంత్‌రెడ్డి ఈ భూములు అమ్ముకోకుండా ఆదేశాలు జారీ చేయాలంటూ కొల్లా అరుణ 2017లో హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. రేవంత్ సోదరుడు అనుముల కొండల్‌రెడ్డి ఈ భూములను అమ్ముకోకుండా ఆదేశాలు జారీ చేయాలని అనిల్ కుమార్ అనే వ్యక్తి 2015లో రంగారెడ్డి సివిల్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యవహారంలో నిజానిజాలు తేల్చేందుకు ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. రంగారెడ్డి జిల్లా కలెక్టర్ ఈ మేరకు సీఎస్‌కు నివేదిక సమర్పించారు. తప్పుడు పత్రాలతో తొలుత వేరే వారి పేరు మీద భూమి రాయించి, ఆ తర్వాత వారి నుంచి కొనుగోలు చేసినట్లు రేవంత్‌రెడ్డి, కొండల్‌రెడ్డి పత్రాలు సృష్టించినట్లు తేలిందని అధికార వర్గాలు వెల్లడించాయి. అక్రమ డాక్యుమెంట్లను ఆధారంగా చేసుకుని అక్రమంగా మ్యుటేషన్ చేసిన అప్పటి శేరిలింగంపల్లి తహసీల్దార్/డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేసిన శ్రీనివాసరెడ్డిని సస్పెండ్ చేస్తూ సీఎస్ సోమేశ్‌కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

### వ్యవహారం ఇలా జరిగింది..


రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం గోపనపల్లి గ్రామంలోని సర్వే నంబర్ 127లో 10.21 ఎకరాల భూమి 1977 వరకు వడ్డె హనుమ, అతడి వారసుడు వడ్డె మల్లయ్య పేరు మీద ఉన్నట్లు రెవెన్యూ రికార్డుల్లో ఉంది. 1978 నుంచి ఈ భూమి 'మల్లయ్య'పేరు మీద పహాణీలో నమోదవుతూ వస్తోంది. మల్లయ్య పేరు ఉంది కానీ.. ఆయన ఇంటి పేరు లేదు. ఎలాంటి ఆధారాలు లేకుండానే 1993–94 నుంచి ఈ భూమికి పట్టాదారుగా మల్లయ్యకు బదులు 'దబ్బ మల్లయ్య'అనే కొత్త వ్యక్తి పేరును రెవెన్యూ రికార్డుల్లో చేర్చారు. ఆ తర్వాత 2001–02 నుంచి పహాణీల్లో మల్లయ్య పేరు తొలగించారు. ఆ తర్వాత ఇ.మల్లయ్య అనే మరో కొత్త వ్యక్తి తెరపైకి వచ్చాడు. 2005లో అప్పటి శేరిలింగంపల్లి డిప్యూటీ కలెక్టర్/తహసీల్దార్ ఇ.మల్లయ్యకు వారసుడిగా చెప్పుకొనే ఇ.లక్ష్మయ్య పేరు మీద 2 ఎకరాల 21 గుంటల భూమి రాశారు. ఆ భూమి లక్ష్మయ్య కాస్తులో ఉన్నట్లు తేల్చేశారు. అదే తహసీల్దార్ మళ్లీ ఈ వివరాలు సవరిస్తూ.. లక్ష్మయ్య కేవలం ముప్పైఒకటిన్నర గుంటల్లో కాస్తులో ఉన్నట్లు రాశారు. ఎలాంటి ఆధారం లేకుండానే లక్ష్మయ్య పేరు మీద మొదట 2 ఎకరాల 21 గుంటలను రాయడం, మళ్లీ సవరించి ముప్పై ఒకటిన్నర గుంటలకు మార్చడం రెండూ తహసీల్దార్ తన అధికార పరిధిని అతిక్రమించినట్లు విచారణలో తేలింది. ఈ ముప్పైఒకటిన్నర గుంటల భూమిని అనుముల రేవంత్‌రెడ్డి కొనుగోలు చేసినట్లు సేల్ డీడ్ రాసుకున్నారు. దీని ఆధారంగా రేవంత్‌కు అనుకూలంగా తహసీల్దార్ వ్యవహరించారు. రేవంత్ పేరును ఈ భూమికి హక్కుదారుడిగా పేర్కొంటూ 2005లో అప్పటి తహసీల్దార్ రికార్డుల్లో ఎంట్రీ చేశారు.

- ఎలాంటి ఆధారాల్లేకుండానే ఇ.లక్ష్మయ్య మరో ఎకరం ఇరవై తొమ్మిదిన్నర గుంటల భూమిని కొండల్‌రెడ్డికి అమ్మాడు. అధికారులు ఆ కొనుగోలు ప్రకారం కొండల్‌రెడ్డి పేరిట 2015లో మ్యుటేషన్ చేశారు.
- ఎలాంటి ఆధారాలు లేకున్నా తన పేరు మీద పత్రాలు సృష్టించడం ద్వారా డి.మల్లయ్య అనే వ్యక్తి 2 ఎకరాల 20 గుంటల భూమిని కళావతి అనే మహిళకు అమ్మాడు. ఈ భూమిని కూడా అధికారులు కళావతి పేరు మీద మార్చిడి (మ్యుటేషన్) చేశారు. ఆ తర్వాత ఆ భూమిని కళావతి.. ఎ.కొండల్‌రెడ్డి పేరు మీదకు బదిలీ చేశారు.
- ఇదే సర్వే నంబర్‌లోని మరో ఎకరం 24 గుంటల భూమిని అలీ సల్మాన్ బిన్, మహఫూజ్, హబీబ్ అబ్దుల్ రహీం, ఎ.వెంకటరావు, ఇతరుల నుంచి కొనుగోలు చేసినట్లు 2014లో కొండల్‌రెడ్డి సేల్ డీడ్ చేసుకున్నారు. రెవెన్యూ రికార్డుల్లో భూ విక్రేతలకు సంబంధించి ఎలాంటి ఎంట్రీలు లేకపోయినా, స్థానిక తహసీల్దార్ సేల్ డీడ్ ఆధారంగా కొండల్‌రెడ్డి పేరు మీద భూమిని మ్యుటేషన్ చేశారు.
- 1989లో ఎ.వెంకటరెడ్డి అనే వ్యక్తి దబ్బ మల్లయ్య నుంచి 1 ఎకరం 10 గుంటల భూమి కొనుగోలు చేసినట్లు రికార్డుల్లో నమోదైంది. అయితే 1989లో దబ్బ మల్లయ్య పేరు మీద ఈ భూమి ఉన్నట్లు రికార్డుల్లో లేదు. వెంకటరావు అనే మరో వ్యక్తి ఈ భూమిలోని పదమూడున్నర గుంటల భూమిని ఆ తర్వాత ఎ.కొండల్‌రెడ్డి పేరు మీదికి బదలాయించారు.



### హక్కుదారులెవరో స్పష్టత లేకున్నా..

గోపనపల్లిలోని సర్వే నంబర్ 127లో గల భూమికి హక్కు దారులెవరు అనే విషయంలో స్పష్టత లేదని అధికారులు తేల్చారు. అయినా తప్పుడు డాక్యుమెంట్ల ఆధారంగా, తప్పుడు మ్యుటేషన్లు చేసినందుకు, తప్పుగా రికార్డుల్లో నమోదు చేశారని కలెక్టర్ తన నివేదికలో పేర్కొన్నారు.

పెన్నా మధుసూదన్, బండి నారాయణ స్వామికి అవార్డు అందజేస్తున్న చంద్రశేఖర్ కంబర్

# సాహిత్య అకాడమీ అవార్డుల ప్రదానం

**పురస్కారాలు స్వీకరించిన బండి నారాయణ స్వామి, పెన్నా మధుసూదన్**

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ, ఏపీలకు చెందిన రచయితలు బండి నారాయణ స్వామి, పెన్నా మధుసూదన్‌లు కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారాలు అందుకున్నారు. 23 భారతీయ భాషల్లో రచనలకు గాను ఏటా ప్రకటించే సాహిత్య అకాడమీ అవార్డులను డిసెంబర్ 18న ప్రకటించిన సంగతి తెలిసిందే. అనంతపురం జిల్లాకు చెందిన బండి నారాయణ స్వామి రాయలసీమ చరిత్ర ఆధారంగా తెలుగులో రాసిన శప్తభూమికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించగా.. మంగళవారం ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో అకాడమీ అధ్యక్షుడు చంద్రశేఖర్ కంబర్ చేతుల మీదుగా ఆయన ఈ పురస్కారం అందుకున్నారు. కాగా, సంస్కృత భాషలో పెన్నా మధుసూదన్ రాసిన ప్రజ్ఞాచాక్షుషం కావ్యానికి కూడా కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం లభించింది. ఆయన కూడా మంగళవారం ఆ పురస్కారాన్ని అందుకున్నారు. పెన్నా మధుసూదన్ జడ్చర్లకు చెందినవారు. గతంలో ఆయన సోమనాథ్ సంస్కృత పండిట్ అవార్డు, పండిట్ లట్కర్ శాస్త్రి మెమోరియల్ అవార్డు తదితర పురస్కారాలు అందుకున్నారు. మహారాష్ట్రకు చెందిన సాధువు గులాబ్‌రావు మహారాజ్ ఆధ్యాత్మిక తత్వబోధనలపై ప్రజ్ఞాచాక్షుషం రచించారు. అకాడమీ కార్యదర్శి కె.శ్రీనివాసరావు స్వాగతోపన్యాసం చేశారు.

### అవార్డు రావడం సంతోషకరం

నేను రాసిన శప్తభూమి నవలకు ఈ అవార్డు రావడం పాఠకులకు ఎక్కువ సంతోషాన్నిచ్చింది. దాని ఆధారంగా నాకూ సంతోషాన్నిచ్చింది. తెలంగాణ విడిపోయిన క్రమంలో రాయలసీమ ప్రాంతీయ అస్తిత్వం ప్రశ్నార్థకమైంది. రాయలసీమకు కూడా తనకంటూ ఒక భాష, సంస్కృతి ఉందని వివిధ ప్రాంతాలకు తెలియపరిచేందుకు ఈ శప్తభూమి రాశాను. రాయలసీమ చారిత్రక మూలాలు 18వ శతాబ్దం నుంచి తీసుకుని ఈ నవల రాశాను. రాయలసీమ కరువు, కరువుల పరంపరలను నవలలో రాశాను. రాయలసీమ కరువు కాటకాలను, సుఖదుఃఖాలను వివిధ ప్రాంతాలతో పంచుకునే అవకాశం లభించింది.

*– బండి నారాయణ స్వామి*

### చాలా ఆనందంగా ఉంది

అవార్డు అందుకున్నందుకు చాలా సంతోషంగా ఉంది. మహారాష్ట్రలో ఒక రైతు కుటుంబంలో ఒక నిర్ధన పరివారంలో పుట్టిన ఒక గొప్ప మహాత్ముడి జీవితాన్ని 850 శ్లోకాల్లో రాశాను. ఆయన జీవితం, ఆయన దార్శనిక విచారాలు, తత్వజ్ఞానాలు ప్రస్తావించాను. అందరికీ ఆ మహాత్ముడి జీవితం తెలియాలి. 34 ఏళ్లు మాత్రమే జీవించారు. 134 పుస్తకాలు, నాలుగు భాషల్లో రాశారు. భారతీయ ధర్మాన్ని స్థాపించాలని ప్రయత్నించారు. మరిన్ని రచనలు చేసేందుకు ఈ అవార్డు ప్రోత్సాహాన్నిస్తుంది.

*–పెన్నా మధుసూదన్*

# రాజ్యసభ ఎన్నికల షెడ్యూలు విడుదల

- ఏపీ నుంచి నాలుగు, తెలంగాణ నుంచి రెండు స్థానాలకు ఎన్నిక
- ఏప్రిల్ 9తో ముగిసిపోనున్న పలువురు రాజ్యసభ సభ్యుల పదవీ కాలం
- మొత్తం 17 రాష్ట్రాల్లోని పలు స్థానాలకు జరగనున్న ఎలక్షన్..

సాక్షి, న్యూఢిల్లీ: రాజ్యసభ ద్వైవార్షిక ఎన్నికల షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేసింది. 17 రాష్ట్రాలకు సంబంధించి 55 మంది సభ్యుల పదవీకాలం పూర్తవుతున్న నేపథ్యంలో ఆయా స్థానాల భర్తీకి ఎన్నికలు జరగనున్నాయి. ఏప్రిల్ 2న మహారాష్ట్ర నుంచి ఏడుగురు, ఒడిశా నుంచి నలుగురు, తమిళనాడు నుంచి ఆరుగురు, పశ్చిమ బెంగాల్ నుంచి ఐదుగురు సభ్యుల పదవీ కాలం పూర్తవుతుంది. ఏప్రిల్ 9న ఏపీ నుంచి నలుగురు, తెలంగాణ నుంచి ఇద్దరు, అసోం నుంచి ముగ్గురు, బిహార్ నుంచి ఐదుగురు, చత్తీస్‌గఢ్ నుంచి ఇద్దరు, గుజరాత్ నుంచి నలుగురు, హరియాణా నుంచి ఇద్దరు, హిమాచల్‌ప్రదేశ్ నుంచి ఒకరు, జార్ఖండ్ నుంచి ఇద్దరు, మధ్యప్రదేశ్ నుంచి ముగ్గురు, మణిపూర్ నుంచి ఒకరు, రాజస్తాన్ నుంచి ముగ్గురు సభ్యుల పదవీకాలం పూర్తికానుంది. అలాగే ఏప్రిల్ 12న మేఘాలయ నుంచి ఒక సభ్యుడి పదవీకాలం పూర్తవుతుంది.



**పదవీ విరమణ పొందుతున్న వారు వీరే..**

ఏపీ నుంచి మొత్తం 11 మంది సభ్యులు ప్రాతినిధ్యం వహిస్తుండగా ఇందులో ఎంఏ ఖాన్ (కాంగ్రెస్), కె.కేశవరావు (టీఆర్ఎస్), టి.సుబ్బిరామిరెడ్డి (కాంగ్రెస్), తోట సీతారామలక్ష్మి (టీడీపీ) ఏప్రిల్ 9న పదవీ విరమణ చేయనున్నారు. తెలంగాణ నుంచి కేవీపీ రాంచంద్రరావు (కాంగ్రెస్), గరికపాటి మోహన్‌రావు (బీజేపీ) పదవీ విరమణ చేయనున్నారు. ఏపీ పునర్ వ్యవస్థీకరణ చట్టంలోని 1వ షెడ్యూలు ప్రకారం ఉమ్మడి రాష్ట్రంలోని 18 మంది సభ్యుల్లో 11 మందిని ఏపీకి, ఏడుగురిని తెలంగాణకు లాటరీ పద్ధతిలో కేటాయించారు. ఈ నేపథ్యంలో తెలంగాణకు చెందిన కె.కేశవరావు, ఎంఏ ఖాన్‌లు సాంకేతికంగా ఏపీ నుంచి ప్రాతినిధ్యం వహించాల్సి వచ్చింది. అలాగే ఏపీకి చెందిన కేవీపీ రామచంద్రరావు తెలంగాణ నుంచి ప్రాతినిధ్యం వహించాల్సి వచ్చింది.

**ఇదీ షెడ్యూల్..**

- నోటిఫికేషన్: 6 మార్చి 2020
- నామినేషన్ల గడువు: 13 మార్చి 2020
- నామినేషన్ల పరిశీలన: 16 మార్చి 2020
- ఉపసంహరణ గడువు: 18 మార్చి 2020
- పోలింగ్ తేదీ: 26 మార్చి 2020 (గురువారం) ఉదయం 9 నుంచి సాయంత్రం 4 వరకు
- కౌంటింగ్ తేదీ: 26 మార్చి 2020 సాయంత్రం 5 నుంచి

# డీసీసీబీ, డీసీఎంఎస్‌లన్నీ ఏకగ్రీవం

- తెలంగాణ సహకార శాఖ వెల్లడి
- 29న చైర్మన్, వైస్ చైర్మన్ల ఎన్నిక
- సభ్యులు లేక రిజర్వేషన్ కేటగిరీల్లో ఖాళీలు
- ఆరు నెలల్లోపు విన్నవిస్తే వాటికి మళ్లీ ఎన్నికలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ), జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్)ల మేనేజింగ్ కమిటీ సభ్యుల (డైరెక్టర్ల) పదవులు మంగళవారం ఎన్నికలు జరగకుండానే అన్నీ ఏకగ్రీవమయ్యాయి. ఉప సంహరణ ప్రక్రియ పూర్తయిన తర్వాత అవన్నీ ఏకగ్రీవమైనట్లు తెలంగాణ సహకార శాఖ అడిషనల్ రిజిస్ట్రార్ సుమిత్ర ఒక ప్రకటనలో వెల్లడించారు. టీఆర్ఎస్‌కు చెందిన వారే ఎక్కువ కైవసం చేసుకోవడం గమనార్హం. రాష్ట్రంలో పాత జిల్లాల ప్రకారం 9 డీసీసీబీ, 9 డీసీఎంఎస్‌లకు ఎన్నికల ప్రక్రియ జరిగిన సంగతి తెలిసిందే. ఇక డీసీసీబీ, డీసీఎంఎస్‌లకు చైర్మన్, వైస్ చైర్మన్ల ఎన్నికలు ఈ నెల 29న జరుగుతాయని ఆమె తెలిపారు. దీనికోసం ఆ రోజు నామినేషన్లు స్వీకరిస్తామని, పరిశీలన అనంతరం రహస్య విధానంలో ఓటింగ్ జరిపి ఎన్నుకుంటామన్నారు. కాగా డీసీసీబీలకు 20 మంది చొప్పున గ్రూప్ ఏలో 16, గ్రూప్ బీలో నలుగురు, అలాగే డీసీఎంఎస్‌లకు 10 మంది చొప్పున గ్రూప్ ఏలో ఆరుగురు, గ్రూప్ బీలో నలుగురు డైరెక్టర్లను ఎన్నుకునేందుకు నోటిఫికేషన్ జారీ అయిన సంగతి తెలిసిందే. మంగళవారం ఉదయం 8 గంటల నుంచి 1 గంట వరకు డైరెక్టర్ల పదవుల ఎన్నికకు నామినేషన్లు స్వీకరించారు. ఈ క్రమంలో కొన్నిచోట్ల ఒక్కో డైరెక్టర్ పోస్టుకు ఇద్దరు లేదా ముగ్గురు చొప్పున నామినేషన్లు వేసినట్లు అధికారులు తెలిపారు. అయితే కొన్ని రిజర్వుడు స్థానాల్లో అభ్యర్థులు లేక వాటికి నామినేషన్లు దాఖలుకాలేదు. 9 డీసీసీబీల్లో 180 డైరెక్టర్ పదవులకు ఎన్నికలు జరగాల్సి ఉండగా, వివిధ జిల్లాల్లో 33 రిజర్వుడు డైరెక్టర్ పదవులకు సభ్యులు లేక ఎవరూ నామినేషన్ వేయలేదు. అలాగే 9 డీసీఎంఎస్‌లలో 90 డైరెక్టర్ పదవులకు నామినేషన్లు వేయాల్సి ఉండగా, 16 డైరెక్టర్ పదవులకు రిజర్వుడు సభ్యులు లేక నామినేషన్లు దాఖలుకాలేదు. మిగిలిన వాటికి ఇద్దరు లేదా ముగ్గురు నామినేషన్లు వేశారు. అయితే మధ్యాహ్నం 3.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగిన నామినేషన్ల ఉపసంహరణతో అన్ని డీసీసీబీ, డీసీఎంఎస్‌లు ఏకగ్రీవమైనట్లు ప్రకటించారు. రిజర్వుడ్ స్థానాలకు కొన్నిచోట్ల సభ్యులు లేకపోవడంతో అన్ని డీసీసీబీల్లోని 180 డైరెక్టర్ పదవులకుగాను, 147 మంది ఎన్నికయ్యారు. ఇక అన్ని డీసీఎంఎస్‌లకు 90 మంది డైరెక్టర్ పదవులకుగాను, 74 మంది మాత్రమే ఎన్నికయ్యారు. రిజర్వుడ్ కేటగిరీలో ఎన్నిక జరగని 33 డీసీసీబీ డైరెక్టర్, 16 డీసీఎంఎస్ డైరెక్టర్ పదవులకు ఆరు నెలల్లో ఎన్నిక నిర్వహించే అవకాశముంది. సంబంధిత చైర్మన్లు, వైస్ చైర్మన్లు కోరితే వాటికి ఎన్నిక జరుగుతుందని సహకారశాఖ అడిషనల్ రిజిస్ట్రార్ సుమిత్ర తెలిపారు.

### 5న టెస్కాబ్ చైర్మన్ ఎన్నిక..

తెలంగాణ రాష్ట్ర సహకార అపెక్స్ బ్యాంక్ (టెస్కాబ్) చైర్మన్‌ను వచ్చే నెల 5న ఎన్నుకోనున్నారు. దీనికి సంబంధించిన నోటిఫికేషన్‌ను 3న జారీ చేస్తామని సహకార ఎన్నికల అథారిటీ వర్గాలు తెలిపాయి. ఇటీవల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (ప్యాక్స్) ఎన్నికలు జరిగిన సంగతి తెలిసిందే. మొత్తం 904 ప్యాక్స్‌లకు ఇటీవల చైర్మన్, వైస్ చైర్మన్లను ఎన్నుకున్న అనంతరం, వారు డీసీసీబీ, డీసీఎంఎస్ డైరెక్టర్లను ఏకగ్రీవం చేసుకున్నారు.

# మాజీ ఎమ్మెల్యే సంజీవరావు కన్నుమూత

- అస్వస్థతకు గురై నిమ్స్‌లో చికిత్స పొందుతూ తుది శ్వాస
- ఉన్నత ఉద్యోగం వదిలి రాజకీయ రంగ ప్రవేశం
- 2014లో వికారాబాద్ శాసనసభ్యుడిగా ఎన్నిక

వికారాబాద్ అర్బన్: వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే బి.సంజీవరావు (67) గుండెపోటుతో మంగళవారం మృతిచెందారు. హైదరాబాద్ చింతల్‌బస్తీలోని తన నివాసంలో సోమవారం రాత్రి ఛాతినొప్పి రావడంతో ఆయన్ను కుటుంబీకులు నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతుండగా మంగళవారం మధ్యాహ్నం గుండెపోటు రావడంతో మృతిచెందారు. ఆయనకు భార్య మధురవేణి, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఈ విషయం తెలుసుకున్న విద్యామంత్రి సబితాఇంద్రారెడ్డి, ఎమ్మెల్యేలు డాక్టర్ మెతుకు ఆనంద్, కాలె యాదయ్య, ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి, మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఆస్పత్రిలో సంజీవరావు మృతదేహానికి నివాళులర్పించారు.

### ఉన్నత ఉద్యోగం వదిలి..

వికారాబాద్ జిల్లా గేట్‌వనంపల్లి గ్రామానికి చెందిన బేగరి కమలమ్మ, దేవదాస్‌కు సంజీవరావు మొదటి సంతానం. వ్యవసాయ కుటుంబం నుంచి రావడంతో సంజీవరావు బీఎస్సీ అగ్రికల్చర్ చదివారు. గ్రూప్–2 ఉద్యోగం సాధించి ఏఓగా బాధ్యతలు చేపట్టారు. రాజకీయాలపై ఆసక్తితో ప్రభుత్వ ఉద్యోగానికి రాజీనామా చేసి 1994లో వికారాబాద్ అసెంబ్లీకి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. తర్వాత వికారాబాద్ మున్సిపల్ చైర్మన్‌గా, ధారూర్ జెడ్పీటీసీ సభ్యుడిగా ఎన్నికయ్యారు. టీడీపీ, వైఎస్సార్‌సీపీలో పనిచేశారు. 2014లో ఎన్నికల సమయంలో టీఆర్ఎస్ పార్టీలో చేరి వికారాబాద్ నుంచి పోటీ చేసి తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2018 ఎన్నికల నాటికే సంజీవరావు అనారోగ్యానికి గురవడంతో పార్టీ ఆయనకు టికెట్ ఇవ్వలేదు. అప్పటి నుంచి ఆయన టీఆర్ఎస్‌లో ఉన్నప్పటికీ పార్టీ కార్యక్రమాల్లో అంతగా పాల్గొనలేదు. కాగా, వికారాబాద్ జిల్లా నవాబుపేట మండలం గేట్‌వనంపల్లిలో బుధవారం మధ్యాహ్నం అంత్యక్రియలు నిర్వహించనున్నారు.



సంజీవరావు (ఫైల్)

**సీఎం కేసీఆర్ సంతాపం**

సంజీవరావు ఆకస్మిక మరణం పట్ల ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి సంతాపం ప్రకటిస్తూ, సంజీవరావు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. సంజీవరావు ఆత్మకు శాంతి చేకూరాలని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

## ప్రభుత్వ విధాన నిర్ణయంపై
# పిల్ దాఖలు చేయొచ్చా?

**సచివాలయ భవనాల కూల్చివేతకు సంబంధించి హైకోర్టుకు ప్రభుత్వం వినతి**

సాక్షి, హైదరాబాద్: నూతన సచివాలయ భవనాలు నిర్మించాలనేది ప్రభుత్వ విధాన నిర్ణయమని, పిల్ పేరుతో ప్రాథమిక దశలోని ప్రభుత్వ విధాన నిర్ణయాన్ని సవాల్ చేయడానికి వీల్లేదని, అలాంటి పిల్‌పై న్యాయస్థానం స్పందించవచ్చునో, లేదో తేల్చాలని రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టును కోరింది. ప్రజాహిత వ్యాజ్యాల (పిల్) పేరుతో ఎవరో వచ్చి ప్రభుత్వ విధాన నిర్ణయాన్ని ప్రశ్నించడానికి వీల్లేదని, అందుకే ఈ విషయంలో న్యాయపరమైన మీమాంసను ధర్మాసనం నివృత్తి చేయాలని అడ్వొకేట్ జనరల్ బీఎస్ ప్రసాద్ కోరారు. మంగళవారం హైకోర్టు ప్రారంభమైన వెంటనే ఈ విషయాన్ని ఆయన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్, న్యాయమూర్తి జస్టిస్ ఎ.అభిషేక్‌రెడ్డిల ధర్మాసనం ఎదుట ప్రత్యేకంగా ప్రస్తావించారు. ప్రభుత్వ విధాన నిర్ణయాల్లో జోక్యం చేసుకోడానికి వీల్లేదని, సచివాలయ భవనాల నిర్మాణ అంశం ప్రాథమిక విధాన నిర్ణయ దశలో ఉందని, దీనిపై న్యాయపరంగా సవాల్ చేయడానికి అవకాశం ఉందో లేదో తేల్చాలని కోరారు. ఆ నిర్ణయాన్ని న్యాయపరంగా సవాల్ చేసేందుకు అవకాశముందా, అలా చేస్తే చెల్లుబాటవుతుందా, ఇలాంటి దశలో న్యాయస్థానం జోక్యం చేసుకుని మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వడంపై కూడా తమకున్న న్యాయ మీమాంసపై స్పష్టత ఇవ్వాలని కోరారు. సచివాలయ భవనాలను కూల్చరాదంటూ దాఖలైన పిల్స్ కంటే ముందుగా తాము లేవనెత్తిన ఈ అంశంపై తుది విచారణ జరపాలని అభ్యర్థించారు. కాగా, సచివాలయ భవనాల్ని కూల్చరాదంటూ దాఖలైన పలు వ్యాజ్యాల్లో హైకోర్టు ఇటీవల మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో పిల్ పేరుతో ఎవరో వచ్చి హైకోర్టును ఆశ్రయించి ప్రభుత్వ విధాన నిర్ణయాన్ని సవాల్ చేయవచ్చో లేదో తేల్చాలని ఏజీ చేసిన వినతిపై మార్చి 3న తుది విచారణ జరుపుతామని ధర్మాసనం పేర్కొంది.



# చేర్యాలను రెవెన్యూ డివిజన్ చేయాలి

## డివిజన్ సాధన దీక్షలో ఎంపీ కోమటిరెడ్డి



**చేర్యాల (సిద్దిపేట):** అన్ని అర్హతలు ఉన్న చేర్యాలను వెంటనే రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలని భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం చేర్యాల పట్టణంలో రెవెన్యూ డివిజన్ సాధన కోసం ఒక రోజు దీక్షను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కోమటిరెడ్డి మాట్లాడుతూ ప్రజా అభిప్రాయం మేరకు జిల్లాల ఏర్పాటు చేశామంటున్న సీఎం కేసీఆర్, అన్ని అర్హతలు ఉండి, ప్రజలు కోరుతున్నా చేర్యాలను ఎందుకు రెవెన్యూ డివిజన్ చేయడం లేదని ప్రశ్నించారు. గతంలో చేర్యాల నియోజకవర్గ కేంద్రంగా ఉండేదని, పాలకుల నిర్లక్ష్యంతో అస్తిత్వాన్ని కోల్పోయిన చేర్యాలను రెవెన్యూ డివిజన్ చేసేంతవరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామన్నారు. అవసరమైతే నిరాహార దీక్షకు వెనకాడేది లేదని ఆయన స్పష్టం చేశారు. ఈ ప్రాంత ప్రజలు డివిజన్ స్థాయి కార్యాలయాలకు వెళ్లాలంటే సుమారు 50 కిలోమీటర్లు ప్రయాణం చేయాల్సి వస్తుందన్నారు. మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కేసీఆర్‌కు రోజులు దగ్గరపడ్డాయన్నారు. కొడుకు కోసం సిరిసిల్లను జిల్లా చేసిన సీఎం కేసీఆర్, ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట కోసం నారాయణరావుపేటను జిల్లా చేసి, ఉద్యమ సమయంలో వెన్నంటి నడిచిన చేర్యాలను చిన్నచూపు చూడడమేంటని విరుచుకుపడ్డారు.

# రోడ్డు ప్రమాదంలో అన్నదమ్ముల మృతి


తుల్జారాం


కృష్ణ

**జహీరాబాద్ టౌన్:** ద్విచక్ర వాహనంపై వెళ్తున్న అన్నదమ్ములను స్కూల్ బస్సు ఢీకొనడంతో వారు తీవ్ర గాయాలై చికిత్స పొందుతూ మృతిచెందారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలో మంగళవారం ఈ విషాదకర సంఘటన జరిగింది. జహీరాబాద్ టౌన్ ఎస్‌ఐ వెంకటేశ్, ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. జహీరాబాద్ పట్టణం కాంతారెడ్డి కాలనీలో నివాసం ఉంటున్న అంబాజీకి, తుల్జారాం(14), కృష్ణ (10) అనే కొడుకులు ఉన్నారు. వీరు జహీరాబాద్ పట్టణంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి, 5వ తరగతి చదువుతున్నారు. మంగళవారం ఉదయం ఇద్దరు పిల్లలు పండ్ల మార్కెట్‌కు వెళ్లి పుచ్చకాయలను కొనుగోలు చేసి మోపెడ్‌పై పెట్టుకుని ఇంటికి వస్తున్నారు. వీరు రాంనగర్ వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న స్కూల్ బస్సు ఢీకొట్టింది. దీంతో అన్నదమ్ములిద్దరికీ తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు గమనించి అంబులెన్స్‌లో పట్టణంలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అన్నదమ్ములు మృతి చెందారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## జంట హత్యల కేసులో
# ఏడుగురికి జీవిత ఖైదు

**నల్లగొండ:** భూ తగాదాల నేపథ్యంలో జరిగిన జంటహత్యల కేసులో ఏడుగురు నిందితులకు నల్లగొండ కోర్టు జీవితఖైదు విధించింది. దీంతో పాటు రూ.1.8 లక్షల జరిమానా విధిస్తూ జిల్లా ప్రిన్సిపల్ అండ్ సెషన్స్ కోర్టు నాయమూర్తి ఎంవీ రమేశ్ బాబు మంగళవారం తీర్పునిచ్చారు. రెండు సంవత్సరాల్లో కేసు విచారణ పూర్తి చేసి నిందితులకు శిక్ష విధించారు. నల్లగొండ జల్లా కోర్టులో భూతగాదాల విషయంలో ఒకేసారి ఏడుగురికి జీవిత ఖైదు విధించడం ఇదే మొదటిసారి కావడం గమనార్హం. వివరాల్లోకి వెళ్తే.. నల్లగొండ జిల్లా కనగల్ మండలం కురంపల్లి గ్రామశివారులో సర్వే నంబర్ 937, 938లో 11 ఎకరాలు దాసరి యాదయ్య సాగు చేసుకుంటున్నాడు. కాగా పక్కనే ఉన్న దోటి మణెమ్మకు చెందిన 2.25 ఎకరాల భూమిని కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. మణెమ్మ.. భర్తతో సంబంధం లేకుండా వేరుగా ఉంటున్నది. దీంతో ఆమె భర్త అక్కలయ్య.. తనకు తెలియకుండా విక్రయించడం, దాసరి యాదయ్య కొనుగోలు చేయడంతో ఆ కుటుంబంపై ఆగ్రహం పెంచుకున్నాడు. తమ భూమిని ఎలాగైనా తన సొంతం చేసుకోవాలని అక్కలయ్య తన తండ్రి దోటి పాండరయ్య, సోదరులు మల్లేశ్, వెంకటేశంతోపాటు వెంకటేశం కుమారులు సైదులు, కిరణ్, భరత్‌లు పథకం ప్రకారం 2017, ఆగస్టు 21న దాసరి యాదయ్య కుమారులైన అంజనేయులు, అన్నమయ్యలను కర్రలు, గొడ్డళ్లతో నరికి చంపారు. ఈ సంఘటనపై తండ్రి యాదయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న కనగల్ పోలీసులు నిందితులను అరెస్టు చేసి కేసు నమోదు చేశారు. ఈ కేసులో పోలీసుల తరపున అడిషనల్ పీపీ జి. జవహర్‌లాల్ వాదించారు.

# ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య


సంధ్యారాణి

**పటాన్‌చెరు టౌన్:** నారాయణ రెసిడెన్షియల్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న ఓ విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం వెనుగొండ గ్రామానికి చెందిన చంద్రశేఖర్ కూతురు సంధ్యారాణి (16) రామచంద్రాపురం మండలం వెలిమేల గ్రామంలోని నారాయణ రెసిడెన్షియల్ కళాశాలలో ఇంటర్ ఎంపీసీ మొదటి సంవత్సరం చదువుతోంది. మంగళవారం భోజన సమయంలో సంధ్యారాణి బాత్‌రూమ్‌లోకి వెళ్లి తాడుతో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. దీంతో సంధ్యారాణిని కళాశాల యాజమాన్యం నలగండ్లలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


ఘటనా స్థలం వద్ద ఇన్నోవా,ద్విచక్ర వాహనం

# దంపతులను ఢీకొట్టిన సీఐ వాహనం

- అక్కడికక్కడే మృతి చెందిన దంపతులు
- తమ తప్పు లేదన్న పోలీసులు

**రాయపర్తి:** సీఐ వాహనం ఢీకొనడంతో ఓ జంట అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ఘటన వరంగల్ రూరల్ జిల్లా రాయపర్తి మండలం తిర్మలాయపల్లిలో మంగళవారం చోటు చేసుకుంది. ఈ ఘటనలో గాయపడిన మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. వరంగల్ అర్బన్ జిల్లా ఐనవోలు మండలం రాంనగర్‌కు చెందిన బొమ్మకంటి రాజు (40), అతని భార్య రాణి (33), మరదలు కవితతో కలిసి బైక్‌పై వర్ధన్నపేట నుంచి తిర్మలాయపల్లి మీదుగా వెళ్తున్నారు. ఈ క్రమంలో పాలకుర్తి సీఐ రమేశ్‌కు చెందిన పోలీసు వాహనం (ఇన్నోవా) మూలమలుపు నుంచి వస్తున్న రాజు బైక్‌ను బలంగా ఢీకొట్టింది. రాజు, రాణి అక్కడికక్కడే మృతి చెందగా, కవితకు తీవ్రగాయాలు అయ్యాయి. దీంతో ఆమెను మెరుగైన చికిత్స కోసం ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం వర్ధన్నపేట మార్చురీకి తరలించారు. అయితే రాజు బైక్‌ను సీఐ వాహనం ఢీకొట్టిందనేది వాస్తవం కాదని వర్ధన్నపేట ఏసీపీ గొల్ల రమేశ్ ఓ వీడియో ప్రకటనలో వెల్లడించారు. ముందు వెళ్తున్న ట్రాలీ వాహనాన్ని ఓవర్‌టేక్ చేయబోయిన రాజు పాలకుర్తి సీఐ వాహనాన్ని ఢీకొట్టాడని ఆ ప్రకటనలో ఏసీపీ చెప్పారు. అయితే, ఈ విషయమై ట్రాలీ డ్రైవర్ మరో వీడియోలో స్పందిస్తూ.. ఎదురెదురుగానే బైక్, పోలీస్ వాహనం ఢీకొన్నాయని చెప్పడం గమనార్హం. అయితే కేసును పోలీసులు తప్పుదోవ పట్టిస్తున్నారని పలువురు చెబుతుండటం చర్చనీయాంశంగా మారింది.

# నేటి నుంచి యాదాద్రి బ్రహ్మోత్సవాలు


స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులు

**సాక్షి, యాదాద్రి:** యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. బుధవారం నుంచి మార్చి 7 వరకు ఈ ఉత్సవాలు జరగనున్నాయి. గవర్నర్ తమిళిసై, సీఎం కేసీఆర్, దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డితోపాటు పలువురు ప్రముఖులను ఆలయ అధికారులు కల్యాణోత్సవానికి ఆహ్వానించారు. బ్రహ్మోత్సవాల్లో ప్రధానమైన ఎదుర్కోలు ఉత్సవాన్ని మార్చి 3న బాలాలయంలో నిర్వహిస్తారు. ఆ రోజు ఉదయం 11 గంటలకు స్వామివారికి జగన్మోహిని అలంకారం, రాత్రి 9 గంటలకు అశ్వవాహన సేవ ఉంటుంది. 4న ఉదయం 10 గంటలకు శ్రీరామ అలంకారం, స్వామివారికి హనుమంత సేవ నిర్వహిస్తారు. తర్వాత గజవాహన సేవ, మధ్యాహ్నం బాలాలయంలో తిరుకల్యాణ మహోత్సవం నిర్వహిస్తారు. అలాగే కొండ కింద అదే రోజు రాత్రి 8 గంటల నుంచి 10 గంటల వరకు పాత జెడ్పీ స్కూల్ ఆవరణలో స్వామివారి కల్యాణ మహోత్సవం నిర్వహిస్తారు. 5న ఉదయం 11 గంటలకు స్వామివారికి శ్రీ మహావిష్ణువు అలంకారం, గరుడ వాహన సేవ నిర్వహించి, రాత్రి 7 గంటల నుంచి 7.30 గంటల వరకు బాలాలయంలో స్వామి వారి దివ్య విమాన రథోత్సవాన్ని, రాత్రి 8 గంటల నుంచి వైకుంఠ ద్వారం నుంచి దేవస్థాన ప్రచార రథం ఊరేగిస్తారు. 6న ఉదయం 10.30 గంటలకు పూర్ణాహుతి, చక్రతీర్థం నిర్వహిస్తారు. 7న ఉదయం 10 గంటలకు అష్టోత్తర శతఘటాభిషేకం, రాత్రి 9 గంటలకు శృంగార డోలోత్సవం నిర్వహించడంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని వంశపారంపర్య ధర్మకర్త వి.నరసింహమూర్తి, దేవస్థానం ఈఓ ఎన్.గీతారెడ్డి తెలిపారు.

# అవినీతి రహిత పాలనే లక్ష్యం

## దేవరకొండ 'పట్టణ ప్రగతి'లో మంత్రి కేటీఆర్

- ప్రభుత్వ పథకాల కోసం ఎవరికీ లంచం ఇవ్వాల్సిన పనిలేదు
- ఏప్రిల్ 2 నుంచి టీఎస్‌బీపాస్ అమలు

**కొండమల్లేపల్లి:** రాష్ట్రంలో అవినీతి రహిత పాలన అందించడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కె.తారకరామారావు (కేటీఆర్) అన్నారు. పట్టణ ప్రగతి కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆయన నల్లగొండ జిల్లా దేవరకొండ పట్టణంలో పర్యటించారు. అనంతరం వార్డు కమిటీల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ పథకాల లబ్ధి పొందేందుకు ఎవరికీ లంచం ఇవ్వాల్సిన పని లేదని పేర్కొన్నారు. మున్సిపాలిటీల్లో 75 గజాల సొంత స్థలంలో ఇల్లు కట్టుకునే వారు అనుమతికోసం దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదని, 75 నుంచి 600 గజాల స్థలంలో ఇల్లు కట్టుకోవాలి అనుకునే వారు మున్సిపాలిటీకి ఒక్క దరఖాస్తు ఇస్తే 21 రోజుల్లో అధికారులు అనుమతులు ఇచ్చేలా చట్టం వచ్చిందని గుర్తు చేశారు. 21 రోజుల్లో ఇవ్వకపోతే 22వ రోజు అనుమతుల పత్రం మీకు వచ్చి చేరుతుందన్నారు. ఇందుకోసం టీఎస్‌బీపాస్ విధానాన్ని ఏప్రిల్ 2 నుంచి అమలు చేయనున్నట్లు ఆయన ప్రకటించారు. సెల్ఫ్ అసెస్‌మెంట్ ద్వారా ఇంటి పన్ను ఎంత చెల్లించాలో ప్రజలే నిర్ణయించుకోవచ్చునని, ఒకవేళ తప్పుడు సమాచారం ఇస్తే వారికి 25 రెట్ల జరిమానా విధిస్తారని మంత్రి తెలిపారు. మున్సిపాలిటీల సమగ్రాభివృద్ధికి ముఖ్యమంత్రి కేసీఆర్ పట్టణ ప్రగతి కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. వచ్చే నాలుగేళ్ల వరకు రాష్ట్రంలో ఎలాంటి ఎన్నికల్లేవని, అయినా తమ ప్రభుత్వం నూతన పథకాలకు శ్రీకారం చుడుతోందని ఆయన గుర్తు చేశారు. తడిచెత్తతో వర్మి కంపోస్టు ఎరువులు, పొడిచెత్తతో విద్యుత్‌ను ఉత్పత్తి చెయ్యొచ్చనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గ్రహించాలని సూచించారు. తన నియోజకవర్గమైన సిరిసిల్లలో పొడిచెత్తను వేరు చేసి విక్రయించడం వల్ల మెప్మా సిబ్బంది ప్రతి నెలా రూ.3 లక్షల వరకు సంపాదిస్తున్నారని, దేవరకొండలో రూ.3 లక్షలు కాకపోయినా కనీసం రూ.లక్ష అయినా సంపాదించే అవకాశం ఉందని పేర్కొన్నారు. పట్టణ ప్రగతిలో వార్డుల ప్రత్యేక అధికారులు, కమిటీ సభ్యులతోపాటు వార్డు కౌన్సిలర్లు క్రియాశీలకంగా వ్యవహరించాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. జీహెచ్‌ఎంసీలో అమలు చేస్తున్న పరిచయం కార్యక్రమాన్ని రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీల్లో అమలు చేయనున్నట్లు మంత్రి తెలిపారు. ఇందులో భాగంగా పారిశుద్ధ్య సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి వారిని పరిచయం చేసుకొని ఫోన్‌నంబర్ ఇస్తారని తెలిపారు. తద్వారా చెత్త సేకరణ బండి రాకున్నా సిబ్బందికి నేరుగా ఫోన్ చేసే అవకాశం ఉంటుందన్నారు. అనంతరం పట్టణంలో నిర్మించిన ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయాన్ని మంత్రి ప్రారంభించారు. మంత్రి వెంట కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, ఎమ్మెల్యే రవీంద్రకుమార్, ఎమ్మెల్సీలు కర్నె ప్రభాకర్, తేరా చినపరెడ్డి తదితరులున్నారు.


దేవరకొండ పట్టణంలో మిషన్ భగీరథ నీళ్లు తాగుతున్న మంత్రి కేటీఆర్

**ఇంటింటికీ.. కేటీఆర్**

పట్టణ ప్రగతిలో భాగంగా దేవరకొండ పట్టణంలోని 10వ వార్డులో కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, ఎమ్మెల్యే రవీంద్రకుమార్, ఎమ్మెల్సీ, అధికారులతో కలసి మంత్రి కేటీఆర్ పర్యటించారు. ఈ సందర్భంగా మహిళలు మంత్రికి నుదుట తిలకం దిద్ది హారతులు పట్టారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి వారి బాగోగులు..సమస్యలను తెలుసుకున్నారు. మిషన్ భగీరథ ద్వారా కృష్ణా జలాలు సక్రమంగా సరఫరా అవుతున్నాయా.. ఇంట్లోని తడి, చెత్త పొడిచెత్తను ఎక్కడ పడవేస్తున్నారు?.. మీకు చెత్త బుట్టలు పంపిణీ చేశారా?.. అంటూ మంత్రి ప్రశ్నించారు. వార్డు పరిధిలో తిరుగుతున్న సందర్భంలో దేవరకొండ మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ ఇంటి సమీపంలో ఉన్న ఖాళీ స్థలాల్లో చెత్తాచెదారం పేరుకుపోవడంతో మంత్రి కొంత అసహనం వ్యక్తం చేశారు.

**ఒక్కొక్కరు ఒక్కో కేసీఆర్ కావాలి**

**సాక్షి, నాగర్‌కర్నూల్:** పట్టణ ప్రగతిలో ఒక్కో వార్డు కౌన్సిలర్ వారి వార్డుకు ఒక్కో కేసీఆర్‌లా వ్యవహరించాలని మంత్రి కేటీఆర్ అన్నారు. మంగళవారం ఆయన పట్టణ ప్రగతి కార్యక్రమంలో భాగంగా నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తిలో వార్డు కౌన్సిలర్‌లతో నిర్వహించిన ముఖాముఖిలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు ప్రధాన అంశాలైన కనీస మౌలిక వసతులను కల్పించాలన్న ఉద్దేశంతోనే పల్లెప్రగతి, పట్టణ ప్రగతి కార్యక్రమాలను చేపట్టినట్లు చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా చాలా మున్సిపాలిటీలలో అక్రమ లేఔట్లు పెరిగిపోయాయని, వాటన్నింటిని గుర్తించాలని డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ సత్యనారాయణను మంత్రి ఆదేశించారు. వెంటనే అన్ని మున్సిపాలిటీలకు సర్క్యులర్‌లను జారీచేయాలని సూచించారు.



## అవ్వా.. పెన్షన్ వస్తోందా..?

'అవ్వా పెన్షన్ వస్తోందా'అంటూ మంత్రి కేటీఆర్ ఓ వృద్ధురాలిని ఆప్యాయంగా పలకరించారు. దేవరకొండ పట్టణంలో ఏర్పాటుచేసిన పట్టణ ప్రగతి కార్యక్రమంలో భాగంగా 10వ వార్డులో ఆయన పర్యటించారు. వీధిలో కూర్చున్న ఓ వృద్ధురాలి వద్దకు వెళ్లి ముచ్చటించారు. వారి మధ్య సంభాషణ ఇలా సాగింది..

**కేటీఆర్ :** అవ్వా నీ పేరేంది..బాగున్నావా..
రుద్రాక్షి ముత్తమ్మ, బాగున్న..
**కేటీఆర్ :** నీకు పెన్షన్ వస్తుందా..ఎంత వస్తుంది
**ముత్తమ్మ :** వస్తుంది అయ్యా.. రూ.రెండు వేలు ఇస్తున్నరు
**కేటీఆర్ :** కంటి ఆపరేషన్ చేయించుకున్నట్లుంది.. ఎక్కడ, ఎవరు చేశారు?
**ముత్తమ్మ :** అవునయ్య..కళ్లు సరిగా కనపడడం లేదు. కంటివెలుగులో చూయించుకున్నా. పరీక్షలు చేసిండ్రు. నల్లగొండకు పంపితే అక్కడ ఆపరేషన్ చేసిండ్రు.
**కేటీఆర్:** అద్దాలు బాగున్నయ్
**ముత్తమ్మ:** ఆపరేషన్ చేసినంక వారే ఇచ్చారు. అయ్యా.. నాకు డబుల్ బెడ్రూం ఇల్లు ఇప్పించు నాయనా..

# రూ.1,500 కోట్లతో మిషన్ భగీరథ పునరుద్ధరణ

**ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు**

**సదాశివపేట(సంగారెడ్డి):** రాష్ట్రంలోని 38 ప్రాంతాల్లో వివిధ కారణాలతో నిలిచిపోయిన మిషన్ భగీరథ పనుల పునరుద్ధరణకు ముఖ్యమంత్రి కేసీఆర్ రూ.1,500 కోట్ల నిధులను ప్రత్యేకంగా కేటాయించారని ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. మంగళవారం సంగారెడ్డి జిల్లా సదాశివపేటలో జరిగిన పట్టణ ప్రగతి కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ఈ విషయం తెలిపారు. నెలలోపు టెండర్ ప్రక్రియను పూర్తి చేసి ఈ పనులు ప్రారంభిస్తామన్నారు. రాష్ట్రంలో 90 శాతం మంది ప్రజలు మిషన్ భగీరథ నీరు తాగుతున్నారని, మిగతా 10 శాతం మందికి వివిధ కారణాలతో తాగునీరు అందించలేకపోతున్నామని మంత్రి తెలిపారు. ఓట్లప్పుడు రాజకీయ నాయకులు వస్తారని ప్రజలు అనుకుంటారని, కానీ తాము అలా కాకుండా నాలుగేళ్ల వరకు ఓట్లు లేని సమయంలో వచ్చి ప్రజా సమస్యలను తెలుసుకునేందుకు పట్టణ ప్రగతి కార్యక్రమం చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, కలెక్టర్ హనుమంతరావు, అదనపు కలెక్టర్ రాజర్షీషా, ఆర్డీఓ నాగేష్, మాజీ ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, మున్సిపల్ చైర్ పర్సన్ పిల్లోడి జయమ్మ, వైస్ చైర్మన్ చింతా గోపాల్ పాల్గొన్నారు.


పట్టణప్రగతిలో మాట్లాడుతున్న హరీశ్‌రావు

# భర్తను హత్య చేసిన భార్య

**మెదక్ రూరల్:** వివాహేతర సంబంధానికి అడ్డు తగులుతున్నాడని ఓ మహిళ భర్తను కడతేర్చిన సంఘటన మెదక్ జిల్లా హవేళిఘనాపూర్ మండలం శమ్నాపూర్‌లో మంగళవారం వెలుగుచూసింది. పోలీసుల కథనం ప్రకారం.. శమ్నాపూర్ గ్రామానికి చెందిన సగపొల్ల మల్లయ్య(40) అతని భార్య లక్ష్మి మధ్య గత కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. భార్య లక్ష్మి మరో వ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకున్నట్లు తెలియడంతో ఇంట్లో కలహాలు మొదలయ్యాయి. దీంతో అడ్డుగా ఉన్న భర్తను హత్య చేయాలని ఆమె పథకం వేసింది. సోమవారం రాత్రి మల్లయ్యతో గొడవపడిన లక్ష్మి, తీవ్ర ఆవేశానికి గురై భర్త గొంతు గట్టిగా నులిమింది. దీంతో మల్లయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. మల్లయ్య మృతి చెందిన విషయం గమనించిన గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. మెదక్ రూరల్ సీఐ రాజశేఖర్, ఎస్‌ఐ శేఖర్‌రెడ్డిలు సంఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టగా మల్లయ్యను తానే చంపినట్లు లక్ష్మి అంగీకరించింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# మళ్లీ తెరపైకి నయీం ఆస్తుల కేసు

**కుటుంబ సభ్యులకు ఐటీశాఖ నోటీసులు జారీ**

**సాక్షి, యాదాద్రి:** గ్యాంగ్‌స్టర్ నయీం ఆస్తుల కేసు మరోసారి తెరపైకి వచ్చింది. 2016 ఆగస్టు 8న నయీం పోలీసుల ఎన్‌కౌంటర్‌లో చనిపోయిన విషయం తెలిసిందే. నయీం జీవించిన కాలంలో బెదిరింపులు, భూకబ్జాలు సెటిల్‌మెంట్‌లతో భువనగిరితో పాటు రాష్ట్ర వ్యాప్తంగా పలు నేరాలకు పాల్పడిన విషయం తెలిసిందే. నయీం ఎన్‌కౌంటర్ తర్వాత పలువురు బాధితులు ప్రభుత్వాన్ని, పోలీసులను కలసి తమకు జరిగిన నష్టాన్ని వివరించారు. ఈ నేపథ్యంలో సిట్ ఏర్పాటు చేసిన ప్రభుత్వం నయీం అక్రమాలు, అతని అనుచరుల ఆగడాలపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తోంది. భువనగిరి పరిసర ప్రాంతాలు, యాదగిరిగుట్ట, ఔషాపూర్, కీసర, ఆదిభట్ల, శంషాబాద్, మిర్యాలగూడ, నల్లగొండ, హైదరాబాద్, అబ్దుల్లాపూర్‌మెట్, చౌటుప్పల్, కుందాన్‌పల్లి, సరూర్‌నగర్, మరికొన్ని ప్రాంతాల్లో బినామీ ఆస్తుల లావాదేవీలను సిట్ గుర్తించింది. ఈ క్రమంలో నయీం కుటుంబ సభ్యులు, అనుచరుడికి ఐటీశాఖ మూడోసారి షోకాజు నోటీసులు జారీ చేసింది.

**అనంతారం భూములపై..**

జిల్లా కేంద్రమైన భువనగిరిలో గల నయీం ఇంటికి మంగళవారం ఐటీశాఖ నోటీసులు అతికించింది. నయీం తల్లి తాహెరాబేగం, భార్య హసీనాబేగం, అక్క సలీమాబేగం, అనుచరుడు పాశం శ్రీనివాస్ పేర్ల మీద నోటీసులు అతికించింది. భువనగిరి మండలం అనంతారం గ్రామ పరిధిలో గల సర్వేనంబర్ 340/ఏ4, 340/ఏ5, 340/ఏ6లో గల 9 ఎకరాల ఎనిమిదింపావు గుంటల భూమిని వీరు కొనుగోలు చేశారు. వీటిని కొనుగోలు చేయడానికి డబ్బు ఎలా వచ్చిందో తెలపాలని ఐటీ శాఖ కోరింది. లేనిపక్షంలో నయీం బినామీలుగా గుర్తించి బినామీ ఆస్తుల నిరోధక చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని ఐటీ అధికారులు నోటీసుల్లో పేర్కొన్నారు.

# ఉన్నదెంత.. లేనిదెంత..?

- సాగునీటి శాఖ పరిధిలో సేకరించిన భూమి 6.5 లక్షల ఎకరాలు
- ఇందులో 2 లక్షల ఎకరాలకుపైగా జరగని భూ బదలాయింపులు
- ఈ భూములన్నీ కబ్జాల్లోకి
- సీఎం ఆదేశాలతో లెక్కలన్నీ బయటకు తీస్తున్న ఇంజనీర్లు

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణాల కోసం సేకరించిన భూముల లెక్కలపై అయోమయం నెలకొంది. ప్రాజెక్టుల కోసం సేకరించిన భూములకు సంబంధించి భూ యజమానుల నుంచి సాగునీటి శాఖకు బదలాయింపు ప్రక్రియ సహేతుకంగా జరుగకపోవడంతో సేకరించిన లెక్కలకు, ప్రస్తుతం శాఖ పరిధిలో ఉన్న భూములకు పొంతన కుదరడం లేదు. పాత, కొత్త ప్రాజెక్టులతోపాటు చెరువులు, కాల్వల అవసరాలకు సుమారు 6.5 లక్షల ఎకరాలను సేకరించగా.. ఇందులో కనిష్టంగా 2 లక్షల ఎకరాలకు సంబంధించి భూరికార్డుల నిర్వహణ సరిగా లేక అవన్నీ కబ్జాదారుల చేతుల్లోకి వెళ్లిపోయాయని సాగునీటి శాఖ గుర్తించింది.

**సొమ్మొకడిది.. సోకొకడిది..**

రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న, నిర్మాణం పూర్తయిన ప్రాజెక్టుల కింద ఉన్న పంపులు, మోటార్లు, గేట్లు, ట్రాన్స్‌ఫార్మర్‌లు, కాల్వలు, టన్నెళ్లు, వాటి పొడవు, రిజర్వాయర్‌లు, వాటి పరిధిలోని లిఫ్టులు, భూములు, భవనాలు తదితర వివరాలన్నీ ముందుగా తేల్చి, వాటి నిర్వహణకు అవసరమైన వ్యూహాన్ని, మ్యాన్యువల్‌ను ఖరారు చేయాలని సీఎం కేసీఆర్ ఇటీవల సమీక్ష సందర్భంగా అధికారులను ఆదేశించారు. దీంతో ఇంజనీర్లు భూముల లెక్కలు తేల్చే పనిలో పడ్డారు. ఈ సందర్భంగానే చాలా చోట్ల ప్రాజెక్టు కింద భూములు తీసుకున్నా, తిరిగి అవన్నీ కబ్జాదారుల చేతుల్లోకి వెళ్లాయని, అక్కడ నిర్మాణాలు జరిగిపోయాయని గుర్తించారు. ఇక చాలా చోట్ల శాఖ సేకరించిన లక్షల ఎకరాల భూములకు రైతుబంధు సొమ్ములు సైతం తీసుకుంటున్నారన్న విషయాలు బయటకొచ్చాయి. ముఖ్యంగా నాగార్జునసాగర్, ఎస్సారెస్పీ, నిజాంసాగర్ ప్రాజెక్టు, వాటి పరిధిలోని చెరువుల కిందే కనీసంగా 1.50 లక్షల ఎకరాలకు పైగా భూమి రికార్డులు సరిగా లేక అవన్నీ కబ్జాదారుల చేతుల్లోకి వెళ్లాయని అధికారులు గుర్తించారు. భూసేకరణ పక్కాగా చేసినా.. రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యంతో భూములు సాగునీటి శాఖకు మ్యుటేషన్ కాకపోవడంతో వాటిని తిరిగి స్వాధీనం చేసుకునే అవకాశం కూడా లేకుండా పోయిందని ఇంజనీర్లు ప్రభుత్వం దృష్టికి తెచ్చారు. అయితే ఆయా ప్రాజెక్టుల పరిధిలోని జిల్లాలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కార్యాలయాల్లో వీటికి సంబంధించిన రికార్డులకు బూజు దులపాలని, సర్వే నంబర్ల ఆధారంగా శాఖ భూములను గుర్తించాలని నిర్ణయించారు. ఇక చాలా చోట్ల చెరువుల ఫుల్ ట్యాంక్ లెవల్‌లో (ఎఫ్‌టీఎల్), కాల్వల కోసం సేకరించిన భూముల్లోకి వచ్చి చాలా చోట్ల నిర్మాణాలు చేశారని, ఇది సుమారు మరో 50 వేల ఎకరాల మేర ఉంటుందని గుర్తించారు. 2004లో జలయజ్ఞం ప్రాజెక్టులు, కొత్త ప్రాజెక్టుల కింద 3.97 లక్షల సేకరణ చేయాలని నిర్ణయించగా, ఇందులో 3.44 లక్షల ఎకరాలు సేకరించారు.


ఈఎన్‌సీలతో సమావేశమైన రజత్‌కుమార్

**ఇంజనీర్లతో కీలక భేటీ..**

శాఖ పరిధిలోని భూములపై మంగళవారం ప్రిన్సిపల్ సెక్రటరీ రజత్‌కుమార్ అన్ని ప్రాజెక్టుల సీఈలు, ఎస్‌ఈలతో జలసౌధలో కీలక భేటీ నిర్వహించారు. భూముల్లో ప్రస్తుతం శాఖ పరిధిలో ఉన్నవెన్ని, లేనివెన్నో మార్చి 2వ తేదీ నాటికి తేల్చాలని, 15 నాటికి నివేదికలు సిద్ధం చేయాలని ఇంజనీర్లను ఆదేశించారు. 16న మరోమారు కబ్జాల్లో ఉన్న భూములకు సంబంధించి ప్రభుత్వంతో చర్చించి నిర్ణయిద్దామని తెలిపారు.

# పల్లె ప్రగతిలో 'వీడియో షూట్'

- పనుల ప్రగతిని వీడియో తీసి పోస్టు చేయాలని కార్యదర్శులకు కలెక్టర్ల ఆదేశాలు
- పల్లె నిద్రలు చేయాలని కొందరు కలెక్టర్లు ఉత్తర్వులు
- మండిపడుతున్న ఉద్యోగ సంఘాలు.

**సాక్షి, హైదరాబాద్:** పల్లె ప్రగతి కార్యక్రమ అమలు, పర్యవేక్షణ విషయంలో ఉన్నతాధికారులు, పంచాయతీ సిబ్బంది మధ్య పొసగడం లేదు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకుగాను కొందరు జిల్లా కలెక్టర్లు తీసుకుంటున్న నిర్ణయాలు ఇబ్బందికరంగా మారాయని పంచాయతీరాజ్ ఉద్యోగసంఘాలంటున్నాయి. ఉదయం 6 గంటలకే గ్రామాల్లో పర్యటించాలని, విధిగా వాట్సాప్ కాల్ చేయాలని, ప్రతి 2 గంటలకు వీడియో పుటేజీని పోస్ట్ చేయాలనే షరతులు విధించడం పట్ల ఉద్యోగసంఘాలు తీవ్రంగా మండిపడుతున్నాయి. వర్క్ టు రూల్ నిబంధనకు విరుద్ధంగా ఉదయం 6 నుంచి సాయంత్రం 6 వరకు పనిచేయాలని ఒత్తిడి చేయడం సరికాదని అంటున్నాయి.

**కామారెడ్డి మొదలు భూపాలపల్లి వరకు**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతి 3 నెలలకోసారి పల్లె ప్రగతి కార్యక్రమాన్ని నిర్వహించాలని నిర్ణయించింది. ఇప్పటికే రెండు విడతల్లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ, మురుగు కాల్వల్లో పూడికతీత, పాత బావులు, బోరుబావుల పూడ్చివేత, పిచ్చిమొక్కల తొలగింపు పనులతో పాటు ప్రతి పంచాయతీలో కంపోస్టు యార్డు ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం నిర్దేశించింది. ఈ క్రమంలోనే ఆ పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని గ్రామ కార్యదర్శులు, మండల పంచాయతీ అధికారులను ఆదేశించింది. పనుల్లో వేగం పెంచేందుకు కలెక్టర్లు/అదనపు కలెక్టర్లు కొందరు..గ్రామ కార్యదర్శులు ప్రభాతవేళ పంచాయతీల్లో సందర్శించాలని హుకుం జారీ చేశారు. ఉదయం 8 గంటలకు వాట్సాప్ వీడియో కాల్ ద్వారా ఏ వీధిలో పర్యటిస్తున్నారో తెలపాలని కామారెడ్డి కలెక్టర్ ఆదేశించారు. ఇక భూపాలపల్లి కలెక్టర్ మరో అడుగు ముందుకేసి పారిశుద్ధ్య పనుల నిర్వహణ తీరును వీడియో చిత్రీకరించి..ప్రతి 2 గంటలకోసారి పోస్టు చేయాలని నిర్దేశించారు. మరోవైపు పల్లె నిద్రలు చేయాలని, తద్వారా గ్రామస్తులతో మమేకం కావాలని మహబూబ్‌నగర్ జిల్లా యంత్రాంగం ఆదేశించింది.

**అవమానించేలా చర్యలు**

పంచాయతీ కార్యదర్శుల పట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు సమర్థనీయం కాదు. 12 గంటలపాటు విధులు నిర్వర్తించాలనే ఆదేశాలు ఉపసంహరించుకోవాలి. పారిశుద్ధ్య నిర్వహణ, పల్లె ప్రగతిని నిరంతరం పర్యవేక్షిస్తున్నాం. కానీ, అవమాన పరిచేలా వీడియో పుటేజీ పంపాలనడం సరికాదు. ఇలా వ్యవహరిస్తే వర్క్ టు రూల్ పాటిస్తాం.

–మధుసూదన్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

సాక్షి భవిత
సోమవారం నుంచి శుక్రవారం వరకు
స్పర్ధయా వర్ధతే విద్య
బుధవారం 26-2-2020

మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్, సాక్షి దినపత్రిక,
రోడ్ నంబరు-1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34. ఈ-మెయిల్
sakshieducation@gmail.com

## నోటిఫికేషన్స్

### ఐఐఎం కోజికోడ్.. లిబరల్ స్టడీస్‌లో పీజీ

దేశంలోని ప్రతిష్టాత్మక విద్యాసంస్థ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కోజికోడ్.. కొత్త కోర్సు ప్రవేశపెట్టింది. లిబరల్ స్టడీస్‌లో పీజీ చేసే అవకాశాన్ని కల్పిస్తోంది. ఇందులో భాగంగా 2020–21 విద్యాసంవత్సరానికి సంబంధించిన 'పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్ ఇన్ లిబరల్ స్టడీస్ అండ్ మేనేజ్‌మెంట్' కోర్సులో ప్రవేశాల కోసం నోటిఫికేషన్ విడుదల చేసింది.

#### కోర్సు ప్రత్యేకత

ఉన్నతస్థాయి హోదా అయిన మేనేజర్ లాంటి ఉద్యోగాల్లో ఉన్నవారికి వైవిధ్యమైన ఆలోచనలు,కల్చరల్, ఎమోషనల్, క్రియేటివ్ ఇంటలిజెన్స్ తదితర లక్షణాలు ఉండేలా తీర్చిదిద్దడమే ఈ కోర్సు ప్రత్యేకత. మొదటి ఏడాది కోర్సులో భాగంగా లిబరల్ స్టడీస్, మేనేజ్‌మెంట్ సూత్రాలు, అలాగే రెండో సంవత్సరంలో అభ్యర్థుల స్పెషలైజేషన్లకు అనుగుణంగా కోర్సు ఉంటుంది.

#### అర్హత

- ఈ కోర్సుకు దరఖాస్తు చేసుకోవాలనుకునే అభ్యర్థులు ఏదైనా డిగ్రీ లేదా పీజీలో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి.
- ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులు యూజీ లేదా పీజీలో 45శాతం మార్కులు సాధిస్తే సరిపోతుంది.
- ప్రస్తుతం కోర్సు ఆఖరు ఏడాది చదివే అభ్యర్థులు కూడా దరఖాస్తుకు అర్హులే.
- క్యాట్/జీఆర్ఈ/జీమ్యాట్ 2019 స్కోర్ కలిగి ఉండాలి. ఈ మూడు పరీక్షల్లో ఎందులోనైనా జనరల్ అభ్యర్థులు మొత్తమ్మీద 80, వెర్బల్ 80, ఇతర సెక్షన్లలో 50 పర్సంటైల్ సాధించడం తప్పనిసరి. ఓబీసీ నాన్‌క్రిమిలేయర్, ఈడబ్ల్యూసీ అభ్యర్థులతే వరుసగా 70, 70, 50 పర్సంటైల్ సాధించాలి. అలాగే ఎస్సీలు 60, 60, 50; ఎస్టీలు 55, 55, 50 పర్సంటైల్ తప్పనిసరిగా సాధించినవారై ఉండాలి.

#### ఎంపిక ప్రక్రియ

- ఎంపిక ప్రక్రియలో భాగంగా తొలుత అభ్యర్థుల నుంచి వచ్చిన దరఖాస్తుల వడపోత ప్రక్రియ జరుగుతుంది. అభ్యర్థులు సాధించిన క్యాట్/జీఆర్ఈ/జీమ్యాట్ స్కోర్లతో పాటు అకడమిక్ మార్కులు, పని అనుభవం పరిశీలిస్తారు.
- దరఖాస్తుల వడపోత ప్రక్రియ అనంతరం జాబితాలో నిలిచిన అభ్యర్థులకు రైటింగ్ ఎబిలిటీ టెస్ట్, ఇంటర్వ్యూలను నిర్వహించి తుది ఎంపిక చేస్తారు. ఎంపికైన అభ్యర్థులకు జూలైలో తరగతులను ప్రారంభిస్తారు.

#### ముఖ్యమైన సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి
- **దరఖాస్తుకు చివరితేదీ:** మార్చి 31, 2020
- **పరీక్ష:** ఏప్రిల్ లేదా మే,2020
- **వెబ్‌సైట్:** www.iimk.ac.in

### కెరీర్ కౌన్సెలింగ్

నేటి టెక్నాలజీ యుగంలో కోర్సులు, కొలువులు, కెరీర్స్ రూపరేఖలు వేగంగా మారిపోతున్నాయి. రోజుకో టెక్నాలజీ తెరపైకి వస్తోంది. ఎన్నో రకాల ఉద్యోగాలు.. రకరకాల కోర్సులు.. విభిన్న నైపుణ్యాలు.. ఇలాంటి పరిస్థితుల్లో ప్రస్తుతం జాబ్ మార్కెట్ ట్రెండ్ ఎలా ఉంది.. ఏ కోర్సు చేస్తే.. ఎలాంటి ఉద్యోగం లభిస్తుంది.. భవిష్యత్ అవకాశాలు ఎలా ఉంటాయి.. ఇలా కెరీర్ ఎంపికలో మీ సందేహాలకు నిపుణులు సమాధానాలు ఇస్తారు.

మీరు చేయాల్సిందల్లా.. మీ సందేహాలను **sakshieducation@gmail.com**కు మెయిల్ చేయడమే!!

టెట్/డీఎస్సీ
- స్టడీ మెటీరియల్
- బిట్‌బ్యాంక్
- జీకే
- ఆన్‌లైన్ టెస్టులు
- మోడల్ పేపర్స్
- కరెంట్ అఫైర్స్
- ప్రీవియస్ పేపర్స్

వీడియో గైడెన్స్ మొదలైనవి.
విద్య, ఉద్యోగ సమాచారం కోసం
WWW.SAKSHIEDUCATION.COM
SAKSHI CURRENT AFFAIRS యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్, యాపిల్ యాప్ స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోండి

నేటి టాబ్లాయిడ్ విద్య పేజీల్లో...
10th Class
SRIGAYATRI EDUCATIONAL INSTITUTIONS
MATHEMATICS




ఐఏఎస్ నుంచి గ్రామ సచివాలయ పోస్టుల వరకు.. ప్రభుత్వ ఉద్యోగం ఏదైనా.. దానికుండే గుర్తింపే వేరు! అందుకే ఆయా సర్కారీ కొలువులకు నోటిఫికేషన్లు వెలువడినప్పుడు యువత పెద్దఎత్తున దరఖాస్తు చేస్తుంటారు. దీనికి ప్రభుత్వ ఉద్యోగంలో ఉండే భద్రత ఒక కారణమైతే.. మరో కారణం సమాజంలో లభించే గౌరవం! ఈ కారణాల వల్లే ఐటీలో ఐదంకెల జీతాలు అందుకుంటున్న వారు సైతం ప్రభుత్వ కొలువుకే జైకొడుతున్నారు. ఈ నేపథ్యంలో.. సివిల్స్, గ్రూప్స్, బ్యాంక్స్, నుంచి గ్రామ సచివాలయ పరీక్షల వరకూ.. సిలబస్‌లోని ఉమ్మడి అంశాలు, సన్నద్ధత, ప్రామాణిక పుస్తకాల గురించి తెలుసుకుందాం...

# పరీక్షలెన్నైనా.. ప్రిపరేషన్ ఒక్కటే!

- సివిల్స్, గ్రూప్స్, బ్యాంక్స్ వంటి పరీక్షల్లో కామన్ సిలబస్
- ఉమ్మడి అంశాలపై దీర్ఘకాలిక ప్రిపరేషన్‌తో విజయం
- ప్రామాణిక పుస్తకాలు చదవాలంటున్న నిపుణులు

ప్రతి సంవత్సరంలానే 2020 సైతం పలు నోటిఫికేషన్లతో సిద్ధమవుతోంది. ఇప్పటికే ప్రతిష్టాత్మక సివిల్ సర్వీసెస్ ప్రకటన వెలువడింది. కేంద్ర సర్వీసులకు సంబంధించి యూపీఎస్సీ, ఐబీపీఎస్, స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (ఎస్ఎస్‌సీ)లు క్యాలెండర్ ప్రకటించాయి. రాష్ట్ర స్థాయిలో ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో కొలువుల జోరు కొనసాగుతోంది. ఇప్పటికే లక్షల ఉద్యోగాలు భర్తీ చేశారు. మరోవైపు ఏపీలో ప్రప్రథమంగా క్యాలెండర్ విడుదల చేసి ఉద్యోగాల భర్తీకి రంగం సిద్ధమవుతోంది. వీటితోపాటు ప్రభుత్వ రంగ బ్యాంకులు క్రమం తప్పకుండా నోటిఫికేషన్లు విడుదల చేస్తున్నాయి. దీంతో ఉద్యోగార్థులు నోటిఫికేషన్స్‌తో సంబంధం లేకుండా.. దీర్ఘకాలిక ఉమ్మడి ప్రిపరేషన్ వ్యూహం అనుసరించడం ద్వారా ఏదో ఒక సర్కారీ కొలువు సొంతం చేసుకోవచ్చని నిపుణులు పేర్కొంటున్నారు.

## 70 శాతం కామన్ సిలబస్

సర్కారీ కొలువులను ఖాయంచేసే పోటీ పరీక్షలకు సిలబస్ 60–70 శాతం వరకు కామన్‌గానే ఉంటోంది. ఇది ఉద్యోగార్థులకు కలిసొచ్చే అంశం. ఇంటర్, డిగ్రీ పూర్తిచేసుకొని.. ప్రభుత్వ ఉద్యోగం సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్న అభ్యర్థులు ఉమ్మడి సిలబస్‌పై పట్టు సాధిస్తే.. ఏదో ఒక పరీక్షకే పరిమితమవ్వాల్సిన అవసరం ఉండదు. పోటీ పరీక్షల్లో సిలబస్‌ను పరిశీలిస్తే.. జనరల్ స్టడీస్, అర్థమెటిక్ (క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, న్యూమరికల్ ఎబిలిటీ, డేటాఇంటర్‌ప్రిటేషన్), మెంటల్ ఎబిలిటీ(రీజనింగ్), ఇంగ్లిష్ అంశాలు కామన్‌గా కనిపిస్తాయి. నోటిఫికేషన్స్‌కు అతీతంగా ఆయా టాపిక్స్‌పై పట్టుసాధిస్తే.. ఏ పరీక్షలో అయినా విజయం సాధించొచ్చు. సదరు సబ్జెక్టులకు ఏయే పుస్తకాలు చదవాలి.. పరీక్షలో ప్రశ్నల శైలి,కాఠిన్యత ఏ స్థాయిలో ఉంటుంది.. వంటివి ఇక్కడ కీలకం. అభ్యర్థులు పరీక్షలకు సంబంధించిన పాత ప్రశ్నపత్రాలు పరిశీలించడం, సిలబస్‌ను ఒకటికి రెండుసార్లు క్షుణ్నంగా అధ్యయనం చేయడం ద్వారా ప్రశ్నల శైలి, క్లిష్టతలపై అవగాహన లభిస్తుంది. తద్వారా ఒకే సమయంలో విభిన్న పరీక్షలకు సన్నద్ధత దిశగా ప్రయత్నించొచ్చు.

## జనరల్ స్టడీస్

పరీక్షేదైనా.. సిలబస్‌లో జనరల్ స్టడీస్ తప్పనిసరిగా ఉంటుంది! సివిల్స్ నుంచి రాష్ట్ర స్థాయి గ్రూప్–1, గ్రూప్–2, బ్యాంక్స్, వీఆర్వో, పంచాయతీ సెక్రటరీ వరకూ... అన్నింటా జనరల్ స్టడీస్‌దే సింహభాగం. ఇందులో కరెంట్ అఫైర్స్, నిత్య జీవితంలో సైన్స్ ప్రాముఖ్యత, పర్యావరణం, విపత్తు నిర్వహణ, భౌగోళిక అంశాలు, ఎకానమీ, రాజకీయ వ్యవస్థ, భారతదేశ చరిత్ర, తెలంగాణ/ఏపీ చరిత్ర, మెంటల్ ఎబిలిటీ, జనరల్ ఇంగ్లిష్ తదితర ఎన్నో అంశాల్లో అభ్యర్థుల పరిజ్ఞానాన్ని పరీక్షిస్తారు. కాబట్టి ఆయా అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. గతంలోలాగా జనరల్ స్టడీస్ బిట్లు ప్రాక్టీస్ చేసి, సింగిల్ లైన్ మెటీరియల్ చదివి పరీక్షల్లో స్కోర్ చేసే పరిస్థితి ఇప్పుడు లేదు. సబ్జెక్టుపై సమగ్ర పరిజ్ఞానం ఉంటేనే సమాధానాలు గుర్తించగలిగేలా ప్రశ్నలు అడుగుతున్నారు. కాబట్టి ఆ స్థాయి సన్నద్ధతకు ఉపకరించే మెటీరియల్ సేకరణ సైతం సవాలుగా మారింది. ఇలాంటి పరిస్థితుల్లో అకాడమీ పుస్తకాలు, ప్రామాణిక మెటీరియల్‌ను అనుసరించడం లాభిస్తుంది.



## రిఫరెన్స్ పుస్తకాలు

రోజూ ఒక ప్రామాణిక ఇంగ్లిష్ పేపర్, ఒక తెలుగు దిన పత్రిక చదువుతూ ముఖ్యాంశాలను నోట్ చేసుకోవాలి. ప్రభుత్వ విధానాలను తెలుసుకునేందుకు ప్రభుత్వాల మ్యాగజైన్లు, యోజన వంటివి ఉపకరిస్తాయి. పర్యావరణం,విపత్తు నిర్వహణకు సంబంధించి ప్రభుత్వ వెబ్‌సైట్లు చూడటంతోపాటు ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాలు చదవాలి. జాగ్రఫీ కోసం తెలుగు అకాడమీ, ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాలను అనుసరించాలి. పాలిటీకి లక్ష్మీకాంత్ పుస్తకాన్ని చాలామంది అనుసరిస్తున్నారు. పాలిటీకి సంబంధించి సమకాలీన రాజకీయ అంశాలకు ప్రాధాన్యం ఉంటుంది. భారతదేశ చరిత్రకు తెలుగు అకాడమీ, ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాలు, ఆధునిక భారతదేశ చరిత్రకు బిపిన్ చంద్ర, ప్రాచీన చరిత్రకు సతీష్ చంద్ర, మధ్యయుగ చరిత్రకు ఆర్‌ఎస్ శర్మ పుస్తకాలు ఉపయోగపడతాయి. తెలంగాణ ప్రాచీన చరిత్రకు తెలుగు అకాడమీ పుస్తకాలు, ఏపీ చరిత్రకు బీఎస్‌ఎల్ హన్మంతరావు, రఘునాథరావు పుస్తకాలు చదవడం లాభిస్తుంది. ఎకానమీ కోసం ఆర్థిక సర్వేలు, బడ్జెట్ విశ్లేషణలను తప్పక చదవాలి. తెలుగు అకాడమీ పుస్తకాలతోపాటు ఏదైనా ప్రామాణిక స్టడీ మెటీరియల్‌ను అనుసరించొచ్చు. మెంటల్ ఎబిలిటీకి ఆర్.ఎస్.అగర్వాల్ పుస్తకం, జనరల్ ఇంగ్లిష్‌కు రెన్ అండ్ మార్టిన్, వర్డ్ పవర్ మేడ్ ఈజీ పుస్తకాలు ఉపయుక్తం. వీటితోపాటు ఎథిక్స్‌కు తెలుగు అకాడమీ పుస్తకం, సోషియాలజీకి తెలుగు అకాడమీ పుస్తకాలు ఉపయోగపడతాయి.

## అర్థమెటిక్

సివిల్స్ ప్రిలిమ్స్‌లో సీ–శాట్ నుంచి వీఆర్వో వరకూ.. ప్రతి పరీక్షలో అర్థమెటిక్ ఉంటుంది. కొన్ని పరీక్షల్లో దీని వెయిటేజీ 40 శాతం మేర ఉంటోంది. ఇందులో పర్సంటేజెస్, యావరేజెస్, రేషియో–ప్రపోర్షన్, ప్రాఫిట్–లాస్, సింపుల్ ఇంటరెస్ట్– కాంపౌండ్ ఇంటరెస్ట్, టైమ్–వర్క్, టైమ్–డిస్టెన్స్, పర్ముటేషన్స్–కాంబినేషన్స్ తదితర అంశాలపై ఎక్కువగా దృష్టిపెట్టాలి. భాగహారాలు, కూడికలు, తీసివేతలు వంటి ప్రాథమిక అంశాలను నోటితో గణించేలా ప్రాక్టీస్ చేయాలి. సంఖ్యల వర్గాలు, ఘనాలు గుర్తించుకోవాలి. వీటివల్ల సింప్లిఫికేషన్స్, నంబర్ సిరీస్ ప్రశ్నలకు సులువుగా సమాధానాలు గుర్తించవచ్చు. సమయం కూడా ఆదా అవుతుంది. కొన్ని అంశాలను ప్రత్యేకంగా బ్యాంక్ పరీక్షల్లోనే అడుగుతారు. అవి.. డేటా సఫిషియన్సీ, క్వాడ్రాటిక్ ఈక్వేషన్స్. ఎస్ఎస్‌సీ, రైల్వే, పోలీస్ రిక్రూట్‌మెంట్ తదితర పరీక్షల్లో జామెట్రీ, ఆల్జీబ్రా, ట్రిగనామెట్రీ, కోఆర్డినేట్ జామెట్రీ, మెన్సురేషన్ అంశాలపై ఎక్కువగా ప్రశ్నలు ఉంటాయి. అర్థమెటిక్‌తోపాటు డేటా ఇంటర్‌ప్రిటేషన్ కూడా పరీక్షల్లో కీలకంగా నిలుస్తోంది. ఈ ప్రశ్నల సాధనకు పర్సంటేజెస్, యావరేజెస్, రేషియోలపై అవగాహన అవసరం.

## మెంటల్ ఎబిలిటీ/రీజనింగ్

అభ్యర్థుల అనలిటికల్ సామర్థ్యాన్ని పరీక్షించడానికి ఉద్దేశించిన విభాగం.. రీజనింగ్. ఇది దాదాపు అన్ని పోటీ పరీక్షల్లో ఉంటుంది. బ్యాంకింగ్ పరీక్షల్లో ఫలితాన్ని నిర్దేశించే విభాగమిది. బ్యాంకింగ్ పరీక్షల్లో హై లెవల్ రీజనింగ్‌పై ప్రశ్నలుంటాయి. అసంప్షన్స్, ఆర్గ్యుమెంట్స్, కాజ్ అండ్ ఎఫెక్ట్, ప్రాబ్లమ్ సాల్వింగ్ అంశాలు ముఖ్యమైనవి. ఈ విభాగానికి సంబంధించి వెర్బల్ రీజనింగ్‌పై దృష్టిపెట్టాలి. కోడింగ్, డీ–కోడింగ్, అనలిటికల్ పజిల్స్, క్రిటికల్ రీజనింగ్ బాగా ప్రాక్టీస్ చేయాలి. ఇంగ్లిష్ అక్షరక్రమాన్ని ముందు నుంచి వెనుకకు, వెనుక నుంచి ముందుకు ప్రాక్టీస్ చేయాలి. దీంతోపాటు ఏ అక్షరం ఎన్నో స్థానంలో ఉందో సులువుగా గుర్తించాలి. రాష్ట్రస్థాయి పరీక్షలకు కోడింగ్–డీకోడింగ్, క్యాలెండర్స్, డెరైక్షన్స్ తదితర అంశాలు ముఖ్యమైనవి. బ్యాంకింగ్‌లో అనలిటికల్ రీజనింగ్,సిలాయిజమ్స్, ఇన్ ఈక్వాలిటీస్,ఇన్‌పుట్ అవుట్‌పుట్ వంటి అంశాల నుంచి ఉన్నత స్థాయి ప్రశ్నలు ఎదురవుతాయి.

## ఇంగ్లిష్

ప్రతి పోటీ పరీక్షలోనూ కచ్చితంగా ఉండే సబ్జెక్ట్.. ఇంగ్లిష్. బ్యాంకింగ్, ఎస్ఎస్‌సీ, రైల్వే పరీక్షల్లో దీనికి వెయిటేజీ ఎక్కువ. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్, ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లు నిర్వహించే పరీక్షల్లో ఇంగ్లిష్ ప్రశ్నలు ప్రాథమిక స్థాయిలో ఉంటాయి. ఫిల్ ఇన్ ది బ్లాంక్స్, రీడింగ్ కాంప్రెహెన్షన్, యాంటానిమ్స్, సినానిమ్స్, స్పాటింగ్ ద ఎర్రర్స్ ముఖ్యమైనవి. వీటితోపాటు స్పెల్లింగ్స్, కరెక్షన్ ఆఫ్ సెంటెన్సెస్, టెన్సెస్, ప్రిపోజిషన్స్, యాక్టివ్ అండ్ ప్యాసివ్ వాయిస్, వొకాబ్యులరీ, రీ రైటింగ్ ద సెంటెన్స్, రీ అరెంజ్ ది సెంటెన్స్, ఆల్ఫాబెటికల్ ఆర్డర్, ప్రెసిస్ రైటింగ్, బేసిక్ ఇంగ్లిష్ గ్రామర్‌పై పట్టు సాధించాలి. ఇంగ్లిష్‌లో పట్టు కోసం మొదట గ్రామర్‌పై అవగాహన పెంచుకోవాలి. టెన్సెస్, సెంటెన్స్ ఫార్మేషన్, యాక్టివ్–ప్యాసివ్ వాయిస్, కాంప్లెక్స్ సెంటెన్సెస్ తదితరాలపై ఎక్కువగా దృష్టిసారించాలి. రీడింగ్ కాంప్రెహెన్షన్, వొకాబ్యులరీల్లోనూ పూర్తిస్థాయిలో నైపుణ్యం పొందాలి. ఎస్ఎస్‌సీ లాంటి పరీక్షల్లో ఇడియమ్స్, ఫ్రేజెస్, స్పెల్లింగ్ మిస్టేక్స్ నుంచి ప్రశ్నలు వస్తాయి.




### సెంట్రల్ రైల్వే-37

ముంబై ప్రధాన కేంద్రంగా ఉన్న సెంట్రల్ రైల్వే ఒప్పంద ప్రాతిపదికన 37 జూనియర్ టెక్నికల్ అసోసియేట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో డిప్లొమా/ఇంజినీరింగ్ డిగ్రీ ఉత్తీర్ణత.
- **వయసు:** 33 ఏళ్లు మించకూడదు.
- **ఎంపిక:** విద్యార్హత, అనుభవం, పర్సనాలిటీ/ఇంటెలిజెన్స్ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తు ఫీజు:** రూ.500
- **దరఖాస్తుకు చివరితేదీ:** మార్చి 6, 2020
- **వెబ్‌సైట్:** https://cr.indianrailways.gov.in

### కేవీఐసీ-15

ముంబైలోని భారత ప్రభుత్వ సూక్ష్మ, చిన్న, మధ్యతరగతి పరిశ్రమల మంత్రిత్వ శాఖకు చెందిన ఖాదీ అండ్ విలేజ్ ఇండస్ట్రీస్ కమిషన్ (కేవీఐసీ) ఒప్పంద ప్రాతిపదికన 15 సీనియర్ కన్సల్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **విభాగాలు:** మార్కెటింగ్, ఫైనాన్స్, జనరల్ మేనేజ్‌మెంట్, ఐటీ, టెక్స్‌టైల్స్, లీగల్, సిరామిక్, ఆర్కిటెక్ట్ తదితర విభాగాలున్నాయి.
- **అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో పోస్టు గ్రాడ్యుయేషన్ డిగ్రీ ఉత్తీర్ణత, అనుభవం ఉండాలి.
- **వయసు:** మార్చి 6, 2020 నాటికి 39 ఏళ్లు మించకూడదు.
- **ఎంపిక:** షార్ట్‌లిస్టింగ్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తుకు చివరితేదీ:** మార్చి 6, 2020
- **వెబ్‌సైట్:** www.kvic.gov.in

### ఐఎంయూ-10

భారత ప్రభుత్వ షిప్పింగ్ మంత్రిత్వ శాఖకు చెందిన చెన్నైలోని ఇండియన్ మారిటైమ్ యూనివర్సిటీ (ఐఎంయూ).. 10 అసిస్టెంట్ (ఫైనాన్స్), అసిస్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **అర్హత:** బ్యాచిలర్స్ డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు సంబంధిత పని అనుభవం ఉండాలి.
- **వయసు:** 35 ఏళ్లు మించకూడదు.
- **ఎంపిక:** ఆన్‌లైన్ స్క్రీనింగ్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తుకు చివరితేదీ:** ఎంప్లాయ్‌మెంట్ న్యూస్ (ఫిబ్రవరి 15–21)లో ఈ ప్రకటన వెలువడిన తేదీ నుంచి 45 రోజుల్లోపు దరఖాస్తు చేసుకోవాలి.
- **వెబ్‌సైట్:** www.imu.edu.in

### ఎస్‌టీపీఐ-4

భారత ప్రభుత్వ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖకు చెందిన సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్స్ ఆఫ్ ఇండియా (ఎస్‌టీపీఐ).. 4 సైంటిస్ట్ (బీ అండ్ సీ) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో ఇంజనీరింగ్ డిగ్రీ ఉత్తీర్ణత, అనుభవం ఉండాలి.
- **ఎంపిక:** స్క్రీనింగ్ టెస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తుకు చివరితేదీ:** మార్చి 12, 2020
- **వెబ్‌సైట్:** www.stpi.in

### ఎన్‌సీఎల్-307

మధ్యప్రదేశ్‌లోని భారత ప్రభుత్వానికి చెందిన మినీరత్న సంస్థ అయిన నార్తర్న్ కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్ (ఎన్‌సీఎల్).. వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 307 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **విభాగాల వారీ ఖాళీలు:** డ్రాగ్‌లైన్ ఆపరేటర్–9, డోజర్ ఆపరేటర్–48, గ్రేడర్ ఆపరేటర్–11, డంపర్ ఆపరేటర్–167, షోవెల్ ఆపరేటర్–28, పే లోడర్ ఆపరేటర్–6, క్రేన్ ఆపరేటర్–21, డ్రిల్ ఆపరేటర్17.
- **అర్హత:** పోస్టులను బట్టి పదోతరగతి, ఐటీఐ ఉత్తీర్ణతతో పాటు వాలిడ్ హెవీ మోటార్ వెహికల్ లైసెన్స్ ఉండాలి.
- **వయసు:** 18–30 ఏళ్ల మధ్య ఉండాలి.
- **ఎంపిక:** ఉమ్మడి రాతపరీక్ష, అడిషనల్ టెక్నికల్ టెస్ట్ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తు ఫీజు:** రూ.500
- **దరఖాస్తులు ప్రారంభం:** మార్చి 16, 2020
- **దరఖాస్తుకు చివరితేదీ:** మార్చి 30, 2020
- **వెబ్‌సైట్:** http://nclcil.in

### తెలంగాణ హైకోర్టు-70

హైదరాబాద్‌లోని తెలంగాణ హైకోర్టు 70 సివిల్ జడ్జి పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **అర్హత:** లా డిగ్రీ ఉత్తీర్ణత, ఏదైనా కోర్టులో అడ్వకేట్/ప్లీడర్‌గా మూడేళ్ల అనుభవం ఉండాలి.
- **వయసు:** 25–35 ఏళ్ల మధ్య ఉండాలి.
- **ఎంపిక:** రాతపరీక్ష ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తులు ప్రారంభం:** మార్చి 13, 2020
- **దరఖాస్తుకు చివరితేదీ:** ఏప్రిల్ 13, 2020
- **రాతపరీక్షతేదీ:** మే 3, 2020
- **వెబ్‌సైట్:** http://hc.ts.nic.in

### ఎస్ఎస్‌సీ-1357

స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (ఎస్ఎస్‌సీ).. వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 1357 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **పోస్టులు:** ల్యాబ్ అసిస్టెంట్, టెక్నికల్ ఆఫీసర్, జూనియర్ ఇంజనీర్, సైంటిఫిక్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్, టెక్నికల్ ఆఫీసర్, స్టోర్ కీపర్ గ్రేడ్–2 తదితర పోస్టులు ఉన్నాయి.
- **అర్హత:** పోస్టులను బట్టి హయ్యర్ సెకండరీ (10+2), మెట్రిక్యులేషన్, గ్రాడ్యుయేషన్ ఉత్తీర్ణత.
- **ఎంపిక విధానం:** కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ) ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తు ఫీజు:** రూ.100
- **దరఖాస్తు ఫీజు చెల్లించడానికి చివరితేదీ:** మార్చి 23, 2020
- **దరఖాస్తుకు చివరితేదీ:** మార్చి 20, 2020
- **సీబీటీ తేదీ:** 2020, జూన్ 10 నుంచి 12 వరకు జరుగుతాయి.
- **వెబ్‌సైట్:** https://ssc.nic.in

### ఎన్ఐసీ-495

భారత ప్రభుత్వ ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖకు చెందిన న్యూఢిల్లీలోని నేషనల్ ఇన్‌ఫర్‌మాటిక్స్ సెంటర్ (ఎన్ఐసీ).. వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 495 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **విభాగాల వారీ ఖాళీలు:** సైంటిస్టు–288, సైంటిఫిక్/టెక్నికల్ అసిస్టెంట్–207.
- **అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో బీఈ/బీటెక్, ఎంఎస్సీ/ఎంఎస్/ఎంసీఏ ఉత్తీర్ణత.
- **వయసు:** మార్చి 26, 2020 నాటికి 30 ఏళ్లు మించకూడదు.
- **ఎంపిక:** సైంటిస్ట్ పోస్టులను రాతపరీక్ష, ఇంటర్వ్యూ; సైంటిఫిక్/టెక్నికల్ అసిస్టెంట్ పోస్టులను రాతపరీక్ష ద్వారా భర్తీ చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తు ఫీజు:** రూ.800
- **దరఖాస్తులు ప్రారంభం:** ఫిబ్రవరి 26, 2020
- **దరఖాస్తుకు చివరితేదీ:** మార్చి 26, 2020
- **వెబ్‌సైట్:** http://nielit.gov.in

### యూపీఎస్సీ-41

న్యూఢిల్లీలోని యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ).. వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 41 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **విభాగాల వారీ ఖాళీలు:** జూనియర్ సైంటిఫిక్ ఆఫీసర్–2, సైంటిస్ట్–38, ఎకనమిస్ట్–1.
- **అర్హత:** పోస్టును బట్టి సంబంధిత సబ్జెక్టుల్లో ఇంజనీరింగ్ డిగ్రీ, మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణత, అనుభవం ఉండాలి.
- **ఎంపిక:** రిక్రూట్‌మెంట్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేసుకోవాలి.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తుకు చివరితేదీ:** మార్చి 12, 2020
- **వెబ్‌సైట్:** www.upsc.gov.in

### ఎల్ఐసీ-218

ముంబై ప్రధాన కేంద్రంగా ఉన్న లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసీ).. వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 218 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరతోంది.

- **విభాగాల వారీ ఖాళీలు:** అసిస్టెంట్ ఇంజనీర్–50, అసిస్టెంట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్–168.
- **విభాగాలు:** సివిల్, ఎలక్ట్రికల్, ఆర్కిటెక్చర్, స్ట్రక్చరల్, సీఏ, యాక్చూరియల్, లీగల్, రాజ్‌భాష, ఐటీ.
- **అర్హత:** పోస్టులను బట్టి సంబంధిత సబ్జెక్టుల్లో బ్యాచిలర్స్ డిగ్రీ, బీఈ/బీటెక్, బీఆర్క్, ఎంఈ/ఎంటెక్, పీజీ డిగ్రీ ఉత్తీర్ణత.
- **వయసు:** ఫిబ్రవరి 1, 2020 నాటికి 21–30 ఏళ్ల మధ్య ఉండాలి.
- **ఎంపిక:** ప్రిలిమినరీ, మెయిన్ ఎగ్జామినేషన్, ఇంటర్వ్యూ, మెడికల్ టెస్ట్ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తులు ప్రారంభం:** ఫిబ్రవరి 25, 2020
- **దరఖాస్తుకు చివరితేదీ:** మార్చి 15, 2020
- **వెబ్‌సైట్:** https://licindia.in

### సీఎస్ఎల్-30

కొచ్చిలోని కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ (సీఎస్ఎల్).. ఒప్పంద ప్రాతిపదికన 30 షిప్ డిజైన్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **ఖాళీలు:** మెకానికల్–9, ఎలక్ట్రికల్–21.
- **అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో డిప్లొమా (ఇంజనీరింగ్) ఉత్తీర్ణత, అనుభవం ఉండాలి.
- **వయసు:** మార్చి 4, 2020 నాటికి 30 ఏళ్లు మించకూడదు.
- **ఎంపిక:** ఆన్‌లైన్ టెస్ట్, ప్రాక్టికల్ టెస్ట్ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తు ఫీజు:** రూ.200
- **దరఖాస్తుకు చివరితేదీ:** మార్చి 4, 2020
- **వెబ్‌సైట్:** https://cochinshipyard.com

సాక్షి

బుధవారం, ఫిబ్రవరి, 26

# కొంత ఆశ... కొంత నిరాశ

గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో అసాధారణమైన స్వాగత సత్కారాలు అందుకుని స్వదేశంలోని ఓటర్లకూ, ప్రత్యర్థి పక్షానికీ తన ఘనతను చాటిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రెండో రోజైన మంగళవారం పూర్తిగా ద్వైపాక్షిక అంశాలపై దృష్టి పెట్టారు. ప్రధాని నరేంద్ర మోదీతో జరిపిన చర్చల్లో మూడు వందల కోట్ల డాలర్ల విలువైన రక్షణ ఒప్పందాలు ఖరారు చేసుకోవడంతోపాటు ఇంధనరంగంతోసహా మూడు రంగాల్లో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నారు. ఇరు దేశాల అధికారుల మధ్యా సాగిన చర్చోపచర్చలు ఒక కొలిక్కి రాకపోవడం వల్ల ముందనుకున్నట్టే వాణిజ్య రంగంలో కుదరవలసిన ఒప్పందంపై ఈ పర్యటనలో సంతకాలు కాలేదు. రెండు దేశాల ప్రస్తుత సంబంధాలు గతంలో ఎన్నడూ లేనంత ఉచ్చస్థితిలో ఉన్నాయని ట్రంప్ అభివర్ణించడాన్నిబట్టి చూస్తే మన దేశంపై ఆయనకున్న అసంతృప్తి క్రమేపీ తగ్గుతున్నదని భావించాలి. అయితే అమెరికా సరుకులపై భారత్ విధిస్తున్న 'అధిక టారిఫ్'ల గురించి, దానివల్ల తమకు జరిగే నష్టం గురించి ఆయనింకా చెప్పడం మానుకోలేదు. తమను భారత్ 'న్యాయసమ్మతం'గా చూడాలని, అధిక టారిఫ్‌లు తగ్గించుకోవాలని ఆయన మరోసారి చెప్పారు.

అమెరికా అధ్యక్ష పీఠంపై ఉన్నవారు ప్రపంచ దేశాల్లో జరుగుతున్న పరిణామాలపై స్పందించవలసిన బాధ్యత తమకున్నదని, వాటిని సరిచేయడం కూడా తమ కర్తవ్యమేనని భావిస్తుంటారు. ప్రస్తుతం మన దేశంలో వివాదాస్పద అంశంగా మారిన పౌరసత్వ సవరణ చట్టం గురించి ట్రంప్ ఆ కోణంలోనే మోదీ వద్ద ప్రస్తావిస్తారని పలువురు ఆశించారు. కానీ పాలకుడిగా గత మూడున్నరేళ్లనుంచి ట్రంప్ వ్యవహారశైలిని గమనిస్తున్నవారు ఈ వాదనతో ఏకీభవించలేదు. ఈ పర్యటన నుంచి ట్రంప్ ఆశిస్తున్న ప్రయోజనాలు వేరు. అమెరికాలో ఈ ఏడాది ఆఖరులో జరగబోయే అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో గరిష్టంగా ప్రయోజనం పొందడానికి ఆయన ఈ పర్యటనకొచ్చారు. అక్కడున్న ఎన్నారైల అభిమానాన్ని చూరగొనడంతోపాటు భారత్‌తో కుదుర్చుకునే ఒప్పందాల ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థను మెరుగుపరచడానికి కృషి చేస్తున్నానన్న అభిప్రాయం అమెరికా పౌరుల్లో కలిగించాలన్న తాపత్రయం ట్రంప్‌కు ఉంది. అందుకు పూర్తి సహాయసహకారాలు అందించిన మోదీ ప్రభుత్వాన్ని ఆయన ఇరకాటంలో పెట్టేలా మాట్లాడతారని ఎవరూ అనుకోరు. అందుకే సీఏఏ అంశం పూర్తిగా భారత్ ఆంతరంగిక సమస్యని తేల్చిచెప్పారు. ఢిల్లీలో జరుగుతున్న అల్లర్లపై అడిగిన ప్రశ్నకూ ఆ మాదిరే జవాబిచ్చారు.

అయితే, మత స్వాతంత్ర్యానికి విఘాతం కలుగుతున్నదని వచ్చిన ఆరోపణలను మోదీ దృష్టికి తీసుకెళ్లానని... ఆ విషయంలో ముస్లింలు కోరుకుంటున్నదేమిటో తెలుసుకుంటున్నామని ఆయన జవాబిచ్చారని ట్రంప్ అన్నారు. మోదీ శక్తిమంతుడని, ఇలాంటి సమస్యలను అధిగమిస్తారని కూడా చెప్పారు. కశ్మీర్ విషయంలో మొదటినుంచీ ఉన్న అభిప్రాయాన్నే మరోసారి ట్రంప్ ప్రకటించారనుకోవాలి. కశ్మీర్ సమస్య విషయంలో భారత్, పాకిస్తాన్‌లకు వేర్వేరు కోణాలున్నాయని, ఆ రెండు దేశాలూ కలిసి చర్చించుకుని ఈ విషయంలో ఒక అంగీకారానికి రావాలని కోరుకుంటున్నట్టు తెలిపారు. బహుశా ఒకటికి రెండుసార్లు దీనిపై మీడియా ప్రశ్నించడంవల్ల కావొచ్చు... రెండు దేశాలూ కోరితే మధ్యవర్తిత్వం నెరపడానికి సిద్ధమేనని చెప్పారు. అమెరికాకున్న ఈ మధ్యవర్తిత్వం ఉబలాటం ఎంత పాతదో, దీనిపై మన దేశానికున్న అభ్యంతరం కూడా అంతే పాతది. ట్రంప్ ఈ విషయంలో చేసిన ప్రకటన మన దేశానికి సహజంగానే ఇబ్బంది కలిగిస్తుంది. మన దేశం పదే పదే కశ్మీర్ సమస్య గురించి పాక్‌తో చర్చించడానికి సిద్ధంగా వున్నామని చెబుతోంది. ఈ విషయంలో ఎవరి మధ్యవర్తిత్వాన్ని అంగీకరించబోమని గతంలో అనేకసార్లు చెప్పింది. ఎన్‌డీఏ ప్రభుత్వం వచ్చాక, ముఖ్యంగా గత ఆగస్టులో కశ్మీర్ ప్రతిపత్తిని రద్దు చేసి దాన్ని కేంద్రపాలిత ప్రాంతంగా మార్చాక ఈ వైఖరి మరింత మారింది. కశ్మీర్ గురించి పాక్‌తో చర్చించాల్సిందేమీ లేదని, అయితే దాని ప్రాపకంతో సాగుతున్న హింస గురించి ఆ దేశంతో మాట్లాడటానికి సిద్ధమని మన దేశం చెబుతోంది. ఈ నేపథ్యంలో ట్రంప్ చేసిన వ్యాఖ్య ప్రభుత్వానికి ఇబ్బంది కలిగిస్తుందనడంలో సందేహం లేదు. దీనిపై ప్రభుత్వ స్పంద నేమిటో చూడాల్సివుంది.

స్వర్గీయ వాజ్‌పేయి ప్రధానిగా ఉన్నప్పుడు 1998లో అణు పరీక్ష జరిపినందుకు అప్పటి అధ్యక్షుడు బిల్ క్లింటన్ మన దేశంపై ఆంక్షలు విధించారు. మరో రెండేళ్ల తర్వాత వాటిని పాక్షికంగా తొలగించడంతోపాటు మన దేశంలో అయిదు రోజుల పర్యటనకు కూడా వచ్చారు. మొత్తంగా రెండు దేశాల మధ్యా ఈ రెండు దశాబ్దాలుగా కొనసాగుతున్న స్నేహసంబంధాలను పునశ్చరణ చేసుకుంటే అవి నానాటికీ బలపడుతూనే వచ్చాయని అర్థమవుతుంది. జార్జి బుష్ ఏలుబడిలో అమెరికాతో అణు ఒప్పందం కుదుర్చుకున్నాక ఈ సంబంధాలు కీలక మలుపు తిరిగాయి. తాజా చర్చల్లో ఇరు దేశాల సంబంధాలనూ అంతర్జాతీయ సమగ్ర భాగస్వామ్యం స్థాయికి తీసుకెళ్లాలని నిర్ణయించడం కూడా అటువంటిదే. అయితే తాలిబన్‌లతో అమెరికా కుదుర్చుకోబోయే ఒప్పందం గురించి మోదీకి వివరిస్తే, ఆయన బ్రహ్మాండంగా ఉన్నదని మెచ్చుకున్నారనడం వాస్తవదూరంగా ఉంది. అఫ్గాన్‌లో ఇప్పుడున్న ప్రభుత్వాన్ని తప్పించి, అధికారం తాలిబన్‌ల చేతిలో పెడితే అది భారత్‌కు తలనొప్పిగా మారుతుందని అమెరికాకు తెలియందేమీ కాదు. కానీ ఏదోవిధంగా సమస్య పరిష్కారం అయినట్టు చూపించి నిష్క్రమించాలని అమెరికా తొందరపడుతోంది. ఒకపక్క మనతో సాన్నిహిత్యాన్ని నెరపుతూనే, మన దేశం నుంచి గరిష్టంగా లబ్ధి పొందాలని చూస్తూనే పాక్ ప్రాపకంతో తాలిబన్‌లతో ఒప్పందానికి సిద్ధపడుతోంది. ఈ క్రమంలో మన వైఖరిని పరిగణనలోకి తీసుకోకపోవడం, ఈ ప్రాంత భద్రతకు తగిన హామీ ఇవ్వకపోవడం ఆశ్చర్యం కలిగిస్తుంది. ఈ విషయంలో అమెరికాతో మన దేశం వివరంగా మాట్లాడవలసివుంది.


## గ్రహం అనుగ్రహం

శ్రీ వికారి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు
ఫాల్గుణ మాసం, తిథి శు.తదియ రా.1.44 వరకు, తదుపరి
చవితి, నక్షత్రం ఉత్తరాభాద్ర రా.8.10 వరకు, తదుపరి
రేవతి, వర్జ్యం సా.3.50 నుంచి 5.35 వరకు
దుర్ముహూర్తం ప.11.48 నుంచి 12.35 వరకు
అమృతఘడియలు... ప.2.50 నుంచి 4.35 వరకు.

సూర్యోదయం : 6.25
సూర్యాస్తమయం : 6.01
రాహుకాలం : ప. 12.00 నుంచి 1.30 వరకు
యమగండం : ఉ.7.30 నుంచి 9.00 వరకు

# భారత్ పర్యటనలో భారీ ప్రయోజనం

విశ్లేషణ



పెంటపాటి పుల్లారావు

**అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రెండు రోజుల భారత పర్యటన గ్రాండ్ సక్సెస్ అనే చెప్పాలి. మొతెరా స్టేడియం నుంచి లక్షా పాతిక వేలమంది సమక్షంలో ప్రసంగించిన ట్రంప్ ఆద్యంతం అమెరికా–భారత్ స్నేహ సంబంధాల విశిష్టతను ప్రస్తావించారు. రాడికల్ ఇస్లాం ఉగ్రవాదాన్ని సహించబోమని, ఉగ్రవాద నిర్మూలనలో భారత్‌కు పూర్తి మద్దతునిస్తామని స్పష్టం చేశారు. ట్రంప్ ప్రకటన ప్రత్యక్షంగా పాకిస్తాన్‌కు, పరోక్షంగా చైనాకు తీవ్ర హెచ్చరిక. అయితే ఇతర దేశాలు మనల్ని గౌరవించాలంటే భారత్ తన ఆర్థిక వ్యవస్థను జాగ్రత్తగా నిర్వహించుకోవాలి. ఈ విషయంపై మోదీ ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి. భారత్ బలానికి ఆర్థిక పటిష్టతే అసలైన పునాది.**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చరిత్రాత్మక భారత్ పర్యటన ముగిసింది. ఆయన రెండు రోజుల పర్యటన భారత్, అమెరికా మధ్య సంబంధాల్లో పెద్ద మార్పులను తీసుకొచ్చింది. ఏ అమెరికన్ అధ్యక్షుడూ చేయని విధంగా ట్రంప్ వ్యవహారాలను నడుపుతారు. ఇంతవరకు ట్రంప్ తన జీవితకాలంలో ఒక్క ఎన్నికలో మాత్రమే పోటీ చేశారు. 2016లో అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో పోటీచేసిన ట్రంప్ అమెరికన్ రాజకీయ దిగ్గజం హిల్లరీ క్లింటన్‌పై అందరి అంచనాలకు మించి విజయం సాధించారు. 2017 జనవరిలో అమెరికా అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేసిన ట్రంప్ అమెరికా చరిత్రలో ఏ అధ్యక్షుడూ చేయలేని విధంగా పాలన సాగించారు. అన్ని చట్టాలనూ ఆయన తోసిపడేశారు. నేడు ఆయన అతిశక్తిమంతుడు, సమయస్ఫూర్తి కలిగిన వారు కూడా. తన కేబినెట్ మంత్రులను కానీ, సాధారణ మీడియాను కానీ ట్రంప్ అస్సలు ఉపయోగించుకోరు. అనేక టీవీ చానళ్లు చూసి సమయానుగుణంగా నిర్ణయాలు తీసుకుంటారు. అవును.. ఈరోజు అమెరికా ఆర్థికవ్యవస్థ గత 50 ఏళ్లలో ఎన్నడూ లేని విధంగా వికాసంతో పరవళ్లు తొక్కుతోందనటం నిజం. అమెరికా అధ్యక్షుడు కావడానికి ముందు ట్రంప్ చాలా అరుదుగా మాత్రమే విదేశాల్లో ప్రయాణించారు. భారత్ గురించి, దాని గతం గురించి ట్రంప్‌కి పెద్దగా తెలీదు. కానీ ప్రపంచంలో సాంకేతికరంగంలో పలువురు భారతీయులు ఆధిపత్యం చలాయిస్తున్నారని తెలుసుకున్న ట్రంప్ భారతీయుల ప్రతిభా సామర్థ్యాలపట్ల గొప్ప గౌరవం ప్రదర్శిస్తారు. అయితే భారత్ గురించి ట్రంప్‌కు వ్యక్తిగతంగా ఏమీ తెలీదు. పైగా భారతీయ ప్రముఖులను తాను ఎన్నడూ కలవలేదు. అందుకే తనతో కలిసి మోదీ నడుస్తారా అనే ఆందోళన ట్రంప్‌ను పీడిస్తోంది.

### భారత్‌కు అమెరికా తోడు ఎందుకు?

మనదేశానికి ఇరుగు పొరుగు సమస్య చాలా పెద్దది. పాకిస్తాన్, చైనా దేశాలతో మనకు 10 వేల కిలోమీటర్ల సరిహద్దులున్నాయి. ఈ రెండు దేశాలతో భారత్‌కు తీవ్ర శత్రుత్వం ఉంది. పైగా భారత్‌కు వీటితో యుద్ధం చేసిన అనుభవం కూడా ఉంది. అందుకే భారత్ నిరంతరం అంతర్జాతీయ ముఖచిత్రంలో కనబడుతూ, ఈ రెండు దేశాలూ ఇతర దేశాలతో కలిసి తనకు వ్యతిరేకంగా పనిచేయకుండా ప్రయత్నిస్తూ ఉండాలి. అటు కశ్మీర్ విషయంలో పాక్‌తో ఘర్షణ పడుతూ, ఇటు చైనాతో సరిహద్దు సమస్యతో కొట్టుమిట్టాడుతున్న భారత్‌కు తప్పకుండా అమెరికా మనసు గెల్చుకోవలసిన అవసరం ఉంది. మన శత్రు దేశాలు మనల్ని వేధించకుండా ఉండాలంటే అమెరికా మద్దతు పొందాలి. ఈ నేపథ్యంలోనే భారత్‌కు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ స్నేహం అత్యవసరం. ఒక విదేశీ అధ్యక్షుడు భారత్‌లో అతి పెద్ద జన సమూహాన్ని ఉద్దేశించి ప్రసంగించడం చాలా అరుదు. కానీ రెండురోజుల ట్రంప్ పర్యటన భారీ విజయం పొందినట్లే మరి. ట్రంప్ పర్యటనలో మొదటి రోజు మరీ ప్రాధాన్యత కలిగింది. ఎందుకంటే ట్రంప్, ఆయన కుటుంబం బహిరంగ సమావేశాల్లో పాల్గొంటున్న దృశ్యాలను చూడడానికి భారతీయులు మొత్తంగా టీవీ సెట్లకు అతుక్కుపోయారు. తొలిరోజు సాధించిన విజయం ట్రంప్ పర్యటన పొడవునా ఆధిపత్యం చలాయించిందనే చెప్పాలి. ప్రపంచంలోనే అతిపెద్ద స్టేడియంలో లక్షా



పాతికవేలమంది జనం ముందు ట్రంప్ ప్రసంగాన్ని యావత్ ప్రపంచం దిగ్భ్రమతో చూసింది. ట్రంప్ భారత పర్యటన యావత్తులో ఇది ఒక సానుకూల మూడ్‌ని తీసుకొచ్చింది. మొతెరా స్టేడియంలో సభ, రోడ్ షోను ప్రధాని మోదీ అత్యద్భుతరీతిలో నిర్వహించారు. అంతకుమించి ట్రంప్ స్టేడియంలో గొప్పగా ప్రసంగించారు. ఈ ఘటన చూస్తే దేశాలకు శాశ్వత శత్రువులు, శాశ్వత మిత్రులు ఉండరని, శాశ్వత ప్రయోజనాలు మాత్రమే ఉంటాయని 230 సంవత్సరాల క్రితం ప్రముఖ బ్రిటిష్ ప్రధాని లార్డ్ పాల్మర్‌స్టోన్ చెప్పింది గుర్తుకొస్తుంది. ఆ ప్రకటన అన్ని రకాల దౌత్యానికి పునాది. అధ్యక్షులు వస్తారు వెళతారు కానీ భారతీయ ప్రయోజనాలు కొనసాగుతాయి.

### ట్రంప్ భారత్ పర్యటన ఫలితాలు

మొతెరా స్టేడియంలో అమెరికా అధ్యక్షుడి ప్రసంగం ఆయన పర్యటన మొత్తంలో కీలకమైంది. ఆ స్టేడియంలో అమెరికా విదేశీ విధానాన్ని, భారత్ పట్ల తన వైఖరిని ట్రంప్ ప్రసంగం విస్పష్టం చేసింది. పదాలను వెతుక్కోకపోవడం, అభిప్రాయ ప్రకటనలో తడబాటు లేకపోవడం ట్రంప్ ప్రసంగంలో ఆద్యంతం వ్యక్తమయ్యాయి. ట్రంప్ భారత పర్యటనలో మనకు ఒరిగే ప్రయోజనాలు చూద్దాం. ఇస్లాం ఉగ్రవాదాన్ని ఓడించే విషయంలో భారత్, అమెరికాకు ఉమ్మడి లక్ష్యం ఉందని రెండు దేశాలు ఇస్లామిక్ ఉగ్రవాదంతో పోరాడతాయని ట్రంప్ చెప్పారు. ఏ అమెరికన్ అధ్యక్షుడు, లేక యూరోపియన్ లీడర్ ఇంత స్పష్టంగా ఉగ్రవాద నిర్మూలనా పోరాటం గురించి చెప్పి ఉండలేదు. రాడికల్ ఇస్లామిక్ ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న అన్ని దేశాలను ట్రంప్ నేరుగా మొతెరా స్టేడియం నుంచి హెచ్చరించారు. తన శక్తియుక్తులన్నింటినీ మేళవించి ఇస్లామిక్ ఉగ్రవాదంతో పోరాడతానని ట్రంప్ చేసిన హెచ్చరిక పాకిస్తాన్‌కు, అలాగే భారత్‌కు వ్యతిరేకంగా ఉగ్రవాదాన్ని ప్రోత్సహించే ఏ దేశానికైనా సరే తీవ్రమైన సందేశాన్నే ఇచ్చింది. అమెరికా సైన్య ఆధునీకరణకు 2.5 ట్రిలియన్ డాలర్లను వెచ్చించానని, ఈ శక్తివంతమైన సైన్యంతోనే ప్రపంచమంతటా ఉగ్రవాదుల పని పడుతున్నామని, ఐసిస్ అధినేత బాగ్దాదిని కూడా మట్టుపెట్టామని ట్రంప్ తెలిపారు. ఉగ్రవాదానికి వ్యతిరేక పోరాటంలో భారత్ వెనుక తాముం టామనే బలమైన సందేశాన్ని ట్రంప్ పంపించారు.

ప్రతి దేశం కూడా తన సరిహద్దులను కాపాడుకుని తీరాల్సిందేనని, ఎవరు తమ భూభాగంలోనికి ప్రవేశించాలి, ఎవరు ప్రవేశించకూడదు అని నిర్ణయించుకునే హక్కు ఏ దేశానికైనా ఉంటుందని ట్రంప్ చెప్పారు. దీంతో భారత్‌లో ప్రస్తుతం సాగుతున్న సీఏఏ, ఎన్నార్సీ అంశాలను ట్రంప్ నేరుగా ప్రస్తావించినట్లయింది. అలాగే భారతీయ ఎన్నారైలను, కష్టించి పనిచేసే భారతీయులను ట్రంప్ ప్రశంసించారు. ఎన్నారైలకు, భారతీయ సాఫ్ట్‌వేర్ ఉద్యోగులకు భవిష్యత్తులో ట్రంప్ మరింత ప్రోత్సాహం అందిస్తారని భావించవచ్చు. పైగా ఇతర దేశాల్లో పర్యటించినప్పుడు ట్రంప్ ఇంత ప్రశంసల వర్షం ఎన్నడూ కురిపించలేదు. గాంధీ సబర్మతి ఆశ్రమాన్ని సందర్శించిన ట్రంప్ భారతీయ సంస్కృతి, సామాజిక చరిత్రకు తానెంతో విలువ ఇస్తున్నట్లు సందేశం పంపారు. ఇతర దేశాలు ప్రత్యేకించి చైనా బలాన్ని ప్రదర్శిస్తూ, బెదిరిస్తున్న నేపథ్యంలో భారత్ ప్రజాస్వామిక మార్గంలో పయనిస్తోందని ట్రంప్ కితాబిచ్చారు. శాంతియుత, ప్రజాస్వామిక మార్గాల్లో భారత్ ఎదుగుతున్నందుకు అభినందించారు.

### ట్రంప్ పర్యటన నుంచి భారత్ పొందే ప్రయోజనాలు

ఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో మంగళవారం జరిగిన ప్రెస్ కాన్ఫరెన్స్‌లో కూడా ట్రంప్ మరోసారి ఇస్లాం ఉగ్రవాద వ్యతిరేక పోరాటంలో భారత్‌కు మద్దతిస్తామని నొక్కి చెప్పారు. ఇది చాలా కీలకమైన ప్రకటన. ట్రంప్ సందేశం నేరుగా పాకిస్తాన్‌కు చేసిన తీవ్ర హెచ్చరిక. ప్రపంచంలో ఎక్కడ ఉగ్రవాద మూలాలు ఉన్నా తాను సహించబోమని ట్రంప్ స్పష్టంగా ప్రకటించారు. పైగా నేపాల్, భూటాన్, బంగ్లాదేశ్, శ్రీలంక, మారిషస్, పాకిస్తాన్ దేశాలు చైనాకు సన్నిహితం కావడానికి ప్రయత్నించడం తనకు ఏమాత్రం సంతోషం కాదని ట్రంప్ సందేశమిచ్చారు. పాకిస్తాన్, చైనాలు ట్రంప్ భారత పర్యటన ప్రభావాన్ని ఇకపై జాగ్రత్తగా మదింపు చేసుకోవలసి ఉంది. భారత అభిప్రాయాలను గౌరవించి తీరాలన్న సందేశం చైనాకు అందింది. పైగా భారత, అమెరికా మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం ఏర్పడిందన్న విషయాన్ని చైనా గ్రహించి మెలగాల్సి ఉంది. నరేంద్రమోదీని వ్యతిరేకిస్తున్న అనేక మంది భారతీయులు ఈ ఏడాది ఆఖరిలో జరగబోయే ఎన్నికలు ఎదుర్కోబోతున్న ట్రంప్‌ని మోదీ ఇంత బాహాటంగా బలపర్చడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. అయితే డొనాల్డ్ ట్రంప్ ఇప్పుడు చాలా శక్తిమంతుడిగా ఉన్నారు. ట్రంప్ గెలిస్తే తాను భారత్‌కు మరింత మంచి స్నేహితుడు అవుతారు. ట్రంప్ ఓడిపోతే మనకు అదేం పెద్ద విషయం కాదు. భారత్ అతి పెద్ద దేశం కాబట్టి కాబోయే అమెరికన్ ప్రెసిడెంట్ ఎవరైనా సరే భారత్‌తో సర్దుబాటు కావలసి ఉంటుంది. కానీ ఎదుగుతున్న ఆర్థిక వ్యవస్థగా భారత్ తన ఆర్థికాన్ని చాలా జాగ్రత్తగా నిర్వహించుకోవలసి ఉంది. ఇతర దేశాలు మనల్ని గౌరవించాలంటే ఇదొకటే మార్గం. కాబట్టి మోదీ ఇప్పుడు ఆర్థిక వ్యవస్థపై మరింతగా దృష్టి పెట్టాలి. భారత్ బలానికి ఇదే అసలైన పునాది.


వ్యాసకర్త ప్రముఖ రాజకీయ విశ్లేషకులు

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



## సోషల్ మీడియా

### రికార్డింగ్



"అల్లరిమూక మసీదును తగులబెడుతుండగా రికార్డు చేసిన నా స్నేహితులు అరవింద్ గుణశేఖర్, సౌరభ్‌లను దారుణంగా చితకబాదారు. తన మెడలో ధరించిన రుద్రాక్షను చూపించి సౌరభ్ అల్లరి మూకను వెళ్లగొట్టాడు. ఢిల్లీకి ఇప్పుడు ఒక జాతీయ అవమానం" – రోహిణీ సింగ్, జర్నలిస్ట్

### గుడ్ న్యూస్



"ప్రస్తుత పరిస్థితుల్లో కాస్త గుడ్ న్యూస్ వినిపిస్తోంది. ఢిల్లీలోని వివిధ ప్రాంతాల్లో హిందువులు ముందుకు వచ్చి తమ పొరుగున వున్న ముస్లింలను అల్లరి మూకల నుంచి రక్షిస్తున్నారు. ఈ విషయం నా హృదయాన్ని కదిలించింది" – కవితా కృష్ణన్, సీపీఐ నేత

### వలస



"ఢిల్లీలో నివసిస్తున్న ముస్లిం స్నేహితులు వలసపోవడానికి సిద్ధమవుతున్నారు. అల్లర్లు ఢిల్లీ అంతటా వ్యాపించే అవకాశం ఉందనే భయంతో ఇప్పటికే చాలా మంది వెళ్లిపోయారు. హౌసింగ్ సొసైటీల వాట్సాప్ గ్రూపుల్లో ద్వేషపూరితమైన మెసేజ్‌లను షేర్ చేస్తున్నారు. ఒక మసీదును ధ్వంసం చేసిన అల్లరిమూకలు దానిపై కాషాయ జెండా ఎగురవేశాయి" – రాణా అయూబ్, జర్నలిస్ట్

### స్పష్టత



"వీధుల్లో పోరాటాలు చేయడం ద్వారా భారతీయ ఆర్థిక వ్యవస్థను దెబ్బ తీయవచ్చని ఒక మౌలానా ఉపన్యాసం ఇస్తున్నాడు. వాళ్ల లక్ష్యం ఏమిటో వారికి స్పష్టంగా తెలుసు. లౌకికవాదం అనే నల్లమందు మత్తులో ఉన్న కొంతమంది హిందువులు మాత్రం వీరిని చూడనిరాకరిస్తారు" – షెఫాలీ వైద్య, రచయిత్రి

### వణుకు



"ఒక లౌకిక హిందువుగా నేను చాలా బాధపడుతున్నా. నాకు 1,500 కి.మీ. దూరంలో జరుగుతున్న సంఘటనలపట్ల నేను భయంతో వణికిపోతున్నా. ఢిల్లీ పరిసరాల్లో నివసిస్తున్న ముస్లింల పరిస్థితి ఊహించడానికి కూడా భయంగా ఉంది. నేను పూర్తిగా క్షమాపణ చెబుతున్నా. ఆధిపత్యధోరణితో సాగుతున్న చర్యలకు నేను సిగ్గుపడుతున్నా" – గణేశ్ మంత్రవాది, డేటా అనలిస్ట్

### సహాయం



"యమునా విహార్ దగ్గర బయట వున్న మా అంకుల్ కారు, బైక్ తగులబెట్టారు. అల్లరిమూకలు అతడి ఇల్లు కూడా తగులబెట్టడానికి ప్రయత్నించాయి. అయితే, పక్కింట్లో వుండే బీజేపీ కౌన్సిలర్‌తో స్నేహపూర్వక సంబంధాలు ఉండటంతో ఆ అల్లరి మూకలను బతిమాలి వారి కుటుంబాన్ని కాపాడారు. అతికష్టం మీద వాళ్లు బయట పడ్డారు" – సానియా అహ్మద్, విద్యార్థిని

### సాక్ష్యం



"కశ్మీరీ పండిట్ల విషయంలో జరిగినదానికి మనం సజీవ సాక్ష్యాలం. పరిస్థితి తాలూకు తీవ్రతను, సున్నితత్వాన్ని ఎవరూ సరిగా అర్థం చేసుకోవడం లేదు. కుంభకర్ణుడి గురించి మనం పురాణాల్లో విన్నాం. ఇప్పుడు అటువంటివారిని చూస్తున్నాం" – శివరామ్ ప్రతాప, ఇంజినీర్

ఇన్‌బాక్స్

## పరీక్షలను పండుగగా భావిద్దాం!

విద్యార్థుల జీవితంలో కీలక ఘట్టమైన పరీక్షల తరుణం వచ్చేసింది. వార్షిక ప్రవేశ పరీక్షల దగ్గర నుండి ఉద్యోగ నియామకాలు పోటీ పరీక్షల వరకు అన్నీ వరుసకడతాయి. ఈ సమయంలో సగటు విద్యార్థుల నుండి మెరిట్ విద్యార్థుల వరకు ప్రధానంగా పీడించే సమస్య ఒత్తిడి. దీని బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకునే విషయంలో ప్రధాని నరేంద్ర మోడీ 'మన్ కి బాత్'లో చిరునవ్వుతో పరీక్షలు రాయడం.. పరీక్షలకు సిద్ధమయ్యే రోజుల్ని పండుగగా భావించడం ఆదర్శం అని విద్యార్థులకు పిలుపునిచ్చారు. అనారోగ్యకరమైన పోటీ, తీవ్రమైన ఆత్మనూన్యత, ఒక మార్కు తగ్గినా చనిపోవాలనే భావన రావడం ఇక ఫలితాలు రాగానే అక్కడక్కడ విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకోవడం పత్రికల్లో టీవీలలో చూస్తున్నాం.

మరి పరీక్షల చుట్టూ అల్లుకున్న అవలక్షణాలకి ప్రధాన కారణం ఒత్తిడి మాత్రమే. పది, ఇంటర్ పరీక్షల్లో మంచి ర్యాంకు రావాలి అని ఒత్తిడికి గురి అవుతున్నారు. అధిక శాతం విద్యార్థులు పరీక్షల ముందు మరీ భయంతో బాధపడుతూ రాత్రింబవళ్ళు నిద్ర మానేసి చదువుతూ ఉంటారు. తీరా పరీక్షల సమయానికి తమ మానసిక, శారీరక ఆరోగ్యం పాడవుతుంది. పైగా జ్ఞాపకశక్తి కోల్పోతారు. దీనినుంచి విద్యార్థులు బయట పడాలి అంటే ప్రశాంతంగా ముందు నుంచే ప్రణాళికబద్ధంగా చదివితే చివరి సమయంలో ఆందోళన పడకుండా ఉంటారు. శ్రమకు తగ్గ ఫలితం కూడా ఖచ్చితంగా దక్కుతుంది.

విద్యార్థులు పరీక్ష హాల్లోకి వెళ్లాక పది నిమిషాలు చక్కగా శ్వాస మీద ధ్యాస పెట్టి, ధ్యానం చేసుకొని జవాబులను చకచక రాసినట్లు విజువల్ చేసుకొని రిలాక్స్ కావాలి. మరి ముఖ్యంగా విద్యార్థులు పరీక్ష హాల్ నుండి బయటకు వచ్చిన తరువాత రాసిన జవాబుల గురించి, అయిపోయిన పరీక్షల గురించి అధికంగా చర్చించకుండా మౌనంగా ఇంటికి వెళ్లి విశ్రాంతి తీసుకోవాలి. తరువాత రోజు పరీక్షపై దృష్టి కేంద్రీకరించాలి. విజేతలు మీరే. ఆల్ ది బెస్ట్.

– సయ్యద్ షఫీ, హన్మకొండ

# సమాజంలో సగం–అధికారంలో అధమం

సందర్భం



సాధం వెంకట్

సమాజంలో సగం, అవకాశాల్లో అధమంగా ఉన్న బీసీలకు సామాజక న్యాయం దశాబ్దాలుగా ఎండమావిగానే ఉంది. చట్టసభల్లో సంఖ్యలేదు. సామాజిక భద్రత లేదు. సేవల్లో సగం, సంపదలో సగం అధికారంలో ఆగమాగం. ప్రభువులు ఎక్కిన పల్లకీని, అలుపూసొలుపూ లేకుండా, ఏడు దశాబ్దాలుగా మోస్తున్నం. ఇంకా ఎంతకాలం ఓట్లు వేసే యంత్రాలుగా ఉండాలి, బీసీలంటే మీ పార్టీలకు సభ్యత్వాల్లోనే లెక్కుంటుందా! మీకు జెండాలు కట్టడానికే మేం లెక్కలోకి వస్తామా, సంక్షేమం అభివృద్ధి పేరుతో పాలక కులాలను గెలిపించే బానిసలుగా మారుస్తారా, ఇది మానవత్వమా? ప్రజాస్వామ్యమా? 55 శాతం ఉన్న బీసీలకు ఏడు దశాబ్దాల పాలనలో దామాషా భాగస్వామ్యం దక్కదా?

రెవెన్యూ రికార్డుల ప్రకారం చెట్లకు, పుట్టలకు, గుట్టలకు లెక్కలున్నాయి. సమాజంలో సగానికి పైగా ఉన్న బీసీలకు లెక్కలు లేకపోవటం పాలకుల లెక్కలేని తనానికి నిదర్శనం. మండల్ కమిషన్, కాకా కాలేల్కర్ కమిషన్లు బీసీ కులాలను లెక్కించాలని సిఫారసు చేశాయి. శాస్త్రీయ లెక్కల వల్ల మానవ వనరుల అభివృద్ధి, సంక్షేమ అభివృద్ధి, కార్యక్రమాల సక్రమ అమలుతోపాటు బీసీలకు చట్టసభల్లో రాజకీయ అవకాశాలు కల్పించవచ్చని ఆ కమిషన్లు పేర్కొన్నాయి. కానీ అవి బుట్టదాఖలయ్యాయి.

బీసీల జనగణన ఏప్రిల్ 1 నుండి జరగబోతుంది. అందులో ముప్పయ్ ఒక్క అంశాలు చేర్చి బీసీల కులాలను ఎందుకు లెక్కించటంలేదని దేశవ్యాప్తంగా వోబీసీలు ప్రశ్నిస్తున్నారు. కులగణనను జనాభాలెక్కల్లో చేర్చకపోవటాన్ని బీసీలు ఆత్మగౌరవ సమస్యగా భావిస్తున్నారు. బ్రిటిష్ కాలంలో మొదటిసారి జనగణన మొదలైంది. 1881 నుండి 1931 వరకు కులాలవారీగా గణన జరిగింది. స్వాతంత్ర్యానంతరం. బీసీ కులాలను లెక్కించకుండా కేవలం జనాభానే లెక్కిస్తున్నారు. దీనికి పాలకులు చెప్పే కుంటిసాకులు ఏమిటంటే, కులగణన వల్ల సమాజంలో ఈర్ష్యాద్వేషాలు పెరుగుతాయని. వాస్తవానికి భారతదేశం భిన్నకులాలు, మతాలు నిక్షిప్తమైన దేశం. పాలక కులాల ఆధిపత్యం కోసమే, వివక్షతోనే బీసీలను జనాభా లెక్కల్లో చేర్చటంలేదు. దేశవ్యాప్తంగా ఉన్న 130 కోట్లకు పైగా జనాభాను లెక్కించేందుకు, కేంద్రప్రభుత్వం 1,100 కోట్లు ఖర్చు చేస్తుంది. దీంతో మెజారిటీ ప్రజలు OBCలతో పాటు, బీసీలను కులాల వారీగా లెక్కించాల్సి అవసరం ఉంది. జనగణలో కులం చేర్చటం వల్ల అదనంగా ఖర్చు ఏమీ కాదు. 32వ కాలంగా కులం చేర్చితే, దేశం మొత్తంలో కులాల సంఖ్య, కుల జనాభా సంఖ్య తేల్చవచ్చు. పాలకులకు కులగణన చేసే ఉద్దేశం కనబడటంలేదు. ఎందుకంటే, మెజారిటీ ఓబీసీ కులాలను, మైనారిటీ పాలక కులాలు పాలిస్తున్నాయనే బండారం బయట పడుతుందో అనే భయమా? పాలక కులాల గుప్పెట నుంచి పాలన చేజారిపోతుందనే స్వార్థమా?

భారతదేశంలో మూడు వేలకు పైగా బీసీ కులాలు ఉన్నాయి. పదుల సంఖ్యలో కూడా చట్టసభలలో ప్రాతినిధ్యం లేదు. పాలకుల దయాదాక్షిణ్యం మీద ఆధారపడేటట్లు చేయడం కోసమే బీసీలను జనాభా లెక్కల్లో చేర్చటంలేదా! రాజకీయంగా రాణించకుండా పరిమిత సంఖ్యలో ఉంచటమే లక్ష్యంగా బీసీలను జనాభాలెక్కలో చేర్చటం లేదా, మీ ఉద్దేశం ఏమిటి అని ఈ దేశంలో 65 కోట్లమంది బీసీలు ప్రశ్నిస్తున్నారు. బీసీ కులగణనను చేయకపోవటానికి కారణాలు కేంద్రప్రభుత్వం చెప్పాల్సిన బాధ్యత ఉంది.

బీసీలకు జనాభా దామాషా ప్రకారం ఎంపీ, ఎమ్మెల్యే సీట్లు కేటాయిస్తే పాలక కులాలు తమ ఉనికి కోల్పోతామనే భయంతో పాటు, బీసీలకు ఎన్నికలను ఎదుర్కొనేంత డబ్బు లేకపోవటం కూడా కారణమే. పార్లమెంట్లో 272 మంది బీసీ ఎంపీలు ఉండాలి. కానీ ఒకటి నుండి ఐదు ఆరు శాతం ఉన్న వాళ్లే ఈ స్థానాలను ఆక్రమించుకుంటున్నారు. ఇంకా రాజకీయంగా సీట్లు అడుక్కునే స్థితిలో ఉండటమేందని బీసీలు ఆవేదన చెందుతున్నారు. ఈ వివక్షలన్నింటికీ బీసీ కులగణనతో కొంత పరిష్కారం లభిస్తుందని ఆశతో ఎదురుచూస్తున్నారు.


బీసీలు రాజకీయంగా, సామాజికంగా అభివృద్ధి కాకపోవటానికి కారణం ప్రభుత్వాల నిర్లక్ష్యం, కక్షపూరిత వైఖరి ఒకవైపు ఉంటే, ఉద్యమాల వైఫల్యం కూడా కారణమే. చాలామంది బీసీ నాయకులు అష్టకష్టాలు పడుతున్నవాళ్ళే. చేతికిమూతికి చాలని జీవితాలు గడుపుతున్నారు. పాలకులు బీసీలకు అవకాశాలు ఇవ్వకపోవటానికి కారణం బీసీలు బలమైన ఉద్యమశక్తిగా మారకపోవడమే.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్టు, రాంనగర్, హైదరాబాద్ । 93953 15326

# అద్దాన్ని మరవకూడదు

మానవ జాతిలో ఎన్నో ఎన్నెన్నో ఆలోచనలు. అవన్నీ పువ్వులుగానే ఉండిపోతే మనసే ఓ అందమైన తోటగా కనిపిస్తుంది. మనసులోని సువాసనలు దేహమంతటా వ్యాపిస్తుంది. ముఖం క్షీరంలా స్వచ్ఛంగా కనిపిస్తుంది. కళ్ళు తేజోమయమవుతాయి. నోరు నిజాన్నే మాట్లాడుతోంది. మనిషి జ్ఞాని అవుతున్నాడు. కానీ పూల మొక్కల మధ్య కలుపు మొక్కలు పెరిగితే మంచీ చెడూ కనుక్కోవడం కష్టమే. పూల సువాసనలు, దుర్వాసనలు దేహమంతటా కలిసిపోయి భరించలేని వాసన వ్యాపిస్తుంది. మనిషి కొన్నిసార్లు యోగిగానూ, మరికొన్నిసార్లు రోగిగానూ మారుతాడు.

పువ్వులే లేకుండా ఆలోచనలు కట్టలు తెంచుకుంటే ముఖమంతా అందవిహీనమవుతుంది. నిష్కల్మష నవ్వు కనిపించదు. కళ్ళల్లో క్రూరత్వం కనిపిస్తుంది. చెవులు చెడు మాత్రమే వింటాయి. నోరు అబద్ధమే మాట్లాడుతుంది. మనిషి నలుగురూ నడిచే రహదారిలో ప్రయాణించడం మాని అడ్డదారి పడతాడు. చివరికి తనకంటూ భరోసా ఇచ్చే వాళ్ళు లేక అంతమైపోతాడు. చుక్క నీరు కార్చే వారు లేక కథ ముగిస్తాడు. ఎన్నో చెట్లు అడవిలోనే ఎదిగి కట్టెలయి ఎండిపోతాయి. వాటికి చరిత్రంటూ చెప్పుకోవడానికి ఏదీ ఉండదు. సద్గుణం లేని మనిషి ప్రయోజనం లేని మృగం. మనసుని పువ్వులతో నింపిన మనిషి మాత్రమే సమాజంలో దైవమనిపించుకుంటాడు. అందుకే పువ్వులతో నిండిన మనిషిగా బతకాలనుకోవాలి. భగవంతుడా, స్థితీ స్మరణా పక్కదారి పట్టకూడదు. వర్షం, హోరుగాలి, పిడుగు, మెరుపులను తట్టుకునే శక్తిమంతమైన దేహాన్ని కోరుకోవాలి. స్వచ్ఛంగాసాగే నదిలా విప్పారిన పువ్వులలాంటి మనసుని కోరుకోవాలి. ధనాన్ని కోల్పోవడమా లేక గుణాన్ని కోల్పోవడమా అనే సమస్య తలెత్తితే ధనాన్ని కోల్పోయిన తర్వాత దాని గురించి ఆలోచించని మనసును కోరుకోవాలి. ఇవన్నీ అడిగేది ఎందుకంటే మనిషి తనను ఉన్నతుడిగా నలుగురూ చెప్పుకోవడానికి కాదు. కనీసం తనకు తాను మంచివాడిగా ఉండాలిగా. మనిషి ప్రపంచం గురించి కలవరపడటం కాదు, తన ఎదుటే ఉన్న అద్దం గురించి ఆలోచించాలి.



జ్యోతిర్మయం

– యామిజాల జగదీశ్

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబరుకు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.

టోల్ ఫ్రీ నం: 1800 425 9899

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ
బుధవారం ॥ 26-2-2020



నా క్యారెక్టర్ నాలానే ఉంటుంది
సినిమా పేజీలో...

# తెలుపు.. స్వచ్ఛత

**ఇండియా వచ్చిన ట్రంప్ ఫ్యామిలీ నిన్న రాత్రి యు.ఎస్. వెళ్లిపోయింది. ట్రంప్‌తో పాటు వచ్చిన ట్రంప్ సతీమణి మెలానియా, ట్రంప్ కూతురు ఇవాంక ఈ రెండు రోజుల్లోనూ తమ ముద్రల్ని భారతీయ మహిళల మదిపై వదిలి వెళ్లారు. సన్నగా, అందంగా, ఫ్యాషనబుల్‌గా.. వీటన్నిటినీ మించి ధవళవర్ణ కాంతులతో స్వచ్ఛతకు ప్రతీకగా మెరిశారు ఈ ఇద్దరు మహిళలు.**



ప్రథమ మహిళ మెలానియా



ట్రంప్ కూతురు ఇవాంక

మెలానియా వయసు 49. ఇవాంక వయసు 38. వయసులో పెద్దగా తేడా లేదు. అందుకే కావచ్చు ఇద్దరూ ఒకేలా ఉన్నారు. ఒకట్రెండు మార్కులైతే మెలానియాకే ఎక్కువ పడ్డాయేమో. సోమవారం ఆమె ఇండియాలో ఫ్లయిట్ దిగడమే.. సొగసుగా దిగారు. తెల్లటి జంప్‌సూట్‌తో ఉన్నారు. నడుముకు ఆకుపచ్చరంగు పట్టు శాష్ (కండువా లాంటిది) చుట్టుకున్నారు. ఆ శాష్‌లో బిగించి కట్టినట్లుగా భారతీయ ఉట్టిపడుతోంది. ఫ్రెంచి–అమెరికన్ డిజైనర్ హార్వే పియరీ సన్నటి బంగారు లోహపు దారలతో దానిని అల్లారు. పారిస్‌లో జరిగిన భారత సంప్రదాయ జౌళి కళల ప్రదర్శనలో ఆ వస్త్ర విశేషం గురించి చదివారట ఆయన. దాంతో ఇన్‌స్పైర్ అయి ఈ శాష్‌ను తయారు చేశారు. శాష్ బోర్డర్‌లోనే పనితనమంతా ఉంది అంటారు పియరీ.

పర్యటనలో రెండో రోజు రాజ్‌ఘాట్‌లో మహాత్ముని సమాధికి నివాళులు అర్పించినప్పుడు, ఆ పరిసరాలలో మొక్కను నాటినప్పుడు కూడా మెలానియా తెల్లని డ్రెస్‌నే ధరించారు. మోకాళ్ల కిందివరకూ పూల ఎంబ్రాయిడరీ ఉన్న బటన్ డౌన్ కాటన్ పాప్లిన్ లాంగ్ షర్ట్ వేసుకున్నారు. కాలర్ నెక్లెస్, ఫోల్డెడ్ స్లీవ్‌తో చూడచక్కగా ఉన్నారు. ఢిల్లీలోని సర్వోదయ పాఠశాలకు వెళ్లినప్పుడూ ఇదే డ్రెస్‌తో ఉన్నారు. ఒక విద్యార్థిని ఆమె నుదుటిపై తిలకం దిద్దినప్పుడు అచ్చు భారతీయ స్త్రీలా మారిపోయారు మెలానియా. ఈ డ్రెస్‌ను వెనిజులా ఫ్యాషన్ డిజైనర్ కరోలినా హెరేరా డిజైన్ చేశారు. కాటన్ ఫ్యాబ్రిక్‌ని లూజ్ ఫిట్‌తో భారతీయ వాతావరణానికి అనువుగా రూపొందించారు. మెలానియా వయసుకు తగినవిధంగా సౌకర్యానికి ప్రాముఖ్యం ఇస్తూ, క్యాజువల్ లుక్‌తో ఆకట్టుకునేలా డిజైన్ చేయడం విశేషం. ఈ షర్ట్ డ్రెస్‌కి ఫోల్డెడ్ స్లీవ్స్, కాలర్ నెక్ హుందాగా అమరాయి. ధర మన రూపాయలలో దాదాపు 1.1 లక్షలు. డ్రెస్‌లోని రెడ్ ప్రింట్‌ను మ్యానేజ్ చేస్తూ నడుముకు ఎర్రటి పెద్ద బెల్ట్‌ను వాడటంతో లుక్ రెట్రో స్టైల్‌ని తలపిస్తోంది. దీనికి వైట్ కలర్ పెన్సిల్ కట్ లెదర్ హీల్స్ అదనపు హంగుగా అమరాయి. స్మోకీ ఐ మేకప్, రోజ్ కలర్ లిప్‌స్టిక్‌తో పాటు భుజాల మీదుగా అలలుగా ఎగిసే శిరోజాల్లోనూ చర్మం రంగు పోటీ పడుతున్నట్లుగా ఉన్నారు మెలానియా.

ఇవాంక దుస్తులు కూడా ప్రత్యేకంగా ఉన్నాయి కానీ, గత ఏడాది అర్జెంటీనా పర్యటనలో ధరించిన దుస్తులనే ఆమె ఈ పర్యటనలోనూ (తొలి రోజు) ధరించడం మరింత ప్రత్యేకం అయింది! లక్షా డెబ్బైవేల రూపాయల విలువైన బేబీ బ్లూ, రెడ్ ఫ్లోరల్ డ్రెస్ అది. కలవారి అమ్మాయి, పైగా ఒక ఫ్యాషన్ మోడల్... వేసిన దుస్తుల్నే మళ్లీ వేయడం సోషల్ మీడియాలో ప్రశంసలు కురవడానికి కారణం అయింది. ''డబ్బు మిగల్చడం అటుంచండి. ఒక డ్రెస్ తయారవడానికి ఖర్చయ్యే ప్రకృతి వనరుల్ని క్షయం కాకుండా ఆమె కాపాడారు'' అని అభినందనలు వచ్చాయి.

రెండో రోజు.. అగ్రదేశాధినేత కూతురుగానే కాదు వైట్ హౌస్ సీనియర్ సలహాదారుగా కూడా ఇవాంక తన డ్రెస్సింగ్ ద్వారా అంతే హుందాతనాన్ని ప్రదర్శించారు. సంప్రదాయ పద్ధతుల్లో చేత్తో రూపుదిద్దుకున్న లాంగ్ స్లీవ్స్, ఫ్రంట్ బటన్స్ సల్వార్ కమీజ్‌ను ధరించారు. దీనిని మన ఇండియన్ డిజైనర్ అనితా డోంగ్రే డిజైన్ చేశారు. మన దేశంలో తెలుపు రంగును శాంతికి, స్వచ్ఛతకు సూచికగా వాడతారని తెలిసిందే. అందుకే కావచ్చు.. మెలానియా, ఇవాంకల వస్త్రధారణ.. తెల్లని కాంతులు ప్రతిఫలింపజేసేలా ఉంది. ఇక ఇవాంక పాదాలకు ధరించిన వైట్ కిటెన్ మనోలో బ్లానిక్ మ్యూల్స్ ధర దాదాపు 40 వేలు. గ్లామర్ టచ్ కోసం మన బాలీవుడ్ స్టైల్ బంగారు షాండ్లియర్ ఇయర్ రింగ్స్ ఇవాంక ధరించడం మరో విశేషం.

## ఫిట్‌నెస్

డొనాల్డ్ ట్రంప్ సలహాదారులుగా వైట్ హౌస్‌లోకి వచ్చాక, ఇవాంక, ఆమె భర్త.. ఒకరి సమక్షంలో ఒకరు గడిపే అవకాశం ఉదయం పూట కొన్ని నిముషాలు మాత్రమే దొరుకుతోంది. మ్యాచింగ్ అథ్లెటిక్ దుస్తులు వేసుకుని, లో బేస్‌బాల్ క్యాప్‌లు ధరించి, ఇద్దరూ పక్కపక్కనే వడివడిగా, వగరుస్తూ నడుస్తూ మాట్లాడుకునే విషయాలు ఎక్కువగా ఫిట్‌నెస్ గురించే! ఇవాంకకు ఒకప్పుడు న్యూయార్క్ సిటీ హాఫ్–మారథాన్‌ను గెలవడం అన్నది లక్ష్యంగా ఉండేది. ఆ లక్ష్యాన్ని కొన్ని నెలల కఠోరమైన శిక్షణతో ఆమె నెరవేర్చుకున్నారు కూడా. 2015 ఏప్రిల్‌లో పదమూడు మైళ్ల మారథాన్ పరుగులో ఇవాంక విజయం సాధించారు!

## ఫ్రాంక్‌నెస్

ఇవాంక.. ఉన్నది ఉన్నట్లుగా మాట్లాడతారు. ట్రంప్ అయినా తన కుమార్తె ఆదేశాలను పాటిస్తారేమో కానీ, ఇవాంక తన తండ్రిని గుడ్డిగా సమర్థించరు. ఒక ఉదా : అమెరికా అధ్యక్ష ఎన్నికలకు ఇవాంక.. తండ్రి తరఫున ప్రచారం చేసినప్పటికీ ఎన్నికల్లో ఆయన పోటీ చేయడంపై ఆమె తన అభిప్రాయలను ఏమాత్రం దాపరికం లేకుండా వెల్లడించడం ట్రంప్ ప్రత్యర్థుల్ని సైతం నివ్వెరపరచింది. ''ఒక పౌరురాలిగా ఆయన చేస్తున్న పనిని నేను ఇష్టపడతాను. కానీ ఒక కూతురిగా ఇది ఆయనకు కష్టమైన విషయంగా భావిస్తాను'' అని ఇవాంక అన్నారు! అదొకటేనా.. ''నా తండ్రిలో ఉన్న అత్యంత గొప్పవైన నైపుణ్యాలలో ఒకటి ఏమిటంటే.. మనుషుల్లోని సామర్థ్యాలను ఇట్టే పట్టేస్తారు. అమెరికాను ఆయన మళ్లీ ఒక గొప్ప దేశంగా మార్చేగలరు'' అని రిపబ్లికన్ పార్టీ అభ్యర్థుల సమావేశంలో ఇవాంక అన్న మాటల్ని వాషింగ్టన్ పోస్ట్ ప్రముఖంగా ప్రచురించింది. ఇవాంక వైట్ హౌస్‌లో ఉన్నంత వరకే అమెరికా గానీ, మిగతా దేశాలు గానీ ట్రంప్ చేతుల్లో సురక్షితంగా ఉంటాయని కూడా ఆ పత్రిక రాసింది.

## ఇవాంక

### బిజినెస్

డొనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్షుడు కాకపోయుంటే ఈరోజు ఇవాంక పరిచయం వేరేలా ఉండేది. ప్రధానంగా వజ్రాలు, బంగారు ఆభరణాల వ్యాపారి ఆమె. అంతకన్నా ముందు ఫ్యాషన్ మోడల్. అయితే ఇప్పుడు ఆమె కెరీర్‌లో ఈ రెండిటికీ ఏమంత ప్రాధాన్యం లేదు! అమెరికా అధ్యక్షుడి కూతురిగా ఇవాంక ప్రస్తుతం తన తండ్రికి వైట్ హౌస్ ఆంతరంగికురాలిగా జీతం లేని ఉద్యోగం చేస్తున్నారు. ఆమె కన్నా ఏడాది మాత్రమే వయసులో పెద్దవాడైన భర్త జారెడ్ కుష్నర్ కూడా ఒక సీనియర్ సలహాదారుగా ట్రంప్ దగ్గరే ఉండిపోయారు.

### సాఫ్ట్‌నెస్

ఇవాంక చెయ్యిం ఎంత పెద్దదో, మనసూ అంతే పెద్దది. సున్నిత హృదయం. మంచి పనులు చేస్తున్న వారికి తరచు విరాళాలు ఇస్తుంటారు. న్యూయార్క్‌లో 'చాయ్ లైఫ్‌లైన్' అనే స్వచ్ఛంద సంస్థ ఉంది. ఆ సంస్థ క్యాన్సర్ బారిన పడిన బాలలను సంరక్షిస్తుంటుంది. దానితో పాటు ఇంకా అనేక యూదు సంస్థలకు ఇవాంక క్రమం తప్పకుండా డబ్బు సహాయం చేస్తుంటారు. అలాగే 'యునైటెడ్ హట్జాల్లా' అనే సంస్థ ఉంది. జెరుసలేంలోని అత్యవసర వైద్య చికిత్సా సంస్థ ఇది. దానికి వేల డాలర్ల చెక్కులు పంపుతుంటారు. ఇవాంక రచయిత్రి కూడా! 'ది ట్రంప్ కార్డ్ : ప్లేయింగ్ టు విన్ ఇన్ వర్క్ అండ్ లైఫ్', 'ఉమెన్ హు వర్క్ : రీరైటింగ్ ద రూల్స్ ఫర్ సక్సెస్' అనే పుస్తకాలు రాశారు.

# సర్వోదయ బడి ఫస్ట్‌లేడీ సందడి

**సంతోషం సగం బలం అంటారు. కానీ సంతోషమే సంపూర్ణ బలం. అవును ఇది నిజం. పువ్వుల్లా నవ్వే చిన్నారుల్ని చూసినా.. వారి పక్కనే కూర్చొని సంతోషంపై పాఠాలు నేర్చుకున్నా.. ధ్యానముద్రలో ఉంటూ అలౌకిక ఆనందాన్ని పొందినా.. సంతోషం ఎలా రెట్టింపవుతుందో అదే సంపూర్ణ బలంగా ఎలా మారుతుందో తెలుస్తుంది. అమెరికా ఫస్ట్ లేడీ మెలానియా ట్రంప్‌కి ఢిల్లీ పాఠశాల జీవితకాలానికి సరిపడా అద్భుతమైన అనుభూతినిచ్చింది.**

అమెరికా ప్రథమ మహిళ మెలానియా ట్రంప్ మంగళవారం ఢిల్లీలోని మోతీబాగ్‌లో సర్వోదయ బాలబాలికల ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించారు. విద్యార్థుల్లో విద్యార్థిగా కలిసిపోయారు. తరగతి గదిలో కూర్చొని హ్యాపీనెస్ క్లాసుల్ని శ్రద్ధగా విన్నారు. చిన్నారులతో ముచ్చట్లాడారు. హ్యాపీనెస్ పాఠ్యాంశాలు తనలో ఎంతో స్ఫూర్తిని నింపాయని, ఇవి విద్యార్థుల్లో ఆరోగ్యకరమైన ఆలోచనల్ని, సానుకూల దృక్పథం అలవడడానికి దోహదపడతాయని కూడా అన్నారు.





హ్యాపీనెస్ క్లాస్ రూమ్‌లో మెలానియా

**బొట్టుపెట్టి.. హారతిచ్చి**

డొనాల్డ్ ట్రంప్, నరేంద్ర మోదీతో చర్చలు నిర్వహిస్తున్న సమయంలో మెలానియా ఈ పాఠశాలకు వెళ్లి విద్యార్థులతో ఉల్లాసంగా గడిపారు. ఆమెకు స్వాగతం చెప్పడానికి పువ్వులు, కళాకృతులతో పాఠశాలని కంటికింపుగా అలంకరించారు నిర్వాహకులు. చాలా చోట్ల రంగు రంగుల ముగ్గులు వేశారు. చీరలు ఘాగ్రాచోళీలు ధరించి అందంగా ముస్తాబైన కొందరు విద్యార్థినులు ఆడుతూ, పాడుతూ మెలానియాకు స్వాగతం పలికారు. ఆమెకి పుష్ప గుచ్ఛాన్ని ఇచ్చి నుదుటన కుంకుమ బొట్టు పెట్టి, హారతి ఇచ్చి లోపలికి ఆహ్వానించారు.

**'హ్యాపీనెస్' స్ఫూర్తి**

మెలానియా పాఠశాల అంతా కలియ తిరిగారు. రీడింగ్ రూమ్‌కి వెళ్లారు. ఎల్‌కేజీ, యూకేజీ చిన్నారులకి ఆటపాటల్ని నేర్పే యాక్టివిటీ రూమ్‌కి



మెలానియాకు బడిపిల్లల స్వాగతం

వెళ్లారు. వారితో పాటు అక్కడే కూర్చొని చాలా సేపు గడిపారు. యోగా క్లాసుకి వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. వారితో కలిసి కాసేపు ధ్యానముద్రలో గడిపారు. ఆ ధ్యానం తనకు ఎంతో ప్రశాంతతనిచ్చిందని అన్నారు. ఆ తర్వాత పాఠశాల విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. భారత్‌కు రావడం ఇదే తొలి సారని, ఇక్కడి ప్రజలు ఎంతో దయామయులని కితాబునిచ్చారు. విద్యార్థుల మానసిక ప్రశాంతత కోసం మెడిటేషన్‌తో తరగతుల్ని ప్రారంభించడం, ప్రకృతితో మమేకం కావడం ఎంతో స్ఫూర్తిని కలిగిస్తాయని చెప్పారు. విద్యార్థులతో మంచి సమయాన్ని గడిపిన మెలానియా తిరిగి వెళ్లే ముందు విద్యార్థులు భారత్, అమెరికా జెండాలు పట్టుకొని బారులు తీరి నిల్చొని ఉల్లాసంతో, ఉత్సాహంతో ఛీర్స్ చెబుతూ ఆమెకు వీడ్కోలు చెప్పారు.

### ఏమిటీ హ్యాపీనెస్ క్లాస్‌లు?!

ప్రస్తుత పోటీ ప్రపంచంలో పాఠశాలల్లో తరగతులంటే పాఠాలు బట్టీ పట్టడం, పరీక్షలు రాయడం, మార్కులు, ర్యాంకులు, అడుగడుగునా ఒత్తిళ్లు. ఈ విధానానికి చెక్ పెట్టి విద్యార్థుల మెదడుకి పదును పెడుతూ వారిలో సంతోషాన్ని పెంచే క్లాస్‌లివి. ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ తాను చేపట్టిన విద్యావ్యవస్థ సంస్కరణలో భాగంగా ఈ హ్యాపీనెస్ క్లాస్‌లను ప్రవేశపెట్టారు. ఈ విధానం ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు అందుకుంది. ఢిల్లీ ప్రభుత్వ పాఠశాలల్లో నర్సరీ నుంచి ఎనిమిదో తరగతి వరకు పాఠశాలల్లో 45 నిముషాల సేపు ఈ హ్యాపీనెస్ పీరియడ్ ఉంటుంది. ఈ క్లాసులో పిల్లలందరి మానసిక ప్రశాంతత కోసం కాసేపు ధ్యానం చేయిస్తారు. విలువలతో ఎలా బతకాలో నేర్పిస్తారు. వారి మేధస్సుకు పదును పెట్టేలా, నిత్య జీవితంలో ఎదురయ్యే సమస్యలను తట్టుకొని ఆనందంగా జీవితాన్ని ఎలా గడపాలో వారికి బోధిస్తారు. ఆత్మ స్థైర్యంతో అనర్గళంగా మాట్లాడేలా చర్చలు నిర్వహిస్తారు. వారిలో కళని బయటకు తీసేలా చిన్నచిన్న నాటికలు వేయిస్తారు.

**ఫస్ట్ లేడీకి ప్రశ్నలు**

అమెరికా ఎంత పెద్దది ? ఇక్కడ నుంచి బాగా దూరమా? ఫస్ట్ లేడీ అంటే ఏం చేస్తారు? ఇలా సర్వోదయ పాఠశాలలో ఔత్సాహిక విద్యార్థులు మెలానియా ట్రంప్‌పై ప్రశ్నల వర్షం కురిపించారు. దాదాపు గంటకు పైగా ఆమె స్కూలులో గడిపారు. ఈ సందర్భంగా అక్కడి టీచర్లు మెలానియాను ఏమైనా అడగాలని అనుకుంటే అడగమని విద్యార్థుల్ని ప్రోత్సహించారు. దీంతో అమెరికా గురించి, అక్కడికి వెళ్లేందుకు పట్టే సమయం గురించి రకరకాల ప్రశ్నలు వేశారు. వాటన్నింటికి మెలానియా ఓపిగ్గా సమాధానమిచ్చారు.


**ఢిల్లీ సీఎం ట్వీట్**

మెలానియా పాఠశాలకు రావడానికి ముందు ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఆమెకు స్వాగతం చెబుతూ ట్వీట్ చేశారు.'' మా స్కూలులో హ్యాపీనెస్ క్లాసుకు అమెరికా ఫస్ట్ లేడీ హాజరవుతున్నారు. ఢిల్లీ ప్రజలకు మా పాఠశాల విద్యార్థులు, టీచర్లకు ఇది అద్భుతమైన రోజు. శతాబ్దాలుగా భారత్ ప్రపంచానికి ఆధ్యాత్మికతను బోధిస్తోంది. మా పాఠశాల నుంచి ఆమె ఆనందోత్సాహాలతో తిరిగి వెళతారు. అదే మాకు ఎంతో సంతోషాన్నిస్తుంది'' అని కేజ్రీవాల్ ఆ ట్వీట్‌లో పేర్కొన్నారు.

epaper.sakshi.com

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ
సినిమా
బుధవారం
26-2-2020


● చిరంజీవి


● మహేశ్ బాబు

# చిరు అతిథి

మెగాస్టార్ సినిమాలో సూపర్ స్టార్ కనిపించబోతున్నారా? మూడు నాలుగు రోజులుగా సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్న వార్త ఇది. మెగాస్టార్ చిరంజీవికి సూపర్ స్టార్ మహేశ్‌బాబు అతిథి కాబోతున్నారట. కొరటాల శివ దర్శకత్వంలో చిరంజీవి నటిస్తున్న సినిమాలోనే ఈ విశేషం జరగనుందని టాక్. ఇప్పటివరకూ మహేశ్‌బాబు తాను హీరోగా నటించని 'జల్సా', 'బాద్‌షా', 'శ్రీశ్రీ', 'మనసుకు నచ్చింది' చిత్రాలకు వాయిస్ అందించారు. ఒకవేళ వార్తల్లో ఉన్నట్లు చిరంజీవి సినిమాలో మహేశ్ నటిస్తే మొదటిసారి అతిథి పాత్రలో కనిపించినట్లు అవుతుంది. కొరటాల శివ దర్శకత్వంలో కొణిదెల ప్రొడక్షన్స్ పతాకంపై ఈ చిత్రాన్ని రామ్‌చరణ్ నిర్మిస్తున్నారు. త్రిష కథానాయికగా నటిస్తున్నారు. ఇదిలా ఉంటే... చిత్రదర్శకుడు కొరటాల శివతో 'శ్రీమంతుడు', 'భరత్ అనే నేను' చిత్రాల్లో మహేశ్ నటించిన విషయం తెలిసిందే. మరి.. చిరు–కొరటాల సినిమాకి మహేశ్ అతిథి అవుతారా? వెయిట్ అండ్ సీ.

# ఎలా అంటే అలా

'బాహుబలి' చిత్రంలో బాగా బరువు పెరిగి కండలు తిరిగిన 'భల్లాలదేవ'గా కనిపించారు రానా. ప్రస్తుతం నటించిన 'అరణ్య' కోసం ఏకంగా 30 కిలోల బరువు తగ్గారు. ఇలా పాత్ర ఎలా డిమాండ్ చేస్తే అలా మౌల్డ్ అయిపోతారు. ఇక 'అరణ్య' సినిమా విషయానికి వస్తే.. ఇందులో బందేవ్ అనే పాత్రలో కనిపిస్తారు రానా. అస్సాంలోని ఖాజీరంగా దగ్గరలో ఉన్న ఏనుగుల ఆవాసాన్ని మనుషులు ఆక్రమించారు. అలా కబ్జా చేసిన సంఘటనలను దృష్టిలో పెట్టుకుని దర్శకుడు ప్రభు సాల్మన్ ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. తన జీవితాన్ని ఎక్కువగా అడవికే అంకితం చేసి, జంతువులను కాపాడే లక్ష్యంతో ఉండే బందేవ్ అనే వ్యక్తి నిజజీవిత పాత్రలో నటించారు రానా. విశేషం ఏంటంటే.. ఈ సినిమా కోసం 30 కిలోలు తగ్గడమే కాదు.. సినిమా మొత్తం తన ఎడమ భుజాన్ని (లెఫ్ట్ షోల్డర్) పైకి లేపి నటించారు రానా. ఈరోస్ ఇంటర్నేషనల్ నిర్మించిన ఈ సినిమా తెలుగులో 'అరణ్య'గా, తమిళ్‌లో 'కాడన్'గా హిందీలో 'హాథీ మేరే సాథీ'గా ఏప్రిల్ 2న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ''ఎప్పుడూ భారీకాయంతో ధృడంగా ఉండాలనుకునే నాకు ఈ స్థాయిలో బరువు తగ్గడం అనేది చాలా కష్టమైన పని. ఈ సినిమా కోసం నేను తీసుకున్న ఫిజికల్ ట్రైనింగ్ నాకొక వండర్‌ఫుల్ లెర్నింగ్ ఎక్స్‌పీరియన్స్'' అన్నారు రానా.


● రానా

# జురాసిక్.. ఫుల్ కిక్



ప్రస్తుతం హాలీవుడ్‌లో నిర్మాణంలో ఉన్న చిత్రాల్లో టాపిక్ ఆఫ్ ది టౌన్‌గా నిలిచిన వాటిలో 'జురాసిక్ వరల్డ్ 3' ఒకటి. జురాసిక్ ఫ్రాంచైజీలో వచ్చిన తొలి చిత్రం 'జురాసిక్' (1993)లో వెండితెరపై రాక్షస బల్లులు చేసిన వీర విహారానికి పిల్లలూ పెద్దలూ ఫిదా అయిపోయారు. దర్శకుడు స్టీవెన్ స్పీల్‌బర్గ్ తెరకెక్కించిన ఈ 'జురాసిక్ పార్క్' ఎంత క్రేజ్ తెచ్చుకుందంటే.. ఆ తర్వాత వచ్చిన సీక్వెల్స్‌ని కూడా ప్రేక్షకులు ఆసక్తిగా చూశారు. ఇప్పుడు 'జురాసిక్ వరల్డ్ 3'పైనే అందరి దృష్టి ఉంది. కొందరు రచయితలతో కలిసి చిత్రదర్శకుడు కోలిన్ ట్రెవరో ఈ భాగానికి రాసిన స్క్రిప్ట్ అదిరిపోయే రేంజ్‌లో ఉందని కీలక పాత్రధారి క్రిస్ ప్రాట్ పేర్కొన్నారు. ''గత ఏడాది విడుదలై, ఘనవిజయం సాధించిన 'ఎవెంజర్స్: ది ఎండ్ గేమ్'కి దీటుగా తాజా జురాసిక్ చిత్రం ఉంటుంది. జురాసిక్ ఫ్రాంచైజీలో వచ్చిన గత చిత్రాలకన్నా ఈ చిత్రకథ మరింత కిక్ ఇచ్చే విధంగా ఉంది. తొలి భాగంలో నటించిన స్యామ్ నీల్, లారా డెర్న్, జెఫ్ గోల్డ్‌బ్లమ్ కూడా ఈ చిత్రంలో నటిస్తారు. భారీ స్థాయిలో రాబోతున్న చిత్రం ఇది. త్వరలో షూటింగ్ స్టార్ట్ చేస్తాం'' అన్నారు క్రిస్ ప్రాట్. వచ్చే ఏడాది జూన్ 11న ఈ చిత్రం విడుదల కానుంది.

# నాలుగేళ్ల తర్వాత హిట్ వచ్చింది

- నితిన్


● 'దిల్' రాజు, రష్మికా మందన్నా, నితిన్, మహతి స్వరసాగర్, నాగవంశీ, వెంకీ కుడుముల

''భీష్మ' సినిమాను ఇంత పెద్ద హిట్ చేసిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు. మా టీమ్ ఎప్పట్నుంచో ఎదురు చూస్తున్న హిట్ ఇది. నేను బాగా నటించాను.. నవ్వించానని అంటుంటే సంతోషంగా ఉంది. డైరెక్టర్ వెంకీని కాపీ కొట్టానంతే. అతను ఎలా చెయ్యమంటే అలా చేశాను కాబట్టే నా నటన బాగుందంటున్నారు'' అని నితిన్ అన్నారు. వెంకీ కుడుముల దర్శకత్వంలో నితిన్, రష్మికా మందన్నా జంటగా నటించిన చిత్రం 'భీష్మ'. సితార ఎంటర్‌టైన్మెంట్స్ పతాకంపై సూర్యదేవర నాగవంశీ నిర్మించిన ఈ సినిమా గత శుక్రవారం విడుదలైంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన విజయోత్సవంలో **నితిన్** మాట్లాడుతూ –''భీష్మ' హిట్‌తో చాలా మందికి వెంకీ జవాబు చెప్పాడు. నాలుగేళ్ల తర్వాత నాకు హిట్ వచ్చింది.. అందుకే ఎమోషన్ అవుతున్నా. ఈ సినిమాలో రష్మికతో కంటే సంపత్ రాజ్‌తో నా కెమిస్ట్రీ ఇంకా బాగా కుదిరిందని అంటున్నారు. 'ఛలో'తో వెంకీకి, 'భీష్మ'తో నాకు రష్మిక బ్రేక్ ఇచ్చింది. 'అ ఆ'తో నా కెరీర్‌లో బిగ్గెస్ట్ హిట్టిచ్చిన బ్యానర్‌లోనే నాకు మళ్లీ హిట్ వచ్చింది.. ఈ సంస్థలో మరెన్నో సినిమాలు చెయ్యాలని కోరుకుంటున్నా'' అన్నారు.

'భీష్మ' చిత్రం పంపిణీదారుడు, నిర్మాత **'దిల్' రాజు** మాట్లాడుతూ –''ఈ సినిమా ప్రీ రిలీజ్ వేడుకలో నేను చెప్పినట్లే ప్రేక్షకులు సూపర్ హిట్ చేశారు. 'ఛలో'తో హిట్ కొట్టిన వెంకీ 'భీష్మ'తో సూపర్ హిట్ కొట్టాడు.. ఇక హ్యాట్రిక్‌కు రెడీ అవుతున్నాడు. నితిన్‌తో 'శ్రీనివాస కల్యాణం' చిత్రంతో హిట్ కొట్టాలనుకున్నాం. కానీ, కుదరలేదు. హీరోలతో పోటీ పడుతూ రష్మిక డ్యాన్స్ చేస్తోంది. సినిమాలో మంచి కామెడీ, కంటెంట్ బలంగా ఉంటే ప్రేక్షకులు హిట్ చేస్తారని 'ప్రతి రోజూ పండగే', 'సరిలేరు నీకెవ్వరు', 'అల వైకుంఠపురములో', 'భీష్మ' సినిమాలు నిరూపించాయి'' అన్నారు.

**వెంకీ కుడుముల** మాట్లాడుతూ –''నా కథని నమ్మి అవకాశం ఇచ్చిన చినబాబు, వంశీ, నితిన్ గార్లకు థ్యాంక్స్. నా సాంకేతిక నిపుణులంతా బాగా సహకారం అందించడం వల్లే నేను అనుకున్న విధంగా సినిమా తీశాను. 'దిల్' సినిమా నుంచి నితిన్‌ను అభిమానిస్తూ వస్తున్నా. కలిసి పని చేసేటప్పుడు ఆయన ప్రవర్తనకూ నేను అభిమానినైపోయా'' అన్నారు. ''భీష్మ'లో నాకు మంచి పాత్ర ఇచ్చినందుకు వెంకీకి రుణపడి ఉంటాను. భీష్మ పాత్రలో నితిన్‌ను చూసి అభిమానిని అయిపోయాను'' అన్నారు రష్మికా మందన్నా. ఈ విజయోత్సవంలో సూర్యదేవర నాగవంశీ, కెమెరామేన్ సాయి శ్రీరామ్, సంగీత దర్శకుడు మహతి స్వరసాగర్, నటులు 'శుభలేఖ' సుధాకర్, సంపత్ రాజ్, పాటల రచయితలు కాసర్ల శ్యామ్, శ్రీమణి, ఆర్ట్ డైరెక్టర్ సాహి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# షూటింగ్ ఇంపాజిబుల్


● టామ్ క్రూజ్

హాలీవుడ్ యాక్షన్ మూవీస్‌ని ఫాలో అయ్యేవారికి 'మిషన్ ఇంపాజిబుల్' సిరీస్ గురించి తెలిసే ఉంటుంది. 'మిషన్ అసాధ్యం' అనేది టైటిల్ అర్థం. నిజమే.. ఇందులో హీరోకి ఏదీ అసాధ్యం కాదు. ఇప్పటివరకూ ఆరు భాగాలు వచ్చాయి. ఏడో భాగం సెట్స్ మీద ఉంది. అన్ని భాగాల్లోనూ హీరోగా నటిస్తూ వస్తున్న టామ్ క్రూజ్ ఏడో భాగంలోనూ హీరోగా నటిస్తున్నారు. ఇప్పుడు ఈ అమెరికన్ యాక్షన్ స్పై ఫిల్మ్‌పై కరోనా ఎఫెక్ట్ పడింది. ఇటలీలో మూడు వారాల షెడ్యూల్‌ని ప్లాన్ చేశారు. అయితే అక్కడ కరోనా వైరస్ వ్యాప్తి విస్తృతంగా ఉండటంతో చిత్రనిర్మాణ సంస్థ పారామౌంట్ పిక్చర్స్ ఈ షెడ్యూల్‌ని వాయిదా వేసింది. ఈ సినిమాలో హీరోకి ఏదీ ఇంపాజిబుల్ కాదు.. అన్నీ సాధ్యం చేసేస్తాడు. కానీ కరోనా వైరస్ వల్ల 'మిషన్ ఇంపాజిబుల్' షూటింగ్ ఇటలీలో ఇంపాజిబుల్. వచ్చే ఏడాది జూలై 23న ఈ చిత్రాన్ని విడుదల చేయాలనుకుంటున్నారు.

# 34 ఏళ్ల తర్వాత...

నీతికీ నిజాయతీకి నిదర్శనంలా ఉంటాడు ఆ జర్నలిస్ట్. రాజకీయాల్లో జరిగిన ఓ అవినీతిని బయటపెట్టడానికి నడుం బిగిస్తాడు. 1986లో విడుదలైన హిందీ చిత్రం 'న్యూ ఢిల్లీ టైమ్స్' స్టోరీ లైన్ ఇది. శశికపూర్, షర్మిలా ఠాగూర్, ఓంపురి ముఖ్య తారలుగా రమేష్ శర్మ దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందింది. మూడు జాతీయ అవార్డులు ఈ చిత్రానికి దక్కాయి. ఈ సినిమా విడుదలైన 34 ఏళ్లకు రమేష్ శర్మ సీక్వెల్ ప్లాన్ చేశారు. అప్పటి సినిమాకి గుల్జార్ రచయితగా వ్యవహరించారు. దర్శకుడు శ్యామ్ బెనెగల్ తెరకెక్కించిన 'మమ్మో, సర్దారీ బేగమ్, జుబేదా' వంటి విమర్శకుల ప్రశంసలను కూడా అందుకున్న చిత్రాలకు రచయితగా వ్యవహరించిన ఖలీద్ మొహమ్మద్ ఈ సీక్వెల్‌కి కథ రాస్తున్నారు. ''నా ఫ్రెండ్ రమేష్ శర్మ డైరెక్ట్ చేయబోతున్నాడు. నేను కథ రాస్తున్నాను. లీడ్ ఆర్టిస్ట్‌లను ఇంకా సెలెక్ట్ చేయాలి'' అన్నారు ఖలీద్.



● రమేష్, ఖలీద్


● అనన్యా పాండే

# నా క్యారెక్టర్ నాలానే ఉంటుంది!

అనన్యా పాండే.. డాటర్ ఆఫ్ చంకీ పాండే తెలుగు తెరకు పరిచయం కాబోతున్న విషయం తెలిసిందే. పూరి జగన్నాథ్ దర్శకత్వం వహిస్తున్న ప్యాన్ ఇండియన్ మూవీ 'ఫైటర్'లో విజయ్ దేవరకొండ సరసన హీరోయిన్‌గా నటిస్తున్నారు అనన్య. ''ఈ చిత్రంలో నా క్యారెక్టర్ నా రియల్ లైఫ్ క్యారెక్టర్‌లానే ఉంటుంది. అమ్మాయిలందరూ ఈ సినిమాలోని నా పాత్రకు కనెక్ట్ అవుతారు'' అన్నారు అనన్యా పాండే. ఈ సినిమా ఒప్పుకునేవరకూ ఈ బ్యూటీకి తెలుగు రాదు. ఇప్పుడు కొన్ని కొన్ని పదాలు వచ్చుట. ''ప్రతి రోజూ ఈ చిత్రం షూటింగ్‌లో కొన్ని తెలుగు పదాలు నేర్చుకోవాలని నా అంతట నేను ఒక రూల్ పెట్టుకున్నాను. అలాగే నేర్చుకుంటున్నాను. నా పాత్రకు నేనే డబ్బింగ్ చెప్పుకోవాలనుకుంటున్నాను. తెలుగులో మాత్రమే కాదు.. ఏ భాషలో సినిమా చేస్తే ఆ భాషలో డబ్బింగ్ చెప్పుకోవాలని ఉంది. మరి చూడాలి'' అన్నారు.

# రాహుకి కథే హీరో



"రాహు' సినిమాలో కథానాయికకు ఓ వ్యాధి ఉంటుంది. రక్తం చూసినప్పుడు కళ్లు కనిపించవు.. ఒత్తిడికి గురవుతుంది. అలాంటి అమ్మాయి జీవితంలో రాహు ప్రవేశిస్తే ఏమవుతుంది? అనేది ఆసక్తికరంగా చూపించాం" అన్నారు **సుబ్బు వేదుల**. అభిరామ్ వర్మ, కృతీ గార్గ్ జంటగా సుబ్బు వేదుల దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'రాహు'. ఏవీఎస్ ఆర్ స్వామి, శ్రీ శక్తి బాబ్జి, రాజా దేవరకొండ, సుబ్బు వేదుల నిర్మించిన ఈ సినిమా ఈ నెల 28న విడుదలవుతున్న సందర్భంగా సుబ్బు వేదుల చెప్పిన విశేషాలు.

- నాది వైజాగ్. న్యూయార్క్ యూనివర్సిటీలో ఫిల్మ్ మేకింగ్‌లో శిక్షణ తీసుకున్నాను. ఆ సమయంలోనే రచయిత కోన వెంకట్ గారితో నాకు పరిచయం ఏర్పడింది. మేమిద్దరం కొన్ని కథలకు కలిసి పనిచేశాం. ఆయన బ్యానర్‌లో 'గీతాంజలి 2' సినిమా నేను చేయాల్సి ఉంది.. కొన్ని కారణాల వల్ల మా కాంబినేషన్‌లో సినిమా ప్రారంభం కాలేదు.. కానీ, ఆయన నాకు మంచి సహకారం అందించారు.
- 'రాహు' సినిమాకి కథే హీరో. దాదాపు ఏడాది పాటు ఈ కథపై పనిచేశా. చిత్ర నిర్మాతలు కథ వినగానే సినిమా చేద్దామన్నారు. నా కథపైన నమ్మకంతో నేను కూడా ఈ చిత్రానికి ఒక నిర్మాతగా వ్యవహరించాను. మా నిర్మాతల సహకారం మరువలేనిది. 52 రోజుల్లో చిత్రీకరణ మొత్తం పూర్తి చేశాం.
- థ్రిల్లర్ జోనర్‌లో ఇప్పటి వరకూ చాలా సినిమాలు వచ్చాయి. కానీ, మా చిత్రం ప్రేక్షకులకు కొత్త తరహా థ్రిల్‌ని అందించడంతో పాటు తాజా అనుభూతి ఇస్తుంది. ఈ చిత్రంలో నేను రెండు పాటలు రాశాను. ప్రవీణ్ లక్కరాజు సంగీతం, నేపథ్య సంగీతం హైలైట్. నేను, నా కూతురు ఈ సినిమాలో నటించాం. 'మధుర' శ్రీధర్‌గారు మాకు మంచి సహకారం అందించారు. సురేష్ బాబుగారు మా సినిమాను విడుదల చేయడం, జీ చానల్ వాళ్లు డిజిటల్ రైట్స్ తీసుకోవడం విడుదలకు ముందే మేం సాధించిన విజయాలు.
- డైరెక్టర్ చంద్రశేఖర్ యేలేటిగారి సినిమాలంటే ఇష్టం. 'అనుకోకుండా ఒకరోజు' చిత్రం నా ఫేవరెట్. ఇళయరాజాగారి సంగీతం అంటే చాలా ఇష్టం. నాకు ఇష్టమైన కథానాయకుడు అల్లు అర్జున్.. ఆయన నటన సూపర్బ్. పెద్ద స్టార్స్‌తో సినిమా చెయ్యాలంటే నన్ను నేను నిరూపించుకోవాలి. 'రాహు' తర్వాత స్టార్ హీరోలను సంప్రదిస్తా. ఒక స్టార్ హీరో కోసం 'మృగం' అనే సినిమా స్క్రిప్ట్ సిద్ధంగా ఉంది.

# భావోద్వేగాల సీతాయణం

'బాషా' చిత్రంలో రజనీకాంత్ తమ్ముడిగా నటించిన శశికుమార్ పలు తెలుగు, తమిళ, కన్నడ సినిమాల్లో నటించి ప్రేక్షకుల్ని అలరించారు. ఆయన తనయుడు అక్షిత్ శశికుమార్ హీరోగా పరిచయమవుతున్నారు. తెలుగు, కన్నడ భాషల్లో అక్షిత్ హీరోగా నటించిన చిత్రానికి 'సీతాయణం' అనే టైటిల్ ఖరారు చేశారు. దర్శకులు వై.వి.యస్ చౌదరి, దశరథ్‌ల వద్ద పని చేసిన ప్రభాకర్ ఆరిపాక ఈ చిత్రంతో దర్శకుడిగా పరిచయమవుతున్నారు. అనహిత భూషణ్ కథానాయికగా నటించారు. రోహన్ భరద్వాజ్ సమర్పణలో కలర్ క్లౌడ్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై లలిత రాజ్యలక్ష్మి నిర్మించిన ఈ సినిమా చిత్రీకరణ ఇటీవలే పూర్తయింది. లలిత రాజ్యలక్ష్మి మాట్లాడుతూ– ''లవ్, క్రైమ్, డ్రామాతో నడిచే చిత్రమిది. కథా కథనాలు నేటి ట్రెండ్‌కి తగ్గట్టుగా ఉంటాయి. విభిన్న భావోద్వేగాలు మెప్పిస్తాయి. అక్షిత్ శశికుమార్ ఈ చిత్రంతో తెలుగు, కన్నడ భాషల్లో హీరోగా స్థిరపడిపోవడం ఖాయం.. అంత బాగా నటించారు. మార్చిలో సినిమాను విడుదల చేస్తాం'' అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: దుర్గాప్రసాద్ కొల్లి, సంగీతం: పద్మనాభ్ భరద్వాజ్.


● అక్షిత్ శశికుమార్, అనహిత

# ప్రేక్షకులకు భరోస

బాల శ్రీవాస్తవ హీరోగా నటించి, నిర్మించిన చిత్రం 'భరోస'. ఈ చిత్రంతో రామ్మోహన్ బి. దర్శకునిగా పరిచయమవుతున్నారు. దివ్య కథానాయిక. ఈ సినిమా నిర్మాణానంతర కార్యక్రమాలు పూర్తి చేసుకున్న సందర్భంగా రామ్మోహన్ మాట్లాడుతూ– ''పొలిటికల్ యాక్షన్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన చిత్రమిది. వినోదానికి ప్రాధాన్యత ఇచ్చాం. ఈ చిత్రంలోని ప్రేమకథ యూత్‌ని ఆకట్టుకుంటుంది. త్వరలో సినిమా విడుదల తేదీ ప్రకటిస్తాం'' అన్నారు. సుమన్, ఫిష్ వెంకట్ తదితరులు నటించిన ఈ చిత్రానికి కెమెరా: నరేందర్, సంగీతం: వెంకట్ ఐనాల.


● దివ్య, బాల శ్రీవాస్తవ


# ఆమె కథ

రేవతీ రాయ్ ఎవరో చాలామందికి తెలుసు. అయినా చెప్పుకోవాలి. అప్పుల బాధ, అనారోగ్యంపాలైన భర్త, ముగ్గురు పిల్లల ఆలనాపాలనా... ఇలా రేవతి జీవితం కష్టాలకు కేరాఫ్ అడ్రస్ అనే పరిస్థితి. చివరికి భర్త కూడా చనిపోతాడు. ఇక ముగ్గురు పిల్లల బాధ్యత తన మీదే. ఒంటరి మహిళ. ఉద్యోగం కోసం వెతికితే ఎవరూ ఇవ్వలేదు. అప్పుడు వచ్చిన ఆలోచనే 'ఫర్ షీ'. తనకు తెలిసిన డ్రైవింగ్‌నే ఉపాధిగా ఎంచుకున్నారు రేవతి. క్యాబ్ డ్రైవర్‌గా మారారు. తనలా కష్టపడే వారి కోసం 'ఫర్ షీ' అనే క్యాబ్ సర్వీస్ స్టార్ట్ చేసి, ఉపాధి కల్పించారు. ఆ తర్వాత ఒక్క ఫోన్ కొట్టి, మందులు, నిత్యావసర వస్తువులు కావాలని చెబితే, తక్కువ సమయంలో మహిళా సిబ్బంది అందజేసేలా 'హే దీదీ' పేరుతో డెలివరీ సర్వీస్ ప్రారంభించారామె. ముంబైకి చెందిన రేవతీ రాయ్ జీవితంలో ఒక సినిమాకి సరిపోయే కథ ఉంది. మహిళలకు ఆదర్శంగా నిలిచిన ఆమె జీవితంతో హిందీ నటుడు జాన్ అబ్రహామ్ సినిమా నిర్మించనున్నారు. ఈ బయోపిక్‌ని జాన్‌తో కలిసి మరో ఇద్దరు నిర్మాతలు నిర్మిస్తారు. రాబ్బీ గ్రేవాల్ దర్శకుడు. ''ఎన్నో కష్టనష్టాలను తట్టుకుని నిలబడి, ఎందరికో స్ఫూర్తిగా నిలిచిన రేవతి జీవితాన్ని సినిమాగా తీస్తున్నందుకు హ్యాపీగా ఉంది'' అన్నారు జాన్. ''ఇది నా కథ మాత్రమే కాదు. ఇతర మహిళలకు ఓ బాట చూపించిన మహిళలందరి కథ కూడా. పుట్టుకతోనే పోరాట యోధులుగా పుడతారు మహిళలు. వారికి ఒక్క అవకాశం ఇస్తే వృథా కాదు'' అన్నారు రేవతీ రాయ్. త్వరలో ఈ చిత్రం షూటింగ్ ఆరంభం కానుంది.


● రేవతీ రాయ్‌తో జాన్ అబ్రహాం....

# ఖైదీ దొరికాడా?

గత ఏడాది దీపావళికి తెలుగు, తమిళ భాషల్లో సూపర్ హిట్ అయిన చిత్రం 'ఖైదీ'. ఖైదీ పాత్రలో కార్తీ కనిపించారు. లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో యస్ఆర్ ప్రభు నిర్మించారు. ఈ సినిమాను రిలయన్స్ ఎంటర్‌టైన్‌మెంట్‌తో కలిసి హిందీలో రీమేక్ చేస్తున్నట్టు ఆ మధ్య ప్రకటించారు నిర్మాత ప్రభు. నటీనటుల వివరాలు మాత్రం ప్రకటించలేదు. 'ఖైదీ' హిందీ రీమేక్‌లో అజయ్ దేవగన్ కనిపిస్తారని బాలీవుడ్ టాక్. దర్శకుడు ఎవరనేది ఇంకా ఖరారు కాలేదు. ఈ ఏడాది చివర్లో ఈ సినిమా సెట్స్ మీదకు వెళ్లనుందట.


● అజయ్ దేవగన్



నమోస్తే ట్రంప్
నల్లగొండ | బుధవారం | ఫిబ్రవరి | 26 | 2020 |
www.sakshi.com

## థాంక్యూ ప్రెసిడెంట్ ట్రంప్!

భారత్‌లో పర్యటించిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌నకు ప్రధాని మోదీ కృతజ్ఞతలు తెలిపారు. దాదాపు 36 గంటల భారత పర్యటన ముగించుకుని ట్రంప్ అమెరికాకు బయల్దేరి వెళ్లిన తరువాత మంగళవారం రాత్రి మోదీ ట్వీట్ చేశారు. ఈ పర్యటన ద్వారా ఇరుదేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు కొత్త శిఖరాలకు చేరాయన్నారు. ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాల బలోపేతానికి మార్గం వేశామన్నారు. 'ఇండోయూఎస్ మైత్రి ఈ రెండు దేశాల ప్రజలకే కాదు.. ప్రపంచ ప్రజలందరికీ ప్రయోజనం చేకూరుస్తుంది' అని పేర్కొన్నారు. 'భారత పర్యటనకు వచ్చిన ప్రెసిడెంట్ ట్రంప్‌నకు, ప్రథమ మహిళ మెలానియాకు కృతజ్ఞతలు. భారతీయ సంస్కృతి, ఆతిథ్యాల విభిన్న కోణాలను వారు చూశారని భావిస్తున్నా' అని మోదీ వరుస ట్వీట్లు చేశారు. ట్రంప్ దంపతులను భారతీయులు సాదరంగా ఆహ్వానించారన్నారు. ట్రంప్ కూతురు ఇవాంకా, ఆమె భర్త కుష్నర్‌లకు ఆతిథ్యం ఇచ్చినందుకు సంతోషంగా ఉందని మరో ట్వీట్ చేశారు. భారత్‌పై మీకున్న ప్రేమ స్పష్టంగా తెలుస్తోందని అందులో పేర్కొన్నారు.



హైదరాబాద్ హౌస్‌లో సంయుక్త మీడియా ప్రకటన చేసేందుకు కలసివస్తున్న ట్రంప్, మోదీ

# 24 రోమియోలు 6 అపాచీలు

- యూఎస్ నుంచి రక్షణ రంగ అవసరాల కోసం 30 హెలికాప్టర్లను కొనుగోలు చేయనున్న భారత్
- 300 కోట్ల డాలర్లపైచిలుకు విలువైన ఒప్పందం ఖరారు
- దాదాపు ఐదు గంటల పాటు చర్చల్లో పాల్గొన్న ట్రంప్, మోదీ

న్యూఢిల్లీ

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత పర్యటన సందర్భంగా మంగళవారం ఇరు దేశాల మధ్య ఇక్కడి హైదరాబాద్ హౌజ్‌లో కీలక ద్వైపాక్షిక అంశాలపై సమగ్రంగా ప్రతినిధుల స్థాయి చర్చలు జరిగాయి. చర్చల్లో ప్రధాని మోదీ, ప్రెసిడెంట్ ట్రంప్ కూడా పాల్గొన్నారు. చర్చల అనంతరం, ఇరు దేశాల మధ్య ముఖ్యమైన రక్షణ ఒప్పందంతో పాటు ఇంధన, ఆరోగ్య రంగాల్లో మూడు ఒప్పందాలు కుదిరాయి. చర్చల అనంతరం ట్రంప్ మాట్లాడుతూ.. 300 కోట్ల డాలర్లకు పైగా విలువైన అత్యాధునిక రక్షణ ఉత్పత్తుల కొనుగోలుకు సంబంధించి ఒప్పందాలు కుదిరాయన్నారు. ఈ ఒప్పందంలో భాగంగా, 260 కోట్ల డాలర్ల విలువైన 24 ఎంహెచ్-60 రోమియో హెలికాప్టర్లను భారతీయ నౌకాదళం కోసం లాక్‌హీడ్ మార్టిన్ సంస్థ నుంచి భారత్ కొనుగోలు చేయనుంది. అలాగే, 80 కోట్ల డాలర్ల విలువైన ఆరు ఏహెచ్-64ఈ అపాచీ హెలికాప్టర్లను ఆర్మీ అవసరాల కోసం ప్రఖ్యాత బోయింగ్ సంస్థ నుంచి కొనుగోలు చేస్తుంది. ఈ ఒప్పందాలు భారత్, అమెరికాల రక్షణ భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేస్తుందని ట్రంప్ పేర్కొన్నారు. అలాగే, మానసిక ఆరోగ్యానికి సంబంధించి ఇరు దేశాల ఆరోగ్య శాఖల మధ్య ఒక ఎంఓయూ కుదిరింది. భారత్‌కు చెందిన సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్, అమెరికాకు చెందిన ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ మధ్య వైద్య ఉత్పత్తుల రక్షణకి సంబంధించి ఒక ఎంఓయూపై సంతకాలు జరిగాయి. అలాగే, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్, ఎగ్జాన్ మొబిల్ ఇండియా ఎల్‌ఎన్‌జీ లిమిటెడ్, చార్ట్ ఇండస్ట్రీస్ కార్పొరేషన్‌ల మధ్య సహకారానికి సంబంధించి ఒక లెటర్ ఆఫ్ కోఆపరేషన్‌పై సంతకాలు జరిగాయి.

### 'హెచ్1 బీ'పై ఆందోళన

చర్చల అనంతరం, వాటి వివరాలను విదేశాంగ శాఖ కార్యదర్శి హర్షవర్ధన్ ష్రింగ్లా వెల్లడించారు. ఇరుదేశాల మధ్య 'అంతర్గత భద్రత, రక్షణ, ఇంధనం, సాంకేతికత, ప్రజల మధ్య సంబంధాలు' అనే ఐదు ప్రధాన రంగాల్లో సహకారానికి సంబంధించి చర్చలు జరిగాయని ఆయన తెలిపారు. రక్షణ రంగంలో సహకారానికి సంబంధించి భారత్‌కు అత్యంత ప్రాధాన్యతనిస్తామని ట్రంప్ హామీ ఇచ్చారన్నారు. ఈ సందర్భంగా మోదీ, ట్రంప్‌ల మధ్య దాదాపు 5 గంటల పాటు చర్చలు కొనసాగాయన్నారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణాను అడ్డుకునేందుకు భారత్, అమెరికాలు సంయుక్తంగా వర్కింగ్ గ్రూప్స్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించాయన్నారు. అలాగే, చర్చల సందర్భంగా హెచ్1 బీ వీసాల విషయంలో తమ ఆందోళనలను అమెరికా దృష్టికి భారత్ తీసుకువచ్చిందన్నారు. అమెరికా హైటెక్ రంగంలో భారతీయుల పాత్రను ప్రధానంగా ప్రస్తావించామన్నారు. భారత్, అమెరికాల మధ్య వాణిజ్యం గణనీయంగా అభివృద్ధి చెందుతోందన్నారు. ఇరుదేశాల మధ్య వాణిజ్య లోటు కూడా ప్రస్తుతం గణనీయ స్థాయికి తగ్గిందని ష్రింగ్లా వెల్లడించారు. అమెరికా భారత అతిపెద్ద వాణిజ్య భాగస్వామి అని, భారత్ మొత్తం ఎగుమతుల్లో 12% యూఎస్‌కే ఉంటాయని తెలిపారు. ట్రంప్, మోదీల మధ్య సీఏఏ అంశం చర్చకు రాలేదని ష్రింగ్లా తెలిపారు. చర్చలో మత సామరస్యం అంశం ప్రస్తావనకు వచ్చిందని, భిన్నత్వం, బహుళత్వం భారత్, అమెరికాల ఉమ్మడి విలువలని ఆ సందర్భంగా ఇరువురు నేతలు అభిప్రాయపడ్డారని ఆయన వెల్లడించారు. అహ్మదాబాద్‌లో జరిగిన నమస్తే ట్రంప్ కార్యక్రమంలోనూ ట్రంప్ భారత్‌లోని మత విభిన్నతను, మత సామరస్యాన్ని ప్రస్తావించిన విషయాన్ని ష్రింగ్లా గుర్తు చేశారు. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ మరోసారి గెలుస్తారనే భావనతోనే.. ఈ స్థాయి స్వాగతం భారత్ నుంచి లభిస్తోందా? అని ప్రశ్నించగా.. వేరు వేరు పార్టీలకు చెందిన యూఎస్ అధ్యక్షులు భారత్‌కు వచ్చారని, ద్వైపాక్షిక సహకారం ప్రాతిపదికగానే వారితో భారత్ వ్యవహరిస్తుందని వివరించారు.

### ఉగ్ర సంస్థలపై చర్యలు తీసుకోండి

పాక్ భూభాగంపై ఉగ్ర స్థావరాలకు ఆశ్రయం ఇవ్వకూడదని, ఉగ్రదాడులకు పాక్ గడ్డను ఉపయోగించుకునే అవకాశం ఇవ్వకూడదని ప్రధాని మోదీ, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ స్పష్టం చేశారు. సీమాంతర ఉగ్రవాదాన్ని ఇరువురు నేతలు తీవ్రంగా ఖండించారు. 26/11 ముంబై దాడుల సూత్రధారులు సహా ఆ తరహా దాడులకు పాల్పడిన వారికి అతి త్వరగా శిక్ష పడేలా చూడాలని పాక్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం సాయంత్రం ఇరువురు నేతలు సంయుక్త ప్రకటన విడుదల చేశారు. జైషే మొహమ్మద్, లష్కరే, హిజ్బుల్ ముజాహిదీన్, డీ-కంపెనీ(దావూద్ ఇబ్రహీంకు చెందిన మాఫియా సంస్థ), అల్ కాయిదా, ఐసిస్, హక్కానీ నెట్‌వర్క్, తెహరీక్ ఇ తాలిబన్ పాకిస్తాన్ తదితర ఉగ్రవాద సంస్థలను, వాటి సోదర సంస్థలపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని అందులో కోరారు.





## ఒకటి అపాచీ ఇంకోటి రోమియో

### అపాచీ ఏహెచ్-64ఈ

| | |
|---|---|
| ప్రయాణించగలిగే సిబ్బంది సంఖ్య | 2 |
| పొడవు | 17.7 మీటర్లు |
| ఎత్తు | 5 మీటర్లు |
| రోటర్ వ్యాసం | 14.6 |
| ఒట్టి హెలికాప్టర్ బరువు | 5170 కిలోలు |
| ఆయుధాలన్నీ ఎక్కించిన తరువాత బరువు | 10,439 కిలోలు |
| నిలువుగా పైకి ఎగబాకే వేగం నిమిషానికి | 2,000 అడుగులు |
| ఇంజిన్ల సంఖ్య (జనరల్ ఎలక్ట్రిక్ టీ-700 టర్బోషాఫ్ట్) | 2 |
| గరిష్ట వేగం | 284 గంటకు కి.మీ. |
| ఆయుధ సంపత్తి... | 30 మిల్లీమీటర్ల ఫిరంగి గుళ్లు (1200 రౌండ్లు) |
| ట్యాంకు విధ్వంసక క్షిపణులు | 16 |

క్షిపణుల్లో రకాలు

ఏఐఎం 92 స్టింగర్ మిస్త్రాల్, క్షిపణులు నాలుగు చొప్పున బిగించుకోవచ్చు. లేదంటే రెండు ఏఐఎం-9 సైడ్ విండర్ క్షిపణులు ఉపయోగించుకోవచ్చు.

ఏజీఎం-122 సైడ్ ఆర్మ్ యాంటీ రేడియేషన్ క్షిపణులు రెండు చొప్పున ఏర్పాటు చేసుకోవచ్చు. లేజర్లు, పరారుణ కాంతుల సాయంతో లక్ష్యాలను గుర్తించవచ్చు. ఏ లక్ష్యాలపై గురిపెట్టాలో కూడా నిర్ణయించవచ్చు.

### ఎంహెచ్60 రోమియో

| | |
|---|---|
| పరిధి | 834 కిలో మీటర్లు |
| ఎత్తు | 5.1 మీటర్లు |
| పొడవు | 19.76 మీటర్లు |
| వెడల్పు | 16.35 మీటర్లు |
| పైకి ఎగబాక గలిగే వేగం సెకనుకు | 8.38 మీటర్లు |
| బరువు దాదాపుగా | 10,350 కిలోలు |

తయారీ సంస్థ: లాక్‌హీడ్ మార్టిన్

ప్రత్యేకతలు: జలాంతర్గాములను గుర్తించగలదు వెతుకులాట, రక్షణ వంటి కార్యకలాపాలకూ వాడుకోవచ్చు. అత్యాధునిక యుద్ధ వ్యవస్థలన్నీ దీని సొంతం. ఒక్కసారి నింగికి ఎగిరితే 3.30 గంటల సమయం యుద్ధంలో పాల్గొనగలదు. ఎంహెచ్-60 రోమియో హెలికాప్టర్లు అందుబాటులోకి వస్తే...భారత నావికాదళంలోని వెస్ట్‌ల్యాండ్ సీకింగ్ హెలికాప్టర్లు (బ్రిటన్ తయారీ)ల వాడకం ఆగిపోతుంది. దశాబ్దాలుగా సేవలందిస్తున్న సీ కింగ్ నిర్వహణ వ్యయం తడిసి మోపెడు అవుతూండటం దీనికి ఒక కారణం.

భారత్ అమ్ముల పొదిలోకి మరిన్ని శక్తిమంతమైన అస్త్రాలు చేరాయి. ప్రపంచంలోనే అధునాతనమైన అపాచీ ఏహెచ్-64ఈ, ఎంహెచ్-రోమియో రకం హెలికాప్టర్లు ఇంకొన్ని కొనేందుకు భారత్, అమెరికాల మధ్య ఒప్పందం కుదిరింది. సముద్రం అడుగున దాగున్న జలాంతర్గాములను సైతం గుర్తించి దాడి చేయగలగడం రోమియో సత్తా కాగా.. లేజర్ల పర్యవేక్షణలో గుళ్ల వర్షం కురిపించగలగడం అపాచీ ప్రత్యేకత.

# త్వరలో భారీ ట్రేడ్ డీల్

## మాకే కాదు.. ప్రపంచానికీ లాభమే: మోదీ

**న్యూఢిల్లీ:** భారత్, అమెరికా సంబంధాలను 21వ శతాబ్దంలోనే అత్యంత ముఖ్యమైన భాగస్వామ్యాల్లో ఒకటిగా ప్రధాని మోదీ అభివర్ణించారు. భద్రత, రక్షణ రంగాల్లో ద్వైపాక్షిక సహకారం పెంపొందడం ఇరుదేశాల వ్యూహాత్మక మైత్రిలో కీలకమైన అంశమన్నారు. ఇరుదేశాల మధ్య త్వరలో ఒక భారీ, పరస్పర ప్రయోజనకర వాణిజ్య ఒప్పందం కుదరబోతోందని సంకేతాలిచ్చారు. భారత్, అమెరికాల మధ్య మంగళవారం జరిగిన సమగ్ర ద్వైపాక్షిక ప్రతినిధుల స్థాయి చర్చల అనంతరం ట్రంప్‌తో కలిసి సంయుక్తంగా విలేకరుల సమావేశంలో మోదీ పాల్గొన్నారు. వాణిజ్యం, ఉగ్రవాదంపై పోరు, రక్షణ, ఇంధన రంగాల్లో సహకారం.. తదితర కీలక అంశాలు మోదీ, ట్రంప్‌ల నేతృత్వంలో జరిగిన ఆ చర్చల్లో ప్రధానంగా ప్రస్తావనకు వచ్చాయి. రెండు దేశాల మధ్య ప్రధాన వివాదాస్పద అంశమైన ద్వైపాక్షిక వాణిజ్యంపై మోదీ విలేకరుల సమావేశంలో స్పందించారు. ఇరు దేశాల వాణిజ్య మంత్రుల మధ్య ఈ విషయంపై సానుకూల ధోరణిలో చర్చలు జరిగాయని ప్రధాని వెల్లడించారు. 'మా వాణిజ్య మంత్రులు అంగీకారానికి వచ్చిన విషయాలకు ఒక చట్టబద్ధ రూపం తీసుకువచ్చేందుకు ఇరుదేశాల అధికారుల బృందం కృషి చేయాలని ప్రెసిడెంట్ ట్రంప్, నేను నిర్ణయించాం.ఒక అతిపెద్ద వాణిజ్య ఒప్పందానికి సంబంధించి చర్చలు ప్రారంభించాలని కూడా నిర్ణయించాం. ఆ ఒప్పందం ఇరు దేశాలకు ప్రయోజనకర ఫలితాలను సాధిస్తుందని ఆశిస్తున్నాం ' అని మోదీ వెల్లడించారు.

అంతర్జాతీయంగా ఆమోదించబడిన నిబంధనలకు అనుగుణంగానే రెండు దేశాల మధ్య సహకారం కొనసాగుతుందన్నారు. ప్రపంచవ్యాప్తంగా రవాణా సంబంధిత మౌలిక వసతుల అభివృద్ధికి అందించే నిధుల విషయంలో పారదర్శకత అవసరమని తాను, ట్రంప్ భావిస్తున్నామన్నారు. పరస్పర ప్రయోజనాలే కాకుండా, ప్రపంచ ప్రయోజనాలు లక్ష్యంగా తమ ఆలోచనలు కొనసాగాయని మోదీ పేర్కొన్నారు. ఇరుదేశాల సంబంధాలను అంతర్జాతీయ భాగస్వామ్య స్థాయికి పెంచాలని నిర్ణయించామన్నారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణాను, నార్కో టెర్రరిజాన్ని, ఇతర వ్యవస్థీకృత నేరాలను అడ్డుకునేందుకు నూతన విధానాన్ని రూపొందించేందుకు ఇరుదేశాలు అంగీకరించాయని తెలిపారు.



హైదరాబాద్ హౌస్‌లో సందర్శకుల పుస్తకంలో సంతకం చేస్తున్న ట్రంప్



ట్రంప్‌కు కేంద్ర మంత్రులను పరిచయం చేస్తున్న ప్రధాని

### ఆతిథ్యం అద్భుతం

ట్రంప్‌కు భారత్‌లో లభించిన స్వాగతం చిరకాలం గుర్తుండిపోతుందని మోదీ వ్యాఖ్యానించారు. ఇరుదేశాల మధ్య చర్చలు ప్రారంభమయ్యే ముందు ట్రంప్‌నకు స్వాగతం పలుకుతూ.. భారత్, అమెరికాల సంబంధాలు ఈ స్థాయికి పెరగడానికి ట్రంప్ చేసిన కృషిని మోదీ ప్రశంసించారు. ప్రతిగా ట్రంప్ స్పందిస్తూ.. భారత్‌లో ఈ రెండు రోజులు అద్భుతంగా సాగాయన్నారు. ముఖ్యంగా, మొతెరా స్టేడియంలో కార్యక్రమం గొప్పగా జరిగిందన్నారు. 'అది నాకు లభించిన గొప్ప గౌరవం. నిజానికి ఆ స్టేడియానికి భారీగా తరలివచ్చిన ప్రజలు నా కోసం కాదు.. మీ(మోదీ) కోసమే వచ్చారనిపించింది. స్టేడియం లోపల దాదాపు 1.25 లక్షల మంది ఉన్నారు. మీ పేరును నేను పలికిన ప్రతీసారి చప్పట్ల వర్షం కురిసింది. ఇక్కడి ప్రజలు మిమ్మల్ని అమితంగా ప్రేమిస్తున్నారు' అని ట్రంప్ మీడియా ముందే మోదీపై ప్రశంసలు గుప్పించారు.

- సబర్మతి లెక్క సరి

# మహాత్ముడికి ఘన నివాళి

## గాంధీని కొనియాడిన ట్రంప్



రాజ్‌ఘాట్ వద్ద మొక్కను నాటుతున్న ట్రంప్, మెలానియా



గాంధీజీ సమాధి వద్ద నివాళులర్పిస్తున్న ట్రంప్ దంపతులు

**న్యూఢిల్లీ:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఆయన సతీమణి మెలానియా ట్రంప్ మంగళవారం ఢిల్లీలోని రాజ్‌ఘాట్‌లో జాతిపిత మహాత్మాగాంధీ స్మారక స్థలాన్ని సందర్శించారు. మహాత్ముడి సమాధి దగ్గర పుష్పగుచ్ఛాలను ఉంచి, పూలతో అర్చించి నివాళులర్పించారు. అనంతరం ట్రంప్ సందర్శకుల పుస్తకంలో గాంధీజీని కొనియాడుతూ సందేశాన్ని రాశారు. ''మహాత్ముడి ఆలోచనల నుంచి రూపు దిద్దుకున్న అత్యంత అద్భుతమైన సార్వభౌమ భారత్‌కు అమెరికా ప్రజలు బలమైన మద్దతు ఇస్తారు. ఇది నాకు దక్కిన అపూర్వమైన గౌరవం''అని ఆ పుస్తకంలో రాశారు. ట్రంప్ సబర్మతి ఆశ్రమం సందర్శించినప్పుడు మహాత్ముడి ప్రస్తావన లేకుండా సందేశం రాయడంతో ట్విట్టర్‌లో ఆయనపై విమర్శలు వెల్లువెత్తాయి. ట్రంప్ అసలు గాంధీ పేరు విన్నారా అని నెటిజన్లు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో రాజ్‌ఘాట్‌లో ట్రంప్ రాసే సందేశంపై అందరిలోనూ ఆసక్తి నెలకొంది. ఈ సందేశం దగ్గర ట్రంప్‌తో పాటు మెలానియా కూడా సంతకాలు చేశారు. కేంద్ర మంత్రి హర్‌దీప్ సింగ్ పూరీ ట్రంప్‌ను రాజ్‌ఘాట్‌కు తోడ్కొని వెళ్లారు.



# నమస్తే ట్రంప్

నల్లగొండ | బుధవారం | ఫిబ్రవరి | 26 | 2020 |
www.sakshi.com

## అద్భుతం

- తాజ్‌ను చూడగానే ట్రంప్ నుంచి వచ్చిన తొలి మాట
- గైడ్ నితిన్ కుమార్ వెల్లడి

**ఆగ్రా:** ధవళ కాంతుల్లో మెరిసిపోయే ప్రేమ సౌధం తాజ్‌మహల్‌ని చూసీ చూడంగానే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆశ్చర్యచకితుల య్యారు. కాసేపటి తర్వాత తేరుకున్న ఆయన నోటి వెంట అద్భుతం అనే మాట వెలువడింది. సోమవారం ట్రంప్ దంపతులు తాజ్ మహల్ అందాలను వీక్షించిన విషయం తెలిసిందే. మొఘల్ చక్రవర్తి షాజహాన్ నిర్మించిన చలువరాతి ప్రేమ మందిరం తాజ్ చరిత్ర, గొప్పదనం గురించి ట్రంప్ దంపతులకు నితిన్ కుమార్ అనే స్థానిక గైడ్ వివరించారు. 'తాజ్‌మహల్ నిర్మాణం వెనుక శ్రామికులు పడిన కష్టం, ముంతాజ్‌పై షాజహాన్‌కు ఉన్న ప్రేమ, ఔరంగజేబ్ తన తండ్రి షాజహాన్‌ను ఎలా బందీచేశాడో అన్నీ వివరంగా చెప్పాను. షాజహాన్ మరణించిన తర్వాత ముంతాజ్ సమాధి పక్కనే ఆయన సమాధిని ఏర్పాటు చేయడాన్ని వివరించాను. వారిద్దరి ప్రేమ బంధం విన్న ట్రంప్ ఎంతో ఉద్వేగానికి లోనయ్యారు'అని నితిన్ వెల్లడించారు. ఇక కాలుష్య కోరల్లో చిక్కుకున్న తాజ్‌కు మెరుపులు రావడానికి ముల్తానా మిట్టీ (బురదతో జరుపుతున్న ట్రీట్‌మెంట్) గురించి మెలానియా ట్రంప్ చాలా ఆసక్తి చూపించారన్నారు. అమెరికా అధ్యక్షుడికే తాజ్ గురించి వివరించి చెప్పిన నితిన్ రాత్రికి రాత్రి ఆగ్రాలో సెలిబ్రిటీగా మారాడు.





ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఫొటో తీస్తున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కుమార్తె ఇవాంకా ట్రంప్

## కోరితే.. కశ్మీర్‌పై మధ్యవర్తిత్వం!

- వివాదాస్పద అంశాలపై స్పందించనంటూనే కశ్మీర్‌పై కామెంట్ చేసిన ట్రంప్
- భారత్‌లో మతస్వేచ్ఛపై ప్రధాని మోదీతో చర్చించానని వెల్లడి
- అమెరికా ఉత్పత్తులపై భారత్ సుంకాలు భారీగా విధిస్తోందని ఆరోపణ

**న్యూఢిల్లీ:** ఈ పర్యటనలో వివాదాస్పద వ్యాఖ్యలు చేయాలనుకోవడం లేదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానించారు. పౌరసత్వ సవరణ చట్టం(సీఏఏ) భారత్ అంతర్గత వ్యవహారమని, ఆ విషయమై తాను ఏమీ వ్యాఖ్యానించబోనని తేల్చిచెప్పారు. భారత పర్యటన సందర్భంగా మంగళవారం ట్రంప్ విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు. భారత్‌లో ప్రజలకు మతస్వేచ్ఛ ఉండాలని ప్రధాని మోదీ కోరుకుంటున్నారనే తాను భావిస్తున్నానన్నారు. 'వివాదాస్పద అంశాల జోలికి వెళ్లాలనుకోవడం లేదు. వివాదాస్పద అంశాలకు సంబంధించిన ఒక చిన్న సమాధానం నా మొత్తం పర్యటన సానుకూలతను ముంచేస్తుంది. ఆ జవాబును మాత్రమే మీరు పట్టించుకుంటారు. నా పర్యటన అంతా పక్కనబెడ్తారు'అని ట్రంప్ వ్యాఖ్యానించారు. వివాదాస్పద అంశాల జోలికి వెళ్లనంటూనే.. అంతా కోరుకుంటే కశ్మీర్‌పై మధ్యవర్తిత్వానికి సిద్ధమంటూ ట్రంప్ వ్యాఖ్యానించడం గమనార్హం. కశ్మీర్‌ను భారత్, పాకిస్తాన్‌ల మధ్య నెలకొన్న అతి పెద్ద సమస్యగా ట్రంప్ అభివర్ణించారు. 'ఉద్రిక్తతలు తొలగేలా మధ్యవర్తిత్వం చేయమంటే.. అందుకు నేను సిద్ధం'అన్నారు. మోదీ, ఇమ్రాన్‌ఖాన్.. ఇద్దరితో తనకు సత్సంబంధాలున్నాయన్నారు. ప్రతీ విషయానికి రెండు వాదనలుంటాయని వ్యాఖ్యానించారు. గతంలోనూ పలు సందర్భాల్లో కశ్మీర్ విషయంలో మధ్యవర్తిత్వానికి తాను సిద్ధమంటూ ట్రంప్ వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. 'పాకిస్తాన్ ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌తో నాకు మంచి సంబంధాలున్నాయి. సీమాంతర ఉగ్రవాదాన్ని నియంత్రించేందుకు వారు ప్రయత్నిస్తున్నారు. కశ్మీర్ సమస్యపై కృషి చేస్తున్నారు'అని ట్రంప్ పేర్కొన్నారు. భారత ప్రధాని మోదీతో జరిగిన చర్చల్లో పాకిస్తాన్ అంశం ప్రస్తావనకు వచ్చిందన్నారు. పాక్ నుంచి తలెత్తుతున్న ఉగ్రవాదంపై కూడా చర్చించామన్నారు. ఈ సందర్భంగా మోదీపై మరోసారి ప్రశంసలు కురిపించారు. ప్రధాని మోదీ సరళంగా వ్యవహరించే, చాలా శక్తిమంతమైన నేత అని వ్యాఖ్యానించారు. 'మోదీ గట్టి మనిషి. తానేమనుకుంటాడో అది చేస్తారు. ఉగ్రవాదాన్ని అడ్డుకునేందుకు తగిన చర్యలు తీసుకుంటారు'అన్నారు.

### వాణిజ్యంపై..

దిగుమతుల సుంకాలు అధికంగా ఉన్న దేశాల్లో భారత్ ఒకటన్నారు. భారత్ దిగుమతి చేసుకుంటున్న హార్లీ డేవిడ్‌సన్ బైక్‌పై విధిస్తున్న భారీ సంకాల విషయాన్ని ట్రంప్ ప్రస్తావించారు. ఈ టారిఫ్‌ల విషయంలో అమెరికాతో సానుకూలంగా వ్యవహరించాల్సి ఉందన్నారు. అమెరికా నుంచి భారత్ భారీగా మిలటరీ హార్డ్‌వేర్‌ను కొనుగోలు చేస్తోందన్నారు. తాలిబన్‌తో అమెరికా శాంతి ఒప్పందాన్ని భారత్ సమర్థిస్తుందనే తాను భావిస్తున్నానన్నారు. అమెరికాలో త్వరలో జరగనున్న అధ్యక్ష ఎన్నికలను ప్రభావితం చేసేందుకు రష్యా ప్రయత్నిస్తోందా? అన్న ప్రశ్నకు.. అలాంటి సమాచారమేదీ తనకు నిఘా వర్గాల నుంచి రాలేదన్నారు.



హైదరాబాద్ హౌస్‌లో చర్చలు జరుపుతున్న ప్రధాని మోదీ, అమెరికా అధ్యక్షుడు ట్రంప్

### ఢిల్లీ అల్లర్లు అంతర్గతం

ఢిల్లీలో ప్రస్తుతం జరుగుతున్న అల్లర్లపై మోదీతో చర్చించారా? అన్న ప్రశ్నకు స్పందిస్తూ.. వ్యక్తిగత దాడుల గురించి చర్చించబోనన్నారు. అది భారత్ సొంత విషయమని స్పష్టం చేశారు. సీఏఏపై తాను ఏమీ మాట్లాడబోనని ట్రంప్ స్పష్టం చేశారు. భారత్ తన దేశ ప్రజల కోసం సరైన నిర్ణయాలే తీసుకుంటుందని భావిస్తున్నానన్నారు. భారత్‌లో ముస్లింలు వివక్షకు గురవుతున్నారని, వారిపై ద్వేషపూరిత దాడులు జరుగుతున్నాయన్న వార్తలపై స్పందించాలన్న ప్రశ్నకు.. 'మోదీతో చర్చల్లో ముస్లింల ప్రస్తావన కూడా వచ్చింది. క్రిస్టియన్ల గురించి కూడా చర్చించాం'అన్నారు. ఈ విషయమై ప్రధాని మోదీ నుంచి తనకు శక్తిమంతమైన సమాధానం లభించిందన్నారు. కాగా, మోదీ, ట్రంప్‌ల మధ్య చర్చల్లో సీఏఏ అంశం చర్చకు రాలేదని విదేశాంగ శాఖ కార్యదర్శి హర్షవర్ధన్ ష్రింగ్లా పేర్కొన్నారు. మత సామరస్యంపై ఇరువురు నేతలు సానుకూల భావాలను వ్యక్తం చేశారన్నారు.

### మత స్వేచ్ఛపై మాట్లాడా...

ప్రధాని మోదీతో చర్చల సందర్భంగా.. భారత్‌లో మత స్వేచ్ఛ విషయమై సుదీర్ఘంగా చర్చించానని ట్రంప్ తెలిపారు. 'భారత్‌లో మత స్వేచ్ఛపై చర్చించాం. భారత్‌లో ప్రజలందరికీ మత స్వేచ్ఛ ఉండాలనే మోదీ కోరుకుంటున్నారు. ముస్లింలతో కలిసి పనిచేస్తున్నామని మోదీ నాకు చెప్పారు. గతంలోనూ పౌరులకు మతస్వేచ్ఛను అందించేందుకు భారత్ కృషి చేసింది'అని ట్రంప్ వ్యాఖ్యానించారు. మోదీ అద్భుతమైన నేత అని, భారత్ గొప్ప దేశమని పేర్కొన్నారు. ఇతర దేశాలతో పోలిస్తే.. పౌరులకు మతస్వేచ్ఛ అందించేందుకు భారత్ గొప్పగా కృషి చేసిందన్నారు.

## సీఎన్‌ఎన్ X ట్రంప్

- మీ ఎన్నికకు విదేశీ సాయం అక్కర్లేదా?: విలేకరి
- నేను ఎవ్వరినీ సాయం అడగలేదు: అధ్యక్షుడు

**న్యూఢిల్లీ:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సీఎన్‌ఎన్ వార్తాసంస్థపై మరోసారి విరుచుకుపడ్డారు. 'మీ పనితీరు చూసి మీరే సిగ్గుపడాలి'అంటూ సీఎన్‌ఎన్ విలేకరి అకోస్టాపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ట్రంప్ మంగళవారం ఢిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశం ఇందుకు వేదికయింది. రాబోయే అధ్యక్ష ఎన్నికల్లో విదేశీ జోక్యాన్ని నిరాకరిస్తూ మీరు ప్రతిజ్ఞ చేస్తారా?, ఎటువంటి అనుభవం లేని వ్యక్తిని నేషనల్ ఇంటెలిజెన్స్ తాత్కాలిక డైరెక్టర్‌గా ఎలా నియమిస్తారు? అంటూ ఈ సమావేశంలో సీఎన్‌ఎన్ రిపోర్టర్ జిమ్ అకోస్టా ప్రశ్నించారు. ఇందుకు ట్రంప్.. 'ఎన్నికల్లో సాయం చేయాలని ఏ దేశాన్ని కోరలేదు. ఏ దేశం నుంచి నాకు సాయం అందలేదు కూడా'అని బదులిస్తూ.. ఇటీవల ఓ వార్తాంశంలో తప్పుడు సమాచారం ఇచ్చినందుకు సీఎన్‌ఎన్ క్షమాపణ చెప్పాలన్నారు. నిజాన్ని వెల్లడించడంలో మీతో పోలిస్తే మాకు మంచి రికార్డే ఉంది'అని అకోస్టా అనడంతో ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 'మీ రికార్డు ఏమిటో నేను చెబుతా. ఆ రికార్డు చూసి మీరే సిగ్గుపడతారు'అని పేర్కొన్నారు. ఇలా వీరి మధ్య వాగ్వాదం చోటుచేసుకున్న సందర్భాలు గతంలోనూ ఉన్నాయి. 2018లో మీడియా సమావేశంలో ట్రంప్‌తో వాదులాటకు దిగిన అకోస్టా మీడియా పాస్‌ను అధ్యక్ష భవనం రద్దు చేసింది. ఆ తర్వాత కోర్టు జోక్యంతో దానిని పునరుద్ధరించారు.


## 'ట్రంప్ ఎఫెక్ట్' నిజమే! అధ్యయనంలో వెల్లడి

**లాస్‌ఏంజెలెస్:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రసంగాల కారణంగా ప్రజల్లో జాతి విద్వేషం ఒక్కసారిగా బయటపడిందనటానికి తమకు తగిన ఆధారాలు లభ్యమయ్యాయని రాజనీతి పరిశోధకులు తెలిపారు. రివర్‌సైడ్‌లోని యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియాకు చెందిన రాజనీతి పరిశోధకులు ట్రంప్ ప్రసంగాలు అమెరికన్లపై చూపిన ప్రభావంపై ఒక అధ్యయనం చేపట్టారు. ఈ పరిశోధకుల బృందంలో ఒకరైన భారతీయ అమెరికన్ కార్తీక్ రామకృష్ణన్ మాట్లాడుతూ.. '2015 అధ్యక్ష ఎన్నికల ప్రచారంలో ట్రంప్ అనేక వ్యాఖ్యలు చేశారు. పొరుగు దేశం మెక్సికో వలసదారులు మంచివారు కాదు, వాళ్లంతా రేపిస్టులు. వాళ్లను అడ్డుకునేందుకు సరిహద్దుల్లో గోడ కడతా అని ప్రకటించారు. వివిధ సందర్భాల్లో ఆయన ప్రసంగాలు ప్రజల్లో జాతి విద్వేషాన్ని పెంచాయి. దీంతో ప్రజలు లోలోపల దాచుకున్న విద్వేషాన్ని వ్యక్తీకరించడం మొదలుపెట్టారు'అని తెలిపారు. ఈ అంశానికి పరిశోధకులు 'ట్రంప్ ఎఫెక్ట్'అనే పేరుపెట్టారు. అధ్యక్ష ప్రచారంలో భాగంగా ఆయన చేసిన ప్రసంగాల ప్రభావం ప్రజలపై బాగా పడింది. మిగతా నేతలు ట్రంప్ వ్యాఖ్యలను ఖండించినా ఫలితం లేకపోయిందన్నారు.



హైదరాబాద్ హౌస్‌లో చర్చల అనంతరం ప్రధాని మోదీ, ట్రంప్ ఆలింగనం

## అధ్యక్షుడికి రాష్ట్రపతి వెల్‌కమ్




### అధ్యక్షుడికి త్రివిధ బలగాల గౌరవ వందనం

**న్యూఢిల్లీ:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఆయన సతీమణి మెలానియా ట్రంప్ మంగళవారం రాష్ట్రపతి భవన్‌కి వచ్చారు. రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, ఆయన సతీమణి సవిత కోవింద్, ప్రధానమంత్రి నరేంద్రమోదీ వారికి ఎదురేగి స్వాగతం పలికారు. రాష్ట్రపతి భవన్ ఫోర్ కోర్టులో అధ్యక్షుడు ట్రంప్‌కి త్రివిధ దళాలు గౌరవ వందనం సమర్పించాయి. ట్రంప్ కుమార్తె ఇవాంకా ట్రంప్, అల్లుడు జేర్డ్ కుష్నర్, అమెరికా ప్రభుత్వ యంత్రాంగంలో అత్యున్నత అధికారులు కూడా వారి వెంట వచ్చారు. భారత్ తరపున రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, విదేశాంగ శాఖ మంత్రి ఎస్.జై శంకర్, కేంద్ర ఆరోగ్య మంత్రి హర్షవర్ధన్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## నమస్తే ట్రంప్ అదిరింది... మైత్రి మరింత ముందుకు

### ట్రంప్ పర్యటనపై విదేశీ మీడియా కామెంట్లు

**న్యూఢిల్లీ:** అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారత్ పర్యటనపై అంతర్జాతీయ మీడియా ఆసక్తి కనబరిచింది. సీఎన్ఎస్ ఇంటర్నేషనల్, న్యూయార్క్ టైమ్స్, ద గార్డియన్, బీబీసీ సహా పాకిస్తానీ మీడియా సంస్థలు ట్రంప్ పర్యటనను ప్రముఖంగా ప్రస్తావించాయి. అశేష జన సందోహం నడుమ అమెరికా అధ్యక్షుడికి భారత్‌లో ప్రేమపూర్వక స్వాగతం లభించిందని సీఎన్‌ఎన్ ఇంటర్నేషనల్ పేర్కొంది. భారత ప్రధాని మోదీ ఆత్మీయ ఆలింగనంతో ట్రంప్‌కు స్వాగతం పలికారని వెల్లడించింది. ట్రంప్ తన ప్రసంగంలో పలు భారతీయ పదాలను పలకడంలో తడబడ్డారని పేర్కొంది. ట్రంప్ తన ప్రసంగంలో భాగంగా పేర్కొన్న 'అమెరికా భారత్‌ను ప్రేమిస్తుంది'అనే అంశాన్ని న్యూయార్క్ టైమ్స్ ప్రధాన శీర్షికగా చేసుకుంది. అయితే, మోదీ ప్రభుత్వంపై వెల్లువెత్తే విమర్శలను ట్రంప్ ప్రస్తావించలేదని తెలిపింది. పౌరసత్వ చట్టం సహా పలు అంశాల విషయంలో గత మూడు నెలలుగా భారత్‌లో మోదీ ప్రభుత్వంపై విమర్శలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో ట్రంప్ పర్యటన కాస్త ఊరడింపుగా మారిందని ద గార్డియన్ పేర్కొంది. భారత్‌లో అమెరికా అధ్యక్షుడికి ఆత్మీయ స్వాగతం లభించిందని బీబీసీ పేర్కొంది. భారతీయ పదాలను పలకడంలో ట్రంప్ తడబడ్డారని తెలిపింది. ట్రంప్ పర్యటన విషయంలో పాకిస్తాన్ మీడియా మరోసారి తన తీరును వెళ్లగక్కింది. ట్రంప్ పర్యటన మొత్తంలో పాక్ గురించి మాట్లాడిన వ్యాఖ్యలను మాత్రమే హైలెట్ చేసింది. పాక్‌తో సత్సంబంధాలు ఉన్నాయన్న ట్రంప్ మాటలను ప్రస్తావించింది.



ట్రంప్ రాక సందర్భంగా వెలుగులీనుతున్న రాష్ట్రపతి భవన్

## ట్రంప్‌పై విరుచుకుపడ్డ బెర్నీ శాండర్స్

**వాషింగ్టన్:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై డెమొక్రాట్ పార్టీ తరఫున వచ్చే ఎన్నికల్లో అధ్యక్షుడిగా పోటీ చేస్తున్న బెర్నీ శాండర్స్ తీవ్రంగా విరుచుకుపడ్డారు. భారత్ పర్యటనలో భాగంగా జరిగిన ఆయుధ విక్రయాలను ఆయన తీవ్రంగా విమర్శించారు. ట్రంప్ ఆయుధాలు అమ్మేదాని కంటే వాతావరణ మార్పులను ఎదుర్కొనేందుకు భారత్‌తో భాగస్వామ్యం ఏర్పరచుకుని ఉంటే బాగుండునని తద్వారా ప్రపంచాన్ని రక్షించే అవకాశముండేదని శాండర్స్ వ్యాఖ్యానించారు. అధ్యక్ష అభ్యర్థిని ఖరారు చేసేందుకు అమెరికాలోని నెవడా, న్యూహ్యాంప్‌షైర్‌లలో జరిగిన ఎన్నికల్లో శాండర్స్ ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే. ఐఓవా రాష్ట్రంలో ఫలితం టైగా మిగిలిపోయిన నేపథ్యంలో శాండర్స్ ట్రంప్‌పై చేసిన విమర్శలకు ప్రాధాన్యం ఏర్పడింది. నమస్తే ట్రంప్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం ట్రంప్ భారత్‌తో సుమారు 300 కోట్ల డాలర్ల విలువైన ఆయుధ ఒప్పందాలు కుదుర్చుకున్న నేపథ్యంలో శాండర్స్ ట్విట్టర్‌లో ఈ వ్యాఖ్యలు చేశారు.

## విందుకు వేళాయె...

### రాష్ట్రపతి భవన్‌లో ట్రంప్ దంపతులకు విందు

- హాజరైన ప్రధాని మోదీ, ఉపరాష్ట్రపతి వెంకయ్య, సీజేఐ జస్టిస్ ఎస్ఏ బాబ్డే
- సీఎం కేసీఆర్ సహా నలుగురు ముఖ్యమంత్రులు
- సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్, పారిశ్రామికవేత్త అజీమ్ ప్రేమ్‌జీ

**న్యూఢిల్లీ:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దంపతులకు రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ రాష్ట్రపతి భవన్‌లో ప్రత్యేక విందు సమావేశం ఏర్పాటు చేశారు. విందుకు హాజరైన ట్రంప్ దంపతులను కోవింద్, ఆయన భార్య సవిత కోవింద్ ఆహ్వానం పలికారు. రాష్ట్రపతి భవన్‌లో దర్బార్ హాలులోకి ట్రంప్ దంపతుల్ని తీసుకువెళ్లి అంతా చూపించారు. ఆ హాలులో 5వ శతాబ్దం నాటి గౌతమ బుద్ధుడి విగ్రహం, భారతీయ నాయకులు చిత్రపటాలు ఉన్నాయి. ఆ తర్వాత ట్రంప్, కోవింద్ కాసేపు మాట్లాడుకున్నారు. భారత్, అమెరికా మధ్య సంబంధాలు బలోపేతమవుతున్నాయని, ఇందుకు పెద్ద సంఖ్యలో ప్రజలు వచ్చి ట్రంప్‌కి ఘనస్వాగతం పలకడమే నిదర్శనమని అన్నారు. అమెరికా తమకు అత్యంత విలువైన మిత్ర దేశమని, ఇరు దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని పెంపొందించడానికి భారత్ కట్టుబడి ఉందని అన్నారు. ఈ రెండు రోజులు అద్భుతంగా గడిచాయని, ఎంతో ప్రయోజనకరమైన చర్చలు జరిగాయని ట్రంప్ తెలిపారు. వాణిజ్య, రక్షణ ఒప్పందాల్లో ముందడుగులు పడ్డాయని చెప్పారు. భారత్‌కు రావడం వల్ల ఎంతో నేర్చుకున్నామని,, ఎన్నో అందమైన అనుభూతులతో తిరిగి వెళుతున్నామని ట్రంప్ చెప్పారు. రాష్ట్రపతి కోవింద్ చేసిన అతిథి మర్యాదలకు ఆయనకు, ఆయన అనుచర వర్గానికి ట్రంప్ ధన్యవాదాలు తెలిపారు. ఈ విందుకు ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, ప్రధాని మోదీ, పలువురు కేంద్రమంత్రులతోపాటు నలుగురు ముఖ్యమంత్రులు కె.చంద్రశేఖర్‌రావు(తెలంగాణ), బీఎస్ యడియూరప్ప(కర్ణాటక), మనోహర్‌లాల్ ఖట్టర్ (హరియాణా), శర్బానంద సోనోవాల్(అస్సాం)..సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎస్ఏ బాబ్డే, చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ బిపిన్ రావత్, విప్రో అధినేత అజీమ్ ప్రేమ్‌జీ, బ్యాంకర్ ఉదయ్ కొటక్, ప్రముఖ సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ హాజరయ్యారు. అమెరికా అధ్యక్షుడి రాకను పురస్కరించుకుని రాష్ట్రపతి భవన్‌ను సర్వాంగసుందరంగా తీర్చిదిద్దారు. విందు అనంతరం ట్రంప్ తిరుగు పయనమయ్యారు.



రాష్ట్రపతి భవన్‌లోకి వెళుతున్న ట్రంప్ దంపతులు



ఇవాంకా, కుష్నర్ దంపతులను రాష్ట్రపతికి పరిచయం చేస్తున్న ట్రంప్..చిత్రంలో ఉపరాష్ట్రపతి వెంకయ్య

### విందు ప్రత్యేకత ఏమంటే..

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గౌరవార్థం రాష్ట్రపతి కోవింద్ ఏర్పాటు చేసిన ప్రత్యేక విందు భలే పసందుగా ఉంది. ట్రంప్ మాంసాహార ప్రియుడు. ఎక్కడికెళ్లినా ఆయనకు బీఫ్ స్టీక్స్, మీట్ లోఫ్, బర్గర్స్ లాంటి వాటినే ఇష్టంగా లాగిస్తారు. అందుకే భారతీయ రుచులు, ట్రంప్ అభిరుచులను దృష్టిలో ఉంచుకొని రాష్ట్రపతి భవన్ వర్గాలు రెండు రకాల మెనూలు తయారు చేశాయి. **వెజిటేరియన్ వంటకాలు:** కోరియాండర్ షోర్బా, ఆలూ టిక్కీ, పాలక్ పాప్డి, జార్డెజ్ జమీన్, దాల్ రైజినా వగైరాలు, **నాన్ వెజ్ మెనూ:** రాన్ అలీషాన్, కాజూ స్పైస్డ్ సాల్మన్, **డెజర్ట్స్:** హాజల్‌నెట్ యాపిల్ పై, కారమెల్ సాస్, మల్పువా రబ్రీరోల్.. ఎపిటైటర్‌గా అమ్యూజ్ బౌచె

### లంచ్ @ హైదరాబాద్ హౌస్

**న్యూఢిల్లీ:** ట్రంప్, మోదీ మధ్య చర్చల అనంతరం హైదరాబాద్ హౌస్‌లో లంచ్ ఏర్పాటు చేశారు. మోదీ పక్కా శాకాహారి కావడంతో రెండు రకాల మెనూలు సిద్ధం చేశారు. ఈ లంచ్‌కి ఫస్ట్ లేడీ మెలానియా, ట్రంప్ కుమార్తె ఇవాంకా, అల్లుడు జేర్డ్ కుష్నర్‌లు హాజరయ్యారు. సారంగి, సంతూర్ జుగల్‌బందీ చేస్తూ హాయి గొలిపే సంగీతం, గాంధీజీకి అత్యంత ఇష్టమైన వైష్ణవ భజనలు వస్తూ ఉంటే ఈ లంచ్ కార్యక్రమం జరిగింది. భజనలు, ఘజల్స్, పాశ్చాత్య సంగీత, హిందీ సినిమా పాటల్ని ప్లే చేశారు. అణువణువున దేశభక్తి ఉప్పొంగే మిలేసుర్ మేరా తుమ్హారా పాట కూడా వినిపించారు. హిందీ ఆపాత మధురాలైన మేరే గీత్ అమర్ కర్ దో, పీయా తోసే నైనా లగే రే, సత్యం శివం, సుందరం వంటివి గీతాలు ప్లే అవుతూ ఉంటే, అత్యంత ఆహ్లాదకర వాతావరణంలో భోజనాలు చేశారు. పైనాపిల్, మస్టర్డ్ సీడ్స్‌తో తయారు చేసిన అనాస్ సన్నావ్, పనసపండుతో తయారు చేసిన పాంచ్ ఫోరాన్ కాథల్, జీరా బన్, హాక్ చెనా కబాబ్, స్ప్రౌట్స్‌తో తయారు చేసిన సూప్, రకరకాల రోటీలు, నాన్‌లు, ఖర్జూరం హల్వా, అంజీర్ ఐస్‌క్రీమ్, చోటీ స్వీట్స్ వంటివి వెజ్ మెనూలో ఉన్నాయి. ఇక నాన్‌వెజ్ వంటకాల్లో కశ్మీర్ కుంకుం పువ్వు వేసిన రిచ్ గ్రేవీతో తయారు చేసిన కోడికూర, చికెన్ పఫ్‌లు, మసాలా తక్కువగా వేసిన మటన్ కర్రీ, పింక్ సాల్మన్ స్వీట్ బాసిల్ చట్నీ వడ్డించారు.

సాక్షి బిజినెస్
బుధవారం
26-2-2020
WWW.SAKSHIBUSINESS.COM

## స్టాక్ మార్కెట్లు

**దేశీ సూచీలు**

| సెన్సెక్స్ | నిఫ్టీ |
|---|---|
| 82 ▼ | 32 ▼ |
| 40,281 | 11,798 |

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

**విదేశీ సూచీలు** (తొలిరెండు రాత్రి 11.30 ముగింపు)

| | | | |
|---|---|---|---|
| నాస్‌డాక్ | 9,146 | ▼ | 75 |
| డోజోన్స్ | 27,668 | ▼ | 291 |
| ఎఫ్‌టీఎస్ఈ 100 | 7,017 | ▼ | 138 |
| డాక్స్ | 12,790 | ▼ | 244 |
| షాంఘై | 3,013 | ▼ | 18 |
| నికాయ్ | 22,605 | ▼ | 781 |


● అమెరికా ● బ్రిటన్ ● జర్మనీ ● చైనా ● జపాన్

## ఫారెక్స్ రేట్లు రూ. లలో

| | | | ● కొనుగోలు | ● అమ్మకం |
|---|---|---|---|---|
| $ | యూఎస్ డాలర్ | ఎస్‌బీఐ | 71.09 | 72.74 |
| £ | బ్రిటన్ పౌండ్ | ఎస్‌బీఐ | 91.46 | 94.67 |
| € | యూరో | ఎస్‌బీఐ | 76.71 | 79.61 |
| ¥ | జపాన్ ఎన్ (100) | ఎస్‌బీఐ | 63.72 | 66.10 |
| AUS | ఆస్ట్రేలియా డాలర్ | ఎస్‌బీఐ | 46.60 | 48.74 |
| S$ | సింగపూర్ డాలర్ | ఎస్‌బీఐ | 50.62 | 52.37 |
| SAR | సౌదీ రియాల్ | థామస్‌కుక్ | 18.36 | 19.97 |
| UAE D | యూఏఈ దిర్హామ్ | థామస్‌కుక్ | 19.09 | 20.30 |
| ¥ | చైనా యువాన్ | థామస్‌కుక్ | 9.61 | 10.88 |

# మా దగ్గర ఇన్వెస్ట్ చేయండి..

**నియంత్రణలను మరింత సడలిస్తాం ➤ భారత కంపెనీలకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆహ్వానం ➤ సీఈవోలతో భేటీ**



సీఈఓల సమావేశంలో ట్రంప్‌తో మాట్లాడుతున్న రిలయన్స్ అధిపతి ముకేశ్ అంబానీ



**న్యూఢిల్లీ:** తమ దేశంలో మరింతగా ఇన్వెస్ట్ చేయాలంటూ భారత కంపెనీలను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆహ్వానించారు. పెట్టుబడులు పెట్టడాన్ని సులభతరం చేసే దిశగా నియంత్రణలను మరింతగా సడలిస్తామని ఆయన హామీ ఇచ్చారు. భారత పర్యటనలో భాగంగా మంగళవారం దేశీ దిగ్గజ సంస్థల సీఈవోలతో రౌండ్‌టేబుల్ సమావేశంలో ట్రంప్ పాల్గొన్నారు. రిలయన్స్ ఇండస్ట్రీస్ చైర్మన్ ముకేశ్ అంబానీ, మహీంద్రా అండ్ మహీంద్రా గ్రూప్ చైర్మన్ ఆనంద్ మహీంద్రా, టాటా సన్స్ చైర్మన్ ఎన్ చంద్రశేఖరన్, ఆదిత్య బిర్లా గ్రూప్ చైర్మన్ కుమార మంగళం బిర్లా తదితర దిగ్గజాలు దీనికి హాజరయ్యారు. తమ వ్యాపార కార్యకలాపాలు, పెట్టుబడుల గురించి ట్రంప్‌నకు వారు వివరించారు. 'మీ అందరికీ ధన్యవాదాలు. అపూర్వ విజయాలు సాధించిన మీకు అభినందనలు. మీరు అమెరికా రావాలని, బిలియన్ల కొద్దీ డాలర్లు ఇన్వెస్ట్ చేయాలని కోరుకుంటున్నాను. మేం పెట్టుబడులను నిధులపరంగా కాకుండా ఉద్యోగాల కల్పన దృష్టితో చూస్తాం' అని ట్రంప్ పేర్కొన్నారు. అమెరికాలో చట్టాలపరంగానూ, ప్రభుత్వపరంగానూ ఉన్న నియంత్రణలపరమైన సమస్యల అంశాన్ని ఈ సందర్భంగా కొందరు వ్యాపారవేత్తలు ప్రస్తావించారు. 'చాలా నియంత్రణలను ఎత్తివేయబోతున్నాం. పెను మార్పులను మీరు త్వరలోనే చూడబోతున్నారు. ఇకనుంచి పరిస్థితి మరింత మెరుగుపడుతుంది' అని ట్రంప్ సమాధానమిచ్చారు.

**ఇక్కడ మేము.. అక్కడ మీరు..**

అమెరికా, భారతీయ కంపెనీలు ఇరు దేశాల్లోనూ ఇన్వెస్ట్ చేయాల్సిన అవసరం ఉందని ట్రంప్ చెప్పారు. ఉపాధి కల్పనకు ప్రభుత్వాలు తోడ్పాటు మాత్రమే అందించగలవని, ప్రైవేట్ రంగమే వాస్తవానికి ఉద్యోగాలు కల్పించగలుగుతుందని ఆయన తెలిపారు. ఈ విషయంలో భారత ప్రధాని నరేంద్ర మోదీ, తాను కలిసి పనిచేస్తున్నామని ట్రంప్ చెప్పారు. 'మీ ద్వారా మేము ఈ దేశంలో, ఆయన మా దేశంలో ఉద్యోగాలు కల్పించగలుగుతున్నాం' అని ఆయన పేర్కొన్నారు. భారత్‌తో వాణిజ్య ఒప్పందంపై చర్చలు జరుగుతున్నాయని చెప్పిన ట్రంప్.. మిగతా వివరాలు మాత్రం వెల్లడించలేదు. సీఈవోల సమావేశంలో మోదీపై ట్రంప్ ప్రశంసలు కురిపించారు. 'మోదీ చాలా మంచి వ్యక్తి అని ఎవరో చెప్పారు. ఆయన నిజంగా మంచి వ్యక్తే. అంతే కాదు చాలా స్థిరంగానూ వ్యవహరిస్తారు. ఆయన గొప్పగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు' అని ట్రంప్ కితాబిచ్చారు.

**మళ్లీ నేనే..**

అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో మరోసారి తానే గెలుపొందుతానంటూ ట్రంప్ ధీమా వ్యక్తం చేశారు. దీంతో మార్కెట్లు భారీగా లాభపడతాయన్నారు. ఆర్థిక వ్యవస్థ, సైన్యం, వైద్యం తదితర రంగాలకు తమ ప్రభుత్వం ఎంతో తోడ్పాటు అందించిందని ట్రంప్ చెప్పారు. తన సారథ్యంలో అమెరికా ఎకానమీ.. గతంలో ఎన్నడూ లేనంత స్థాయిలో వృద్ధి చెందిందని అన్నారు.

### వాణిజ్య ఒప్పందానికి చేరువలో: గోయెల్

భారత్ అమెరికాలు కీలక వాణిజ్య ఒప్పందానికి అతి చేరువలో ఉన్నట్లు మంగళవారం వాణిజ్య పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయెల్ వెల్లడించారు. ఇందుకు సంబంధించి విధివిధానాలు ఖరారవుతున్నట్లు తెలిపారు. 'యూఎస్–ఇండియా ఫోరమ్: పార్ట్‌నర్స్ ఫర్ గ్రోత్' అన్న అంశంపై ఇక్కడ జరిగిన చర్చలో గోయెల్ మాట్లాడారు. పరస్పర భారీ వాణిజ్య ప్రయోజనాలు ఈ ఒప్పందం వల్ల ఒనగూరుతాయని అన్నారు. 2020 నాటికి కేంద్రం లక్ష్యాలను ఆయన ఈ సందర్భంగా వివరిస్తూ, ప్రతి కుటుంబానికీ సొంత ఇల్లు, 24 గంటలూ విద్యుత్, వంట గ్యాస్, ఇంటర్‌నెట్ విస్తృతి, నాణ్యమైన విద్య, ఆరోగ్య సంరక్షణ తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని వివరించారు. 5 ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థగా భారత్‌ను తీర్చిదిద్దేందుకు అన్ని చర్యలూ తీసుకుంటున్నట్లు వివరించారు.

## అమెరికా నుంచి చమురు దిగుమతులు పదింతలు

**నిత్యం 2,50,000 బ్యారెళ్ల చమురు దిగుమతి**

**న్యూఢిల్లీ:** భారత్‌కు అమెరికా నుంచి చమురు సరఫరాలు రెండేళ్లలో పది రెట్లు పెరిగి.. రోజుకు 2,50,000 బ్యారెళ్ల స్థాయికి చేరాయి. రెండు దేశాల మధ్య ఇంధన బంధం బలోపేతాన్ని ఇది తెలియజేస్తోంది. ఢిల్లీలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సమక్షంలో జరిగిన వ్యాపార భేటీలో అమెరికా ఇంధన శాఖ మంత్రి డాన్ బ్రోలెట్ మాట్లాడుతూ.. భారత్ 2017లో అమెరికా నుంచి నిత్యం 25,000 బ్యారెళ్లను దిగుమతి చేసుకుంది. గత రెండేళ్లలో ఇది 25,000 బ్యారెళ్ల నుంచి నిత్యం 2,50,000 బ్యారెళ్ల దిగుమతి స్థాయికి చేరుకుంది. ఇది ఇంకా మెరుగుపడుతుందని అంచనా వేస్తున్నాం'' అని బ్రోలెట్ చెప్పారు. ఇరు దేశాల మధ్య ఇంధన వ్యాపారం వేగంగా వృద్ధి చెందుతోందంటూ ఈ సందర్భంగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ డాన్ బ్రోలెట్‌ను అభినందించారు.

2019–20 ఆర్థిక సంవత్సరంలో మొదటి ఆరు నెలల కాలంలో అమెరికా 5.4 మిలియన్ టన్నుల చమురును భారత్‌కు ఎగుమతి చేసింది. భారత్‌కు అమెరికా ఆరో అతి పెద్ద చమురు వనరుగా అవతరించినట్టు పెట్రోలియం మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఢిల్లీలో జరిగిన భారత్–అమెరికా వ్యాపార కార్యక్రమంలో భాగంగా తెలిపారు. అలాగే, అమెరికాకు భారత్ ఇప్పుడు 4వ అతిపెద్ద చమురు ఎగుమతి మార్కెట్‌గా మారినట్టు ఆయన వివరించారు.

## ఫోర్డ్ ఎండీవర్ 2020 ఎడిషన్



- ధర రూ. 29.55 లక్షల నుంచి...
- ఏప్రిల్ వరకూ ఈ ధర
- ఆ తర్వాత రూ.70,000 అదనం

**న్యూఢిల్లీ:** ఫోర్డ్ ఇండియా కంపెనీ ప్రీమియమ్ ఎస్‌యూవీ మోడల్, ఎండీవర్‌లో 2020 ఎడిషన్‌ను మార్కెట్లోకి తెచ్చింది. ఈ ఎండీవర్ ఎస్‌యూవీ 2020 ఎడిషన్ పరిచయ ధరలు రూ.29.55 లక్షలు (ఎక్స్ షోరూమ్, ఢిల్లీ) నుంచి ఆరంభమవుతాయని ఫోర్డ్ ఇండియా ప్రెసిడెంట్, ఎమ్‌డీ అనురాగ్ మెహరోత్రా చెప్పారు. ఈ ధరలు ఈ ఏడాది ఏప్రిల్ 30 వరకే అని, ఆ తర్వాత నుంచి రూ.70,000 అధికంగా ఉంటాయని వివరించారు. బీఎస్–సిక్స్ ప్రమాణాలకు అనుగుణంగా 2.0 లీటర్ ఈకోబ్లూ ఇంజిన్‌తో ఈ ఎస్‌యూవీని రూపొందించామని, 10 గేర్ల ఆటోమేటిక్ ట్రాన్స్‌మిషన్ ప్రత్యేక ఆకర్షణ అని వివరించారు.

**14 శాతం అధిక మైలేజీ....**

ఎస్‌యూవీ సెగ్మెంట్లో ఇంధన సామర్థ్యం అధికంగా ఉన్న ఎస్‌యూవీ ఎండీవరే అని అనురాగ్ పేర్కొన్నారు. ఈ 2020 ఎడిషన్ 14 శాతం అధిక మైలేజీని ఇస్తుందని తెలిపారు. ఈ మోడల్‌లో 4 X2 డ్రైవ్‌లైన్ వేరియంట్ 13.9 కి.మీ. 4 X4 డ్రైవ్‌లైన్ వేరియంట్ 12.4 కి.మీ. మైలేజీని ఇస్తాయని పేర్కొన్నారు. ఎస్‌యూవీలను కొనుగోలు చేయాలనుకునే కొత్త వినియోగదారులు ఎండీవర్‌నే ఎంచుకుంటారన్న ధీమాను ఆయన వ్యక్తం చేశారు.

## హోండా బీఎస్-6 డియో స్కూటర్

**ధరలు రూ.64,584 నుంచి ఆరంభం**



**బెంగళూరు:** హోండా మోటార్‌సైకిల్ అండ్ స్కూటర్ ఇండియా కంపెనీ డియో మోడల్‌లో బీఎస్–6 వేరియంట్‌ను బెంగళూరు మార్కెట్లోకి ప్రవేశపెట్టింది. ఈ స్కూటర్ ధరలు రూ.64,584(ఎక్స్ షోరూమ్, బెంగళూరు) నుంచి ఆరంభమవుతాయని కంపెనీ తెలిపింది. ఈ స్కూటర్ రెండు వేరియంట్లు– స్టాండర్డ్, డీలక్స్‌ల్లో లభ్యమవుతుందని వెల్లడించింది. మార్కెట్లోకి విడుదల చేసిన రోజే 301 స్కూటర్లను డెలివరీ చేశామని పేర్కొంది. దక్షిణాదిలో తమదే నంబర్ వన్ టూ వీలర్ బ్రాండని, ఈ ప్రాంతంతో తమ మార్కెట్ వాటా 34 శాతమని వివరించింది.

## ఎస్‌బీఐ కార్డ్స్ ఐపీఓ ప్రైస్‌బాండ్ రూ.750-755

మార్చి 2–5 వరకూ ఇష్యూ; 16న లిస్టింగ్!




**ముంబై:** ఎస్‌బీఐ కార్డ్స్ అండ్ పేమెంట్ సర్వీసెస్ కంపెనీ ఐపీఓ (ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్) ప్రైస్‌బాండ్‌ను నిర్ణయించింది. వచ్చే నెల 2 నుంచి మొదలై 5 వ తేదీన ముగిసే ఈ ఐపీఓకు ప్రైస్‌బాండ్‌గా రూ.750–755ను నిర్ణయించామని ఎస్‌బీఐ కార్డ్స్ అండ్ పేమెంట్ సర్వీసెస్ తెలిపింది. ఐపీఓలో భాగంగా రూ. 500 కోట్ల విలువైన తాజా ఈక్విటీ షేర్లను జారీ చేస్తారు. ఆఫర్ ఫర్ సేల్(ఓఎఫ్ఎస్)లో భాగంగా 13 కోట్ల ఈక్విటీ షేర్లను విక్రయిస్తారు. మొత్తం మీద ఇష్యూ సైజు రూ.9,000 కోట్ల మేర ఉంటుందని అంచనా. కనీసం 19 షేర్లకు (మార్కెట్ లాట్)దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. మార్చి 16న ఈ కంపెనీ షేర్ స్టాక్ మార్కెట్లో లిస్టవుతుంది. ప్రస్తుతం గ్రే మార్కెట్ ప్రీమియమ్(జీఎమ్‌పీ) రూ.325/330 రేంజ్‌లో ఉందని సమాచారం. ఫిబ్రవరి 18 వ తేదీ వరకూ ఎస్‌బీఐ షేర్లను హోల్డ్ చేసిన ఇన్వెస్టర్లు–రిటైల్ కేటగిరీలోనూ, షేర్ హోల్డర్ల కేటగిరీలోనూ దరఖాస్తు చేసుకోవచ్చు. ఎస్‌బీఐ ఉద్యోగులకు ఇష్యూ ధరలో రూ.75 డిస్కౌంట్ లభిస్తుంది. క్యూ3లో స్థూల మొండి బకాయిలు 2.47%గా ఉన్నాయని ఎస్‌బీఐ కార్డ్స్ సీఈఓ హర్‌దయాళ్ ప్రసాద్ తెలిపారు.

## కొందరికే పరిమితం కాకూడదు!

- టెక్నాలజీ సొల్యూషన్లు అందరికీ అందాలి
- డెవలపర్లకు బాధ్యత, నైతికత తప్పనిసరి
- మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్ల సూచనలు




బెంగళూరు: టెక్నాలజీ ఆధారిత పరిష్కార మార్గాలను అభివృద్ధి చేసే డెవలపర్లు మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఐటీ దిగ్గజం మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్ల సూచించారు. సొల్యూషన్స్ రూపొందించేటప్పుడు నైతికత, విశ్వసనీయతపై ప్రధానంగా దృష్టి పెట్టాలన్నారు. టెక్నాలజీ ప్రయోజనాలు అందరికీ లభించేలా చూడాలని పేర్కొన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సొల్యూషన్స్ రూపకల్పనలో ఎలాంటి పక్షపాత ధోరణులు చొరబడకుండా .. వివిధ వర్గాల వారు ఉన్న టీమ్‌లతో డెవలపర్లు కలిసి పనిచేయాలని నాదెళ్ల చెప్పారు. 'ప్రస్తుతం అంతటా టెక్నాలజీమయం అయిపోయింది. కాబట్టి బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. డెవలపర్లు రూపొందించే సొల్యూషన్స్ ఫలాలు.. సమాజంలో కేవలం ఒక వర్గానికి మాత్రమే పరిమితమవుతాయా? లేదా రిటైల్, వైద్యం, వ్యవసాయం .. ఇలా చాలా వర్గాలకు అందుతాయా? అన్నది బేరీజు వేసుకోవాలి' అని సత్య నాదెళ్ల పేర్కొన్నారు. ఫ్యూచర్ డీకోడెడ్ సదస్సులో పాల్గొన్న సందర్భంగా ఆయన ఈ విషయాలు చెప్పారు. కస్టమర్లు, డెవలపర్లు, భాగస్వాములు మొదలైన వారు ఈ సదస్సులో పాల్గొన్నారు.

డెవలపర్లు సృష్టించే సొల్యూషన్స్‌ను ముందుగా వారే ప్రయోగాత్మకంగా పరీక్షిస్తారు కాబట్టి.. సదరు టెక్నాలజీ రూపకల్పనలో విశ్వసనీయతకు పెద్ద పీట వేయాలని సత్య చెప్పారు. కస్టమర్ల డేటా కీలకంగా ఉండే బ్యాంకుల్లాంటివి.. తాము రూపొందించే యాప్‌లపై సంబంధిత వర్గాలకు నమ్మకం కలిగించేలా జాగ్రత్తలు తీసుకోవాలని నాదెళ్ల చెప్పారు. తమ విషయానికొస్తే.. ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాల్లోని డేటా రెసిడెన్సీ చట్టాలకు అనుగుణంగానే ఆయా దేశాల్లో కార్యకలాపాలు సాగిస్తున్నామని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. 'మాకు 57 డేటా సెంటర్ రీజియన్లు ఉన్నాయి. భారత్‌లో మూడు ప్రాంతాల్లో (పుణె, చెన్నై, ముంబై) ఇవి ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా మిగతా ప్రాంతాలకూ విస్తరిస్తున్నాం. ఆయా దేశాల్లోని డేటా చట్టాలను తు.చ. తప్పకుండా పాటించడం వల్లే ఇది సాధ్యపడుతోంది' అని నాదెళ్ల చెప్పారు.

## స్వీట్స్ 'గడువు తేదీ' ప్రదర్శించాల్సిందే



**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** ఇప్పటి వరకు ప్యాక్ చేసిన స్వీట్స్‌కు మాత్రమే గడువు తేదీతోపాటు తయారీ తేదీని ఉత్పత్తిదార్లు ముద్రిస్తున్నారు. ఇక నుంచి సాధారణ స్వీట్ షాపుల్లో కూడా విడిగా విక్రయించే తీపి పదార్థాల ముందు ఈ తేదీలను ప్రదర్శించాల్సిందే. 2020 జూన్ 1 నుంచి ఈ నిబంధనను అమలులోకి తీసుకొస్తున్నట్టు ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ) స్పష్టం చేసింది. గడువు ముగిసిన తీపి పదార్థాలను దుకాణదార్లు విక్రయిస్తున్నారన్న ఫిర్యాదుల నేపథ్యంలో ఎఫ్ఎస్ఎస్ఏఐ ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. నిబంధన అమలు చేయాల్సిందిగా ఫుడ్ సేఫ్టీ కమిషనర్లకు ఎఫ్ఎస్ఎస్ఏఐ ఆదేశించింది.

## హైదరాబాద్‌లో సీఐఐ స్టార్టప్స్ ఇన్నోవేషన్ సెంటర్

**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) హైదరాబాద్‌లో ఔత్సాహికపారిశ్రామిక వేత్తలు, స్టార్టప్స్ కోసం ఇన్నోవేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేసింది. తెలంగాణలో స్టార్టప్స్ వ్యవస్థ అభివృద్ధి కోసం ఈ కేంద్రం పని చేస్తుందని, ఏప్రిల్ నుంచి ఈ సెంటర్ కార్యకలాపాలు ప్రారంభమవుతాయని సీఐఐ మంగళవారం తెలియజేసింది. సీఐఐ ఇన్నోవేషన్ సెంటర్‌ను తెలంగాణ ప్రభుత్వం, ఇన్ఫోసిస్ కో–ఫౌండర్, సీఐఐ నేషనల్ స్టార్టప్ కౌన్సిల్ చైర్మన్ ఎస్ గోపాలకృష్ణన్‌కు చెందిన ప్రతీక్ష చారిటబుల్ ట్రస్ట్‌లు సపోర్ట్ చేస్తున్నాయి. వినూత్న ఆలోచనలు, స్టార్టప్స్‌కు మెంటారింగ్, అవకాశాలు, వ్యాపార భాగస్వామ్యాలు, సాంకేతిక ప్రోత్సాహం అందించడమే ఈ సెంటర్ ప్రధాన లక్ష్యమని సీఐఐ తెలియజేసింది.



## టెలికం మంత్రితో టాటా సన్స్ చంద్రశేఖరన్ భేటీ



**న్యూఢిల్లీ:** టెలికం శాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్‌తో టాటా సన్స్ చైర్మన్ చంద్రశేఖరన్ మంగళవారం ఢిల్లీలో భేటీ అయ్యారు. టెలికం శాఖ మదింపు ప్రకారం గతంలో టాటా గ్రూపు అందించిన టెలికం సేవలపై బకాయిలు రూ.14,000 కోట్లను చెల్లించాల్సి ఉండగా, టాటా గ్రూపు రూ.2,197 కోట్ల వరకు చెల్లింపులు చేసింది. వాస్తవ బకాయిలు ఈ మేరకేనని స్పష్టం చేసింది. దీంతో టాటా మదింపును ప్రశ్నిస్తూ.. పూర్తి బకాయిల చెల్లింపును కోరుతూ టెలికం శాఖ మరో నోటీసును జారీ చేయనున్నట్టు ఓ అధికారి తెలిపారు. ఈ నేపథ్యంలో టెలికం మంత్రితో చంద్రశేఖరన్ భేటీ కావడం ప్రాధాన్యం నెలకొంది. 30 నిమిషాల పాటు ఈ భేటీ జరిగింది. అనంతరం మీడియా ప్రతినిధుల ప్రశ్నలకు చంద్రశేఖరన్ స్పందించకుండానే వెళ్లిపోయారు.

# ఎయిరిండియాపై అదానీ కన్ను!

- బిడ్డింగ్ పత్రాల పరిశీలన తర్వాత తుది నిర్ణయం
- ఇప్పటికే రేసులో టాటా గ్రూప్, ఇండిగో, హిందూజా కుటుంబం




**న్యూఢిల్లీ:** ప్రభుత్వ రంగ విమానయాన సంస్థ ఎయిరిండియా కొనుగోలు రేసులో తాజాగా అదానీ గ్రూప్ కూడా చేరనున్నట్లు తెలుస్తోంది. బిడ్డింగ్ పత్రాలను అధ్యయనం చేసిన తర్వాత దీనిపై నిర్ణయం తీసుకోవాలని సంస్థ యోచిస్తున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం ఎయిరిండియాపై అదానీ గ్రూప్ ఆసక్తి ప్రాథమిక స్థాయిలోనే ఉందని, దాని అప్పులు.. నష్టాలపై పూర్తి స్థాయి మదింపు ఆధారంగా బిడ్ వేసేదీ లేనిదీ ఉంటుందని వివరించాయి. ఒకవేళ బిడ్ చేసిన పక్షంలో టాటా గ్రూప్, హిందుజా కుటుంబం, విమానయాన సంస్థ ఇండిగో, అమెరికాకు చెందిన ఇంటరప్స్ ఫండ్‌తో అదానీ గ్రూప్ పోటీపడాల్సి ఉంటుంది. తమ విమానాశ్రయాల నిర్వహణ కార్యకలాపాలకు కొనసాగింపుగా ఎయిరిండియా విమానయాన సంస్థ ఉండగలదని అదానీ గ్రూప్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. బిడ్డింగ్ నిబంధనల ప్రకారం అదానీకి ఎటువంటి అడ్డంకులు లేకపోయినప్పటికీ.. ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ(ఏఏఐ) నిబంధనలు అడ్డంకిగా మారొచ్చని అంచనాలు ఉన్నాయి. ఏఏఐ నిబంధనల ప్రకారం .. విమానయాన సంస్థ లేదా ఎయిర్‌లైన్ ఉన్న గ్రూప్‌లకు.. విమానాశ్రయాల్లో 27 శాతానికి మించి వాటాలు ఉండకూడదు. ఇప్పటికే ఆరు విమానాశ్రయాలు నిర్వహిస్తున్న అదానీ గ్రూప్‌నకు ఇది ప్రతిబంధకంగా ఉండవచ్చని అంచనా.

**బిడ్డింగ్ గడువు పొడిగింపు?**

ఎయిరిండియా బిడ్డింగ్‌కు నిర్దేశించిన మార్చి 17 గడువును కేంద్రం మరింత పొడిగించే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. కొత్త డెడ్‌లైన్‌పై ఈ వారంలో జరిగే అంతర్‌మంత్రిత్వ శాఖల బృందం సమావేశంలో నిర్ణయం తీసుకోవచ్చని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఆసక్తి గల బిడ్డర్లు రూ. 1 కోటి నాన్–రిఫండబుల్ ఫీజు కడితే వర్చువల్ డేటా రూమ్ నుంచి ఎయిరిండియా వివరాలు, షేర్ల కొనుగోలు ఒప్పందం ముసాయిదా (ఎస్‌పీఏ) చూడవచ్చని పేర్కొన్నాయి. సందేహాలేమైనా ఉన్న పక్షంలో లావాదేవీ సలహాదారు, కేంద్ర పౌర విమానయాన శాఖ నివృత్తి చేస్తాయని వివరించాయి. సందేహాల నివృత్తి కోసం నిర్దేశించిన ఫిబ్రవరి 11 గడువును కేంద్రం ఇప్పటికే మార్చి 6 దాకా పొడిగించింది. సుమారు రూ. 60,074 కోట్ల రుణభారం ఉన్న ఎయిరిండియాలో పూర్తి వాటాలను విక్రయించేందుకు ప్రభుత్వం మరో దఫా కసరత్తు చేస్తోంది. ఇందులో భాగంగా కొంత రుణాన్ని స్పెషల్ పర్పస్ వెహికల్ (ఎస్‌పీవీ) ఎయిరిండియా అసెట్స్ హోల్డింగ్‌కు బదలాయించనుంది. బిడ్డింగ్‌లో గెలుపొందే సంస్థ సుమారు రూ. 23,286 కోట్ల రుణాల బాధ్యత కూడా తీసుకోవాల్సి ఉంటుంది.

**సాక్షి బిజినెస్ వెబ్‌సైట్‌లో...**

- కరోనాతో షేర్లు అమ్ముకోనక్కర్లేదు: వారెన్ బఫెట్
- 25 షేర్లు బుల్లిష్‌గా మారాయ్!
- ఈ షేర్లు హోల్డ్ చేయొచ్చు!
- దీర్ఘకాలంలో మార్కెట్‌పై కోవిడ్-19 ప్రభావం ఉండదు

మరిన్ని ఆసక్తికర కథనాలు, స్టాక్- మార్కెట్ అప్‌డేట్స్, విశ్లేషణలు, అప్‌డేట్స్ కోసం... SAKSHIBUSINESS వెబ్‌సైట్ కోసం.. ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

WWW.BUSINESS.SAKSHI.COM

## ఆరుగురు సుప్రీం జడ్జీలకు హెచ్1ఎన్1

**న్యూఢిల్లీ:** సుప్రీంకోర్టు న్యాయమూర్తులు ఆరుగురికి హెచ్1ఎన్1 వైరస్ (స్వైన్‌ఫ్లూ) సోకినట్లు స్పష్టమైన నేపథ్యంలో సీజేఐ జస్టిస్ ఎస్.ఎ.బాబ్డే మంగళవారం అత్యవసర సమావేశం నిర్వహించారు. న్యాయమూర్తులతో పాటు సుప్రీంకోర్టు సిబ్బంది మొత్తం వ్యాధి నుంచి రక్షణ పొందేందుకు టీకాలు వేయించుకోవాలని సూచించారు. జస్టిస్ డి.వై.చంద్రచూడ్ తన కోర్టు రూమ్‌లో న్యాయవాదులతో మాట్లాడుతూ ప్రధాన న్యాయమూర్తితో జరిగిన సమావేశం వివరాలను తెలపడంతో ఈ విషయం అందరి దృష్టికి వచ్చింది. న్యాయవాదులకు హెచ్1ఎన్1 నివారణ టీకా అందుబాటులో ఉందని జస్టిస్ చంద్రచూడ్ తెలిపారు.

## ఈజిప్టు మాజీ అధ్యక్షుడు ముబారక్ కన్నుమూత



**కైరో:** ఈజిప్టు మాజీ అధ్యక్షుడు, సుమారు 30 ఏళ్లపాటు మధ్యప్రాచ్యంలో శాంతి, సుస్థిరతలకు ప్రతీకగా చెప్పుకునే నేత హోస్నీ ముబారక్ (91) మంగళవారం మరణించారు. ఆయన ఆరోగ్య సమస్యల కారణంగా మరణించినట్లు ఈజిప్టు టెలివిజన్ ప్రకటించింది. అధ్యక్షుడిగా ఉన్నంత కాలం అమెరికాకు సన్నిహితుడిగా మెలిగారు. అయితే 2011లో ఈజిప్టు యువత సుమారు 18 రోజుల పాటు కైరోలోని సెంట్రల్ తహ్రీర్ స్క్వేర్‌లో జరిపిన ఆందోళనల కారణంగా మిలటరీ వర్గాలు హోస్నీ ముబారక్‌తో బలవంతంగా రాజీనామా చేయించాయి. ఈజిప్ట్ చరిత్రలోనే మొదటిసారి ఒక అధ్యక్షుడిని పదవీచ్యుతుడిని చేయడమే కాకుండా జైల్లో పెట్టడం ముబారక్ విషయంలోనే జరిగింది. అరబ్ స్ప్రింగ్ ఆందోళన సమయంలో 900 మంది ఆందోళనకారుల మరణాలను నిలువరించడంలో విఫలమయ్యారన్న ఆరోపణలపై న్యాయస్థానాలు 2012 జూన్‌లో ముబారక్‌ను దోషిగా నిర్ధారించి యావజ్జీవ జైలుశిక్ష విధించాయి. అయితే ఈజిప్టు ఉన్నత న్యాయస్థానం 2014లో వీరిద్దరినీ నిర్దోషులుగా విడుదల చేసింది.

## ఢిల్లీ అల్లర్లను ప్రస్తావించిన అమెరికా మీడియా

**న్యూఢిల్లీ:** భారత్‌లో ట్రంప్ పర్యటన కొనసాగుతుండగానే ఢిల్లీలో చెలరేగిన పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ) అల్లర్లపై అమెరికాలోని మీడియా సంస్థలు పలు వార్తలు రాశాయి. 'ముస్లింల పట్ల వివక్ష చూపుతున్న కొత్త సీఏఏ చట్టంపై మాట్లాడబోనంటూ ట్రంప్ చెప్పారు..' అంటూ ఓ వార్తా పత్రిక రాసింది. 'హిందువులు అధికంగా ఉన్న భారత్‌లో ముస్లింల పెత్తనాన్ని కాదంటూ మోదీ తీసుకొచ్చిన చట్టానికి ట్రంప్ మద్దతు తెలుపుతున్నట్లు కనిపిస్తున్నారు..' అంటూ మరో వార్తాపత్రిక రాసింది. ట్రంప్‌కు వ్యతిరేకంగా ఉండే మరో వార్తాపత్రిక రాస్తూ.. 'మోదీ ప్రభుత్వంలో ప్రజల మధ్య అంతర్గతంగా చీలికలు వస్తున్నాయి. ఇవి మత ప్రాతిపదిక ఉన్నవి' అంటూ రాసింది. అంతేగాక.. 2002లో జరిగిన గుజరాత్ అల్లర్లలో భాగంగా ప్రస్తుత ప్రధాని, అప్పటి గుజరాత్ ముఖ్యమంత్రి నరేంద్ర మోదీపై అమెరికా నిషేధం విధించిన విషయం గురించి కూడా ప్రస్తావించింది.

## టీవీ చానెల్స్‌కు సమాచార శాఖ సూచనలు

**న్యూఢిల్లీ:** ప్రైవేట్ టీవీ చానెల్స్‌కు సమాచార మంత్రిత్వ శాఖ కీలక సూచనలు చేసింది. ఈ మేరకు మంగళవారం రాత్రి ఓ ప్రకటనను విడుదల చేసింది. కేబుల్ టెలివిజన్ నెట్‌వర్క్స్ యాక్ట్ కింద ప్రైవేట్ శాటిలైట్ టీవీ చానెల్స్‌కు ఈ మేరకు పలు మార్గదర్శకాలు జారీ చేసింది. దాని ప్రకారం.. దేశ వ్యతిరేక కార్యకలాపాలను ప్రోత్సహించేలా ప్రోగ్రామ్స్ ఉండకూడదు. అందుకు సంబంధించి ఎలాంటి వీడియోలను ప్రసారం చేయకూడదు. ఏదైనా మతాన్ని కానీ, కులాన్నీ కానీ కించ పర్చేలా ఉన్న వీడియోలు గానీ, వ్యాఖ్యలను గానీ చర్చల్లో చూపకూడదు. వ్యక్తుల ప్రాథమిక హక్కులకు భంగం వాటిల్లేలా కార్యక్రమాలు ఉండకూడదని పేర్కొంది.

## ట్రంప్ పర్యటిస్తున్న వేళ...

# సీఏఏపై భగ్గుమన్న ఢిల్లీ

**ఈశాన్య ఢిల్లీలో రెచ్చిపోయిన ఆందోళనకారులు**

- ఘర్షణల్లో 13 మంది మృతి
- 200 మందికి గాయాలు; పలు ప్రాంతాల్లో ఆస్తుల ధ్వంసం
- 144వ సెక్షన్ ఉన్నా... వీధుల్లో ముష్కరుల స్వైరవిహారం



అల్లర్లు జరిగిన ప్రాంతంలో భద్రతా బలగాలు



పోలీసుల కాల్పుల్లో గాయపడిన వ్యక్తి

**న్యూఢిల్లీ:** దేశ రాజధాని ఢిల్లీలో ఒకవైపు అగ్రరాజ్యాధిపతి ట్రంప్ పర్యటిస్తుండగానే... అక్కడకు కాస్తంత దూరంలో హింస పెచ్చరిల్లింది. పౌరసత్వ సవరణ చట్టానికి (సీఏఏ) మద్దతిస్తున్న వారు... వ్యతిరేకిస్తున్న వారు... రెండు వర్గాలూ పెట్రేగిపోయాయి. దీంతో 2 రోజుల్లో ఏకంగా 13 మంది బలైపోయారు. ఢిల్లీలోని పలు ప్రాంతాల్లో సోమవారం మొదలైన ఘర్షణలు... మంగళవారం మరింత తీవ్ర రూపం దాల్చాయి. ఆందోళనకారులు అవతలివర్గం తాలూకు దుకాణాల్ని, వ్యాపార సముదాయాల్ని తగలబెట్టేయడంతో మంగళవారం స్థానిక వీధుల్లో ఎటుచూసినా పొగ కమ్మేసింది. అల్లరి మూకలు మారణాయుధాలతో వీధుల్లో స్వేచ్ఛగా స్వైరవిహారం చేశాయి. ఈ ఘర్షణల్లో సోమవారం 5 మంది, మంగళవారం మరో 8 మంది బలైపోయారు. మరో 200 మంది వరకూ గాయపడగా... వారిలో 48 మంది పోలీసులే!. కనిపిస్తే కాల్చివేయాలంటూ పోలీసులు లౌడ్‌స్పీకర్ల ద్వారా చెప్పారని మౌజ్‌పూర్ స్థానికులు చెప్పగా, అలాంటి ప్రకటన చేయలేదని డీసీపీ వేద్‌ప్రకాశ్ చెప్పారు.

**మరిన్ని ప్రాంతాలకు చిచ్చు...**

ఈ అల్లర్లు మంగళవారం కొత్త ప్రాంతాలకు పాకాయి. ఆందోళనకారులు స్వేచ్ఛగా లూటీలు, దహనాలకు తెగబడటంతో చాంద్‌బాగ్, భజన్‌పురా ప్రాంతాలు దారుణంగా దెబ్బతిన్నాయి. గోకుల్‌పురిలోఅల్లరిమూకలు రెండు అగ్నిమాపక వాహనాల్ని ధ్వంసం చేశారు. దుండగులు కనిపించిన దేన్నీ వదిలిపెట్టకుండా.. పెట్రోల్ పోసి నిప్పుపెడుతూ రెచ్చిపోయారు. ఫలితం ధ్వంసమైన వాహనాల భాగాలు, కాలిపోయిన టైర్లు, రాళ్ల ఇటుకలతో అక్కడి రోడ్లన్నీ నిండిపోయాయి. రాళ్లు, రాడ్లు, ఆఖరికి కత్తులు కూడా పట్టుకుని ఆందోళనకారులు రెచ్చిపోవటంతో.. వారిని చెదరగొట్టడానికి భాష్పవాయువు ప్రయోగించారు. కొన్నిచోట్ల అల్లరిమూకలు సైతం హెల్మెట్లు ధరించడం గమనార్హం. మౌజ్‌పూర్, చాంద్‌బాగ్, కరవల్‌నగర్, జఫరాబాద్‌లలో కర్ఫ్యూ విధించారు.

**సగం మందికి బుల్లెట్ గాయాలే...**

మంగళవారం ఆసుపత్రికి తీసుకువచ్చిన వారిలో 8 మంది మరణించారని, మరో 35 మంది చికిత్స పొందుతున్నారని అధికారులు చెప్పారు. గాయపడ్డ వారిలో సగం మంది బుల్లెట్ గాయాలు తగిలిన వారే. ఒకవైపు హింస కొనసాగుతుండగానే... మరో వైపు పోలీసులు ఫ్లాగ్ మార్చ్‌లు నిర్వహించారు.

**గవర్నరు, సీఎంలతో అమిత్‌షా భేటీ**

ఢిల్లీలో అల్లర్లపై హోం మంత్రి అమిత్ షా మంగళవారం ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నరు అనిల్ బైజాల్‌తో పాటు ముఖ్యమంత్రి కేజ్రీవాల్, ఢిల్లీ పోలీస్ చీఫ్ అమూల్య పట్నాయక్‌లు దీనికి హాజరయ్యారు. అన్ని రాజకీయ పార్టీల కార్యకర్తలూ ఈ విషయంలో కలిసికట్టుగా వ్యవహరించాలని, అన్ని కాలనీల్లో తక్షణం శాంతి కమిటీలను పునరుద్ధరించాలని ఈ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. గడిచిన దశాబ్దకాలంలో ఢిల్లీలో ఎన్నడూ ఇంతటి హింస చెలరేగలేదు. జేకే 24/7 న్యూస్ విలేకరికి, ఎన్‌డీటీవీ విలేకరులకు కూడా కొందరికి గాయాలయ్యాయి. చాలాచోట్ల 144వ సెక్షన్ విధించినా దాన్ని పాటించేవారే కరువయ్యారు. కాగా అల్లర్లను అదుపు చేయడానికి తమ వద్ద తగినన్ని బలగాలు లేవని, ఉంటే వెంటనే అదుపు చేసి ఉండేవారమని కమిషనర్ అమూల్య పట్నాయక్ హోంశాఖకు చెప్పినట్లుగా వార్తలు వెలువడ్డాయి. ఇది జరిగిన కొన్ని నిమిషాల్లోనే ఢిల్లీ పోలీస్ పీఆర్‌ఓ అధికారికంగా స్పందిస్తూ... అదంతా వాస్తవం కాదని, తమవద్ద తగినన్ని బలగాలున్నాయంటూ ప్రకటన విడుదల చేశారు.

**హైకోర్టు, సుప్రీం విచారణ నేడు**

ఈశాన్య ఢిల్లీలో 3 రోజులుగా చెలరేగుతున్న అల్లర్లలో హింసకు పాల్పడ్డ వారిని అరెస్ట్ చేయాలంటూ ఢిల్లీ హైకోర్టు, సుప్రీంకోర్టుల్లో మంగళవారం వేర్వేరు పిటిషన్లు దాఖలయ్యాయి. వీటిపై బుధవారం విచారిస్తామని ఆయా కోర్టులు కక్షిదారులకు తెలిపాయి. పిటిషన్‌ను మంగళవారమే విచారించాలని డిమాండ్ చేశారు. అయితే జస్టిస్ జి.ఎస్.సిస్తానీ, జస్టిస్ ఏ.జే.భంభానీలతో కూడిన బెంచ్ బుధవారం ఉదయం విచారిస్తామని స్పష్టం చేసింది. హింసాత్మక ఘటనలపై ప్రత్యేక విచారణ బృందాన్ని ఏర్పాటు చేయాలని కూడా వీరు డిమాండ్ చేశారు.

**పోలీసులు మాయం**

ఆందోళనలు జరుగుతున్న ప్రాంతంలో ఒక్క పోలీసు కూడా కనిపించలేదని, ఆందోళనకారులు సాధారణ ప్రజలను బెదిరిస్తూ.. దుకాణాలను ధ్వంసం చేసుకుంటూ వెళ్లిపోయారని ఓ పౌరుడు తెలిపారు. 1984 సిక్కు అల్లర్ల తరువాత అంతటి పరిస్థితి కనిపించడం ఇదే తొలిసారి అని మరో వ్యక్తి చెప్పారు. ఆందోళన కారులు రువ్విన రాళ్ల తగిలి గాయపడ్డ హెడ్ కానిస్టేబుల్ రతన్‌లాల్ మరణించారని, అయితే మరణించిన ఇతరులు ఏ కారణంగా మరణించారో? చంపింది ఎవరో తెలియరాలేదని అధికారులు మంగళవారం తెలిపారు. నగరంలో పరిస్థితి దిగజారుతున్న నేపథ్యంలో సీఎం కేజ్రీవాల్ పార్టీ ఎమ్మెల్యేలు, నేతలతో సమావేశమయ్యారు. ఢిల్లీ నగర సరిహద్దులను మూసివేయడం ద్వారా హింసకు పాల్పడే వారిని అడ్డుకోవచ్చునని సీఎం సూచించారు.

## అసలైన అస్సామీయులను

# తేల్చేందుకు కటాఫ్ తేదీ

**గువాహటి:** అస్సాం వాసికి నిర్వచనం.. వారి స్థానికతను గుర్తించేందుకు కటాఫ్ తేదీ.. వంటి అంశాలను ప్రస్తావిస్తూ అస్సాం ఒప్పందంలోని 6వ క్లాజ్ అమలుపై ఏర్పాటైన కమిటీ తన నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించింది. జస్టిస్ (రిటైర్డు)బీకే శర్మ, మీడియాతో మాట్లాడుతూ.. 'హోం మంత్రి అమిత్‌షాకు నివేదిక అందించే వరకు ఇందులోని అంశాలను వెల్లడించడం సరికాదు' అన్నారు. యండబో ఒప్పందం కుదిరిన 1826, 1950, 1971 సంవత్సరాలను కటాఫ్‌గా గుర్తించాలని విజ్ఞాపనలు అందాయన్నారు. విజ్ఞాపనలను పరిశీలించి అనంతరం ప్రభుత్వానికి పలు సూచనలను సీల్డు కవర్‌లో అందజేశామన్నారు. రాష్ట్ర ఆర్థిక మంత్రి హిమంత బిశ్వ శర్మ నేడో రేపో హోం మంత్రి అమిత్‌షాకు ఈ నివేదికను అందజేయనున్నారు. 1985లో అస్సాం ఉద్యమ నేతలకు, కేంద్ర ప్రభుత్వానికి మధ్య అస్సాం ఒప్పందం కుదిరిన సంగతి తెలిసిందే.

## ఢిల్లీ.. 'కాలుష్య రాజధాని'

**న్యూఢిల్లీ:** 2019 ఏడాదికి ప్రపంచంలోనే అత్యంత కాలుష్య రాజధాని నగరంగా ఢిల్లీ నిలిచింది. ప్రపంచ అత్యంత 30 కాలుష్య నగరాల జాబితాలో 21 భారతీయ నగరాలు ఉండటం ఆందోళన కలిగించేదిగా ఉంది. మొదటి స్థానంలో ఘజియాబాద్ (ఉత్తరప్రదేశ్) నిలిచింది. తర్వాతి స్థానాల్లో హోటన్ (చైనా), గుజ్రాన్‌వాలా, ఫైస్లాబాద్ (పాకిస్తాన్) ఉండగా, ఢిల్లీ 5వ స్థానంలో ఉంది. గతేడాదితో పోలిస్తే భారత నగరాలు కొంత మెరుగయ్యాయని పేర్కొంది.

## కోవిడ్.. ఇక్కడ తగ్గి అక్కడ పెరుగుతోంది

- దక్షిణ కొరియాలో 893 మందికి కరోనా
- చైనాలో కొద్దిమేర తగ్గుదల

**సియోల్/టెహ్రాన్/బీజింగ్:** దక్షిణ కొరియాలో కరోనా వైరస్ ప్రభావం పెరుగుతోందని ఆ దేశ అధ్యక్షుడు మూన్ జాయి ఇన్ మంగళవారం చెప్పారు. వైరస్‌పై విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. వైరస్ కారణంగా మంగళవారం నాటి పార్లమెంటు సమావేశాలు రద్దయ్యాయి. అమెరికా, కొరియాలు సంయుక్తంగా నిర్వహించ తలపెట్టిన మిలటరీ కార్యక్రమాలను కూడా పరిమితం చేసుకుంది. మంగళవారం కరోనా సోకిన వారి సంఖ్య 60కి పరిమితమైందన్నారు. కరోనా కారణంగా ఇరాన్‌లో ముగ్గురు, జపాన్ తీరంలోని షిప్‌లో మరొకరు మృతిచెందారు.

**చైనాలో తగ్గుముఖం**

చైనాలో కరోనా తగ్గుముఖం పడుతోందని అధికారులు చెబుతున్నారు. కొత్తగా వ్యాధి సోకుతున్న వారి సంఖ్య తగ్గుతోందన్నారు. సోమవారం నాటికి ఈ వ్యాధి బారిన పడి మరణించిన వారి సంఖ్య 2,663కు చేరుకోగా, 508 మంది మాత్రమే కొత్తగా ఈ వ్యాధి బారిన పడినట్లు గణాంకాలు చెబుతున్నాయి.

---

**బిజినెస్**

## రోసారి బయోటెక్ ఐపీఓకు ఓకే

**ఇష్యూ సైజు రూ.700 కోట్లు!**



**న్యూఢిల్లీ:** గృహ, వ్యక్తిగత సంరక్షణకు సంబంధించిన ప్రత్యేక రసాయనాలు తయారు చేసే రోసారి బయోటెక్ ఐపీఓ(ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్)కు మార్కెట్ నియంత్రణ సంస్థ, సెబీ ఆమోదం తెలిపింది. ఈ ఐపీఓలో భాగంగా రూ.150 కోట్ల విలువైన తాజా షేర్లను జారీ చేస్తారు. దీనికి అదనంగా ఆఫర్ ఫర్ సేల్ మార్గంలో కోటికి పైగా ఈక్విటీ షేర్లను విక్రయిస్తారు. మొత్తం మీద ఈ ఐపీఓ సైజు రూ.700 కోట్ల మేర ఉంటుందని అంచనా. ఈ ఐపీఓకు బుక్ రన్నింగ్ లీడ్ మేనేజర్లుగా యాక్సిస్ క్యాపిటల్, ఐసీఐసీఐ సెక్యూరిటీస్ వ్యవహరిస్తున్నాయి. ఐపీఓ ద్వారా సమీకరించిన నిధులను రుణ భారం తగ్గించుకోవడానికి వినియోగించుకోవాలని రోసారి బయోటెక్ యోచిస్తోంది. చర మూలధన అవసరాలకు, సాధారణ వ్యాపార కార్యకలాపాలకు కూడా ఈ నిధులను ఉపయోగించుకోవాలని ఈ కంపెనీ భావిస్తోంది.

# కొనసాగిన కోవిడ్-19 కష్టాలు

- ప్రభావం చూపని 'ట్రంప్' ఒప్పందాలు
- మూడో రోజూ క్షీణించిన స్టాక్ మార్కెట్
- 82 పాయింట్ల పతనంతో 40,281కు సెన్సెక్స్
- 32 పాయింట్ల నష్టంతో 11,798కు నిఫ్టీ



కోవిడ్-19(కరోనా) వైరస్ ఇతర దేశాలకు విస్తరిస్తుండటంతో మంగళవారం స్టాక్ మార్కెట్ నష్టపోయింది. స్టాక్ సూచీలు వరుసగా మూడో రోజూ పతనమయ్యాయి. ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్ ఫోర్స్(ఎఫ్ఏటీఎఫ్) సంస్థ, మారిషస్ దేశాన్ని గ్రే లిస్ట్‌లో ఉంచడం ప్రతికూల ప్రభావం చూపించింది. ఆద్యంతం ఒడిదుడుకులమయంగా సాగిన ట్రేడింగ్‌లో చివరకు సెన్సెక్స్ 82 పాయింట్లు పతనమై 40,281 పాయింట్ల వద్ద ముగిసింది. ఇక ఎన్ఎస్ఈ నిఫ్టీ 32 పాయింట్ల నష్టంతో 11,798 పాయింట్ల వద్దకు చేరింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత పర్యటన ఎలాంటి ప్రభావం చూపలేకపోయింది.డాలర్‌తో రూపాయి మారకం విలువ ఒకింత పుంజుకున్నా స్టాక్ మార్కెట్ నష్టాలు ఆగలేదు. ఈ ఏడాది ఇప్పటివరకూ సాధించిన లాభాలను సెన్సెక్స్, నిఫ్టీలు కోల్పోయాయి.

**315 పాయింట్ల రేంజ్‌లో సెన్సెక్స్...**

సెన్సెక్స్ లాభాల్లోనే మొదలైనా, ఆ తర్వాత నష్టాల్లోకి జారిపోయింది. చివరి వరకూ ఒడుదుడుకుల మధ్యే ట్రేడైంది. ఒక దశలో 173 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్ మరో దశలో 142 పాయింట్లు నష్టపోయింది. మొత్తం మీద రోజంతా 315 పాయింట్ల రేంజ్‌లో కదలాడింది. అంతర్జాతీయంగా వృద్ధిపై కోవిడ్-19 వైరస్ ప్రభావం దీర్ఘకాలమే ఉండగలదన్న భయాలు ప్రపంచ మార్కెట్లను వీడటం లేదు. ఆసియా మార్కెట్లు మిశ్రమంగా ముగిసినా, యూరప్ మార్కెట్లు నష్టాల్లో మొదలై, నష్టాల్లోనే ముగిశాయి.

**ఒడిదుడుకులు కొనసాగుతాయ్...**

అమెరికా తర్వాత మనదేశంలోకి అత్యధికంగా విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు(ఎఫ్‌డీఐ) వచ్చేది మారిషస్ దేశం నుంచే. ఈ దేశాన్ని ఎఫ్ఏటీఎఫ్ సంస్థ గ్రే లిస్ట్‌లో ఉంచడం.... ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. భారత్, అమెరికాల మధ్య మూడు ఒప్పందాలు జరిగినా, ఈ ఒప్పందాలు ఏమంత కీలకమైనవి కాకపోవడంతో ఈ ఒప్పందాల ప్రభావం పెద్దగా కనిపించలేదు. మరో రెండు రోజుల్లో ఫిబ్రవరి సిరీస్ డెరివేటివ్స్ కాంట్రాక్టులు ముగియనుండటం, ఈ శుక్రవారం ఈ ఆర్థిక సంవత్సరం మూడో క్వార్టర్ జీడీపీ గణాంకాలు వెలువడనుండటంతో స్టాక్ మార్కెట్లో ఒడిదుడుకులు కొనసాగుతాయని విశ్లేషకులంటున్నారు.

- సన్ ఫార్మా 2.3 శాతం నష్టంతో రూ.389 వద్ద ముగిసింది. సెన్సెక్స్‌లో బాగా నష్టపోయిన కంపెనీ షేర్ ఇదే.
- అంతర్జాతీయ సంస్థ నుంచి రూ,.2,900 కోట్ల ఆర్డర్ లభించడంతో నవీన్ ఫ్లోరిన్ ఇంటర్నేషనల్ షేర్ 20% లాభంతో రూ.1,455 వద్దకు చేరింది.
- 180కు పైగా షేర్లు ఏడాది కనిష్ట స్థాయిలకు పడిపోయాయి. బంధన్ బ్యాంక్, కెనరా బ్యాంక్, జిల్లెట్ ఇండియా, హీరో మోటొకార్ప్, హెచ్‌పీసీఎల్, ఎల్ అండ్ టీ, ఆయిల్ ఇండియా, పీఎన్‌బీ, ఎన్‌బీసీసీ, ఎల్ఐసీ హౌసింగ్ ఫైనాన్స్ తదితర షేర్లు ఈ జాబితాలో ఉన్నాయి.

**స్టాక్ మార్కెట్ డేటా**

| టర్నోవర్ (రూ. కోట్లలో) | |
|---|---|
| బీఎస్ఈ | 1,880 |
| ఎన్ఎస్ఈ | 36,871 |
| ఎన్ఎస్ఈ (డెరివేటివ్స్) | 14,15,568 |
| ఎఫ్ఐఐ | - 2,315 |
| డీఐఐ | 1,565 |

## దూకుడు తగ్గని ఐఆర్‌సీటీసీ

స్టాక్ మార్కెట్ నష్టపోతున్నా, రైల్వే కంపెనీ, ఐఆర్‌సీటీసీ షేర్ దూసుకుపోతూనే ఉంది. ఇంట్రాడేలో ఆల్‌టైమ్ హై, రూ.1,995ను తాకిన ఈ షేర్ చివకు 1 శాతం లాభంతో రూ.1,952 వద్ద ముగిసింది. ఈ జోరుతో ఈ కంపెనీ టాప్ 100 కంపెనీల జాబితాలోకి చేరింది. గత ఏడాది అక్టోబర్ 14న స్టాక్ మార్కెట్లో లిస్టయినప్పుడు రూ.11,658 కోట్లుగా ఉన్న కంపెనీ మార్కెట్ క్యాప్ గురువారం నాటికి రూ.31,239 కోట్లకు పెరిగింది. అత్యధిక మార్కెట్ క్యాప్‌గల కంపెనీల జాబితాలో 96వ స్థానానికి ఎగబాకింది. గత ఒక్క నెలలోనే ఈ షేర్ 99 శాతం పెరగడం విశేషం. ఇష్యూ ధర(రూ.320)తో పోల్చితే 510 శాతం మేర లాభపడింది.

**బులియన్** రూ.లలో

| | | |
|---|---|---|
| **ముంబై** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 43,310 | ▼ 790 |
| బంగారం (22 క్యారెట్లు) | 41,250 | ▼ 750 |
| వెండి (కిలో) | 52,400 | ▼ 900 |
| **హైదరాబాద్/చెన్నై** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 42,970 | ▼ 770 |
| బంగారం (22 క్యారెట్లు) | 40,920 | ▼ 740 |
| వెండి (కిలో) | 52,400 | ▼ 600 |
| **ప్రొద్దుటూరు** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 43,300 | |
| బంగారం (22 క్యారెట్లు) | 39,820 | |
| వెండి (కిలో) | 48,900 | |
| **ఏపీ బులియన్ అసోసియేషన్** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 44,180 | ▼ 700 |
| బంగారం (22 క్యారెట్లు) | 40,920 | ▼ 740 |
| వెండి (కిలో) | 49,600 | ▼ 800 |

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

**ముడిచమురు...** (బ్యారల్)

| | రాత్రి 11.30కు | సోమవారం ముగింపు |
|---|---|---|
| నైమెక్స్ లైట్ స్వీట్ | 50.48 | $ 51.48 |
| బ్రెంట్ | 54.80 | $ 55.77 |

**కోడిగుడ్లు** (హోల్‌సేల్ -నెక్/100కు రూ.లలో) 26-2-2020

| | |
|---|---|
| విశాఖ | 375-00 |
| చిత్తూరు | 383-00 |
| వరంగల్ | 313-00 |
| విజయవాడ | 330-00 |
| గోదావరి | 330-00 |
| **25-2-2020 ఫామ్ ధర...** | |
| హైదరాబాద్ | 310-00 |

## మారిషస్ ఇన్వెస్టర్లు..

## ఎఫ్‌పీఐగా నమోదుకు అర్హులే: సెబీ



**న్యూఢిల్లీ:** మారిషస్ నుంచి పెట్టుబడులు పెట్టే విదేశీ ఇన్వెస్టర్లు.. విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్(ఎఫ్‌పీఐ)గా నమోదు చేసుకోవడానికి అర్హులేనని మార్కెట్ నియంత్రణ సంస్థ, సెబీ స్పష్టం చేసింది. అయితే అంతర్జాతీయ నిబంధనల ప్రకారం వారిపై పర్యవేక్షణ పెరుగుతుందని వివరించింది. మారిషస్ దేశాన్ని ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్‌ఫోర్స్(ఎఫ్ఏటీఎఫ్-మనీ లాండరింగ్‌ను నిరోధించే ప్రమాణాలను రూపొందించే ప్రభుత్వ విభాగం) గ్రే లిస్ట్‌లో ఉంచిన నేపథ్యంలో సెబీ ఈ ప్రకటన చేసింది. మనీ లాండరింగ్, ఉగ్రవాదులకు ఆర్థిక సాయం చేయడం, నకిలీ నోట్లు చలామణి తేవడంవంటి అక్రమాలకు పాల్పడే దేశాలను ఈ జాబితాలో చేరుస్తారు. ఈ జాబితాలో చేర్చడం వల్ల పర్యవేక్షణ మరింతగా పెరుగుతుంది. భారత మార్కెట్లో పెట్టుబడులు పెడుతున్న ఎఫ్‌పీఐల్లో మారిషస్ నుంచి నమోదైన ఎఫ్‌పీఐలు చెప్పుకోదగ్గ సంఖ్యలో ఉంటారని అంచనా. మన దేశంలోకి వచ్చే విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్ట్‌మెంట్స్‌లో అమెరికా తర్వాత అత్యధికంగా వచ్చేది మారిషస్ నుంచే. ఎన్ఎస్‌డీఎల్ జనవరి గణాంకాల ప్రకారం..., అమెరికా ఎఫ్‌పీఐల ఆధీన ఆస్తులు రూ.11.6 లక్షల కోట్లుగా ఉండగా, మారిషస్ ఎఫ్‌పీఐల ఆధీన ఆస్తులు రూ.4.3 లక్షల కోట్లుగా ఉన్నాయి.

## సూక్ష్మ రుణం... 26.5 శాతం వృద్ధి

**ముంబై:** సూక్ష్మ రుణ విభాగం 2019 అక్టోబర్-డిసెంబర్ త్రైమాసికంలో 26.5 శాతం వృద్ధి నమోదుచేసుకుంది. ఈ విభాగం పోర్ట్‌ఫోలియో విలువ మొత్తం రూ.2.12 లక్షల కోట్లని ఒక నివేదిక తెలిపింది. కాగా జూలై-సెప్టెంబర్ (రెండవ) త్రైమాసికంలో ఈ విభాగం వృద్ధి రేటు కేవలం 8.5 శాతం కావడం గమనార్హం. రెండవ త్రైమాసికంతో పోల్చితే అటు పట్టణ ప్రాంతాల్లో ఇటు గ్రామీణ ప్రాంతాల్లో సూక్ష్మ రుణాలకు మంచి డిమాండ్ నెలకొందని గణాంకాలు పేర్కొన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఈ విభాగం వృద్ధి రేటు 1.6 శాతం నుంచి 10 శాతానికి పెరిగితే, పట్టణ ప్రాంతాలకు వచ్చే సరికి ఈ రేటు 1 శాతం నుంచి 6.6 శాతానికి ఎగసింది.

## ఏవో స్మిత్ నుంచి

## అత్యాధునిక వాటర్ ప్యూరిఫయర్



**హైదరాబాద్:** వాటర్ హీటర్ల మార్కెట్లో తనకుంటూ స్థానాన్ని సంపాదించుకున్న ఏవో స్మిత్ ఇప్పుడు వాటర్ ఫిల్టర్ల మార్కెట్లపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. టెక్నాలజీ పరంగా అత్యాధునికతతో కూడిన వాటర్ ప్యూరిఫయర్ ఎక్స్7ప్లస్‌ను తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మార్కెట్లలో విడుదల చేసింది. సైడ్ స్ట్రీమ్ ఆర్‌వో మెంబ్రేన్ అనే పెటెంటెడ్ టెక్నాలజీని ఇందులో ప్రవేశపెట్టినట్టు కంపెనీ తెలిపింది. ఎనిమిది అంచల్లో నీటిని వడపోయడంతోపాటు, టీడీఎస్ స్థాయిలు 3,000 వరకు ఉన్నా తగ్గించగలదని కంపెనీ వెల్లడించింది. మినరలైజర్ అనే టెక్నాలజీతో ఇది వస్తుందని, దీంతో మున్సిపల్ నీరు, బోర్‌వెల్ లేదా ట్యాంక్ నీటికి కూడా దీన్ని వినియోగించుకోవచ్చని కంపెనీ తెలిపింది. దీని ధర రూ.19,500.

## కీలకమైన వ్యక్తిగత డేటా

## దేశం దాటిపోకూడదు: అమితాబ్ కాంత్



**న్యూఢిల్లీ:** కీలకమైన ప్రజల వ్యక్తిగత డేటా కచ్చితంగా దేశీయంగానే నిల్వ చేయాలని నీతి ఆయోగ్ సీఈవో అమితాబ్ కాంత్ అభిప్రాయపడ్డారు. ప్రయో ప్రయోజనాలకు అనుగుణంగా భారత ప్రజల డేటాను భారత్‌లోనే నిల్వ చేయాలని వీసా, మాస్టర్ కార్డ్ తదితర అన్ని విదేశీ సంస్థలను కేంద్రం ఆదేశించగా, దీన్ని విదేశీ సంస్థలు వ్యతిరేకిస్తున్నాయి. దీంతో అమితాబ్ కాంత్ వ్యాఖ్యలకు ప్రాధాన్యం ఏర్పడింది. ప్రజోపయోగం కోసం డేటాను పంచుకునేందుకు వీలుగా త్వరలోనే ఓ పబ్లిక్ పోర్టల్‌ను ఏర్పాటు చేయనున్నట్టు కాంత్ తెలిపారు. దీనిపై నీతి ఆయోగ్ పనిచేస్తున్నట్టు ఫిక్కీ నిర్వహించిన అమెరికా-భారత్ ఫోరమ్ కార్యక్రమంలో భాగంగా చెప్పారు.

## శ్రీసిటీని సందర్శించిన ఈఎంసీ బృందం



ఈఎస్ఎస్‌సీఐ సీఈఓకు స్వాగతం పలుకుతున్నప్పటి చిత్రం

**వరదయ్యపాళెం(చిత్తూరు జిల్లా):** ఎలక్ట్రానిక్స్ సెక్టార్ స్కిల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఈఎస్ఎస్‌సీ) సీఈఓ మహాపాత్ర శ్రీసిటీని సందర్శించారు. ఆయనకు శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి సాదర స్వాగతం పలికారు. శ్రీసిటీ ప్రగతి, ప్రత్యేకతలను ఆయనకు వివరించారు. ఎలక్ట్రానిక్స్ మ్యానుఫాక్చరింగ్ క్లస్టర్ (ఈఎంసీ)లో భాగంగా ఇక్కడ ఏర్పాటైన ఎలక్ట్రానిక్స్ సెక్టార్ పరిశ్రమల గురించి మహాపాత్ర తెలుసుకున్నారు. సువిశాల పారిశ్రామికవాడలో ప్రపంచశ్రేణి మౌలిక వసతుతో పాటు వేలాది ఉద్యోగాలు రావడానికి కృషి చేసిన శ్రీసిటీ యాజమాన్యాన్ని ఆయన అభినందించారు. కేంద్ర ప్రభుత్వం సూచనల మేరకు శ్రీసిటీలోని ఈఎంసీలోని ఎలక్ట్రానిక్స్ క్లస్టర్స్‌లో వ్యాపార అవకాశాలను అంచనా వేయడంలో తమ పర్యటన ఉద్దేశ్యంగా మహాపాత్ర తెలిపారు. అనంతరం శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ.. మహాపాత్ర పర్యటన తమకెంతో ముఖ్యమైందని వ్యాఖ్యానించారు.

## అలెక్సా.. ఓపెన్ అపోలో!

**యాప్‌తో దగ్గర్లోని ఆసుపత్రి, వైద్యుల అపాయింట్‌మెంట్**



**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** ప్రముఖ హాస్పిటల్ చెయిన్ అపోలో గ్రూప్ వాయిస్ ఆధారిత యాప్ 'అమెజాన్ అలెక్సా స్కిల్-ఆస్క్ అపోలో'ను ఆవిష్కరించింది. దీంతో వాయిస్ కమాండ్‌తో దగ్గర్లోని అపోలో ఆసుపత్రులు, క్లినిక్స్, ఫార్మసీల వివరాలు తెలుసుకోవచ్చని, డాక్టర్ల అపాయింట్‌మెంట్ తీసుకోవచ్చని అపోలో గ్రూప్ ప్రకటన తెలిపింది. దేశవ్యాప్తంగా 72 అపోలో ఆసుపత్రులు, 5 వేల మంది వైద్యులు, 3,500 ఫార్మసీలు, 90 క్లినిక్స్, 15 డయాగ్నోస్టిక్ సెంటర్లు, 110 టెలిమెడిసిన్ సెంటర్లు, 15 మెడికల్ ఎడ్యుకేషన్ సెంటర్లు ఈ యాప్‌తో అనుసంధానమై ఉన్నట్లు సంస్థ జాయింట్ ఎండీ సంగీతా రెడ్డి తెలిపారు.

## విమానాశ్రయాల్లో రిటైల్ హవా

**ముంబై:** విమానాశ్రయాల్లో రిటైల్ విక్రయాల పరిమాణం వేగంగా వృద్ధి చెందుతోందని నైట్ ఫ్రాంక్ నివేదిక తెలియజేసింది. ప్రస్తుతం విమానాశ్రయాల్లో రిటైల్ విక్రయాల విలువ 1.4 బిలియన్ డాలర్లు (రూ.9,940 కోట్లు)గా ఉంటే, 2030 నాటికి వచ్చే పదేళ్ల కాలంలో 9.3 బిలియన్ డాలర్ల స్థాయికి (రూ.66,000 కోట్లకు) చేరుకుంటుందని తెలిపింది. విమానాశ్రయాల్లో రియల్ఎస్టేట్ అవకాశాల విలువ ఇదే కాలంలో 11,350 కోట్లకు విస్తరిస్తుందని నైట్ ఫ్రాంక్ అంచనా వేసింది.

సాక్షి స్పోర్ట్స్
బుధవారం
26-2-2020



# ఇలా ఆడితే ఎలా..!

సాక్షి క్రీడా విభాగం

'ఒక్క టెస్టులో ఓడిపోగానే ఏదో ఉపద్రవం ముంచుకొచ్చినట్లు అందరూ భావిస్తే నేనేమీ చేయలేను'... తొలి టెస్టులో పరాజయం తర్వాత కెప్టెన్ కోహ్లి చేసిన వ్యాఖ్య ఇది. అయితే గతంలో చాలా సార్లు చెప్పినట్లుగా ఓటమి కంటే ఓడిన తీరు అందరికీ నిరాశ కలిగించిందనడంలో సందేహం లేదు. 2018–19 సీజన్‌లో ఆస్ట్రేలియా చేతిలో పెర్త్ టెస్టు కోల్పోయిన తర్వాత భారత్ టెస్టుల్లో ఓడటం ఇదే తొలిసారి. అప్పుడు మ్యాచ్ ఓడినా... చివరకు సిరీస్ సొంతం చేసుకొని టీమిండియా చరిత్ర సృష్టించింది. 2019లో ఒక్క పరాజయం కూడా లేకుండా టీమ్ జోరు సాగింది. ఇందులో బలహీన వెస్టిండీస్‌పై ఆ దేశంలోనే సాధించిన రెండు విజయాలతో పాటు స్వదేశంలో వరుసగా దక్షిణాఫ్రికా, బంగ్లాదేశ్‌లపై గెలిచిన ఐదు మ్యాచ్‌లు ఉన్నాయి. ఈ ఏడాదిని మాత్రం జట్టు ఓటమితో ప్రారంభించింది.

### పరుగులే రాలేదు...

తొలి రోజు పిచ్‌పై కాస్త పచ్చిక, వాతావరణంలో తేమ కనిపించగానే మన బ్యాట్స్‌మెన్ మానసికంగా బలహీన పడిపోయారా అనిపించింది. మన బ్యాట్స్‌మెన్ 'అతి జాగ్రత్త' కూడా జట్టుపై ఒత్తిడి పెంచినట్లు కనిపిస్తోంది. ఆరంభంలో నిలదొక్కుకునే వరకు పర్వాలేదు గానీ ఆ తర్వాత కూడా స్కోరింగ్ షాట్లపై వారు దృష్టి పెట్టలేదు. ముఖ్యంగా పుజారా స్థాయి ఆటగాడు టెస్టును 'డ్రా' చేసుకునేందుకు ఆడినట్లు కనిపించిందే తప్ప స్కోరు బోర్డుపై పరుగులు కూడా ముఖ్యమనే అంశాన్ని విస్మరించాడు. తొలి ఇన్నింగ్స్‌లో 11 పరుగుల కోసం 42 బంతులు ఆడిన అతను రెండో ఇన్నింగ్స్‌లో అవే 11 పరుగుల కోసం 81 బంతులు తీసుకున్నాడు. విహారి కూడా 15 పరుగుల కోసం 79 బంతులు ఆడాడు. నాలుగో ఇన్నింగ్స్‌లో డ్రా కోసం ఆడే సమయంలో ఇది సరైన వ్యూహం కావచ్చేమో కానీ పరుగులే చేయకుండా క్రీజ్‌లో పాతుకుపోవడం వల్ల ప్రయోజనం లేదు. విదేశీ గడ్డపై తొలి టెస్టు కాబట్టి పృథ్వీ షాను క్షమించేయవచ్చని కెప్టెన్ ముందే చెప్పేశాడు. కానీ పృథ్వీ తాను సెహ్వాగ్ కాదనే విషయాన్ని గుర్తించి టెస్టు క్రికెటర్‌గా ఆడాలని తెలుసుకోవాలి. చకచకా 18 బంతుల్లో 16 పరుగులు చేసేసి వెళ్లిపోవడం ఏ రకంగా కూడా ఒక ఓపెనర్ చేయాల్సిన పని కాదు. కోహ్లి అరుదైన వైఫల్యం కూడా ఓటమికి కారణాల్లో ఒకటి. మయాంక్, రహానే కొంత పట్టుదల కనబర్చినా అది జట్టును రక్షించేందుకు సరిపోలేదు.

### బుమ్రా వైఫల్యంతో...

జొహన్నెస్‌బర్గ్, నాటింగ్‌హామ్, అడిలైడ్, మెల్‌బోర్న్... గత నాలుగు చిరస్మరణీయ విదేశీ విజయాల్లో భారత పేసర్లు పోషించిన పాత్ర ఎంతో గొప్పది. పిచ్ ప్రత్యర్థి తమకు అనుకూలంగా సిద్ధం చేసుకున్నా అక్కడ మన పేసర్లే చెలరేగిపోయి ఫలితాన్ని మార్చేయగలిగారు. ఈ సారి న్యూజిలాండ్‌లో తొలి టెస్టులో అది జరగలేదు. ఇషాంత్ ఐదు వికెట్లు తీసినప్పటికీ షమీ, బుమ్రాల వైఫల్యం జట్టును బలహీనంగా మార్చింది. మనవాళ్లు వంద శాతం స్వింగ్ బౌలర్లు కాకపోవడం కూడా ఒక కారణం. అయితే గాయం నుంచి కోలుకున్న తర్వాత బుమ్రాలో పదును తగ్గినట్లుందనే సందేహాన్ని మరోసారి ఈ మ్యాచ్ రేపింది. వన్డే సిరీస్ సమయంలోనే బుమ్రాను ఇకపై అందరూ సమర్థంగా ఎదుర్కోగలరంటూ కివీస్ బ్యాట్స్‌మెన్ చేసిన వ్యాఖ్యకు టెస్టు కూడా బలం చేకూర్చింది. ఈ నేపథ్యంలో రెండో టెస్టులో జట్టు ఏదైనా మార్పులతో, కొత్త వ్యూహంతో బరిలోకి దిగుతుందా చూడాలి.

### భారమైన బ్యాటింగ్...

న్యూజిలాండ్‌లో ఉండే విభిన్న పరిస్థితుల కారణంగా టెస్టు మ్యాచ్‌లు ప్రతీసారి సవాల్ విసురుతూనే ఉంటాయి. ఇప్పుడు కూడా అదే జరిగింది. కఠిన పరిస్థితుల్లో సీమ్, స్వింగ్ బౌలింగ్‌ను ఎదుర్కోవడంలో మనవాళ్లు పేలవమని మరోసారి తేలింది. కోహ్లి నాయకత్వంలో భారత్ అన్ని రంగాల్లో అద్భుతంగా ఆడుతూ అజేయ శక్తిగా ఎదిగిన తర్వాత ఇటీవలి కాలంలో ఇంతటి భారీ పరాజయం ఎప్పుడూ చవిచూడలేదు. పిచ్ ఎలా ఉన్నా... వరల్డ్ నంబర్‌వన్ టీమ్ రెండు ఇన్నింగ్స్‌లలోనూ 200 పరుగుల లోపే ఆలౌట్ అవుతుందని మాత్రం ఎవరూ ఊహించలేదు.

### టాస్ కీలకమా!

భారత్ ఓటమికి టాస్ ఓడిపోవడం కూడా కారణమని కోహ్లి చెప్పడం ఒకింత ఆశ్చర్యం కలిగించింది. కోచ్ రవిశాస్త్రి ఎప్పుడూ మాట్లాడినా... మాకు టాస్‌తో పని లేదు. అసలు టాస్‌ను లెక్కలోంచే తీసేస్తున్నాం. దాంతో సంబంధం లేకుండా గెలుస్తాం అని చెబుతూ వచ్చాడు. అయితే ఇదంతా స్వదేశంలోనే పనికొస్తుందని ఇప్పుడు అర్థమైంది. ఇలాంటి టెస్టులో తొలి ఇన్నింగ్స్ ప్రదర్శన కీలకం కాబట్టి టాస్ గెలిచి ఉంటే బాగుండేదని కోహ్లి అభిప్రాయం కావచ్చు. ఇందులో కొంత వాస్తవం కూడా ఉంది. 2009 తర్వాత సొంతగడ్డపై 17 టెస్టుల్లో టాస్‌లు గెలిచిన కివీస్ ఒక్క మ్యాచ్ కూడా ఓడిపోలేదు!

### పర్వతంపై కివీస్ విజయ వేడుకలు...

వెల్లింగ్టన్‌లో టెస్టు మ్యాచ్ గెలిచిన తర్వాత న్యూజిలాండ్ జట్టు సంబరాలు చేసుకోవడంలో ఒక పాత సాంప్రదాయాన్ని కొనసాగించింది. మ్యాచ్ జరిగిన బేసిన్ రిజర్వ్ మైదానం నుంచి 2 కిలోమీటర్ల దూరంలో ఉన్న మౌంట్ విక్టోరియాపైకి వెళ్లి తమ గెలుపును ఆస్వాదించారు. 1998లో భారత్‌పై బాక్సింగ్ డే టెస్టులో గెలిచిన నాటి నుంచి ఇది కొనసాగుతోంది. ఇందులో జట్టు బౌలర్లు, వికెట్ కీపర్ మాత్రమే పాల్గొంటారు. బ్యాట్స్‌మెన్‌కు చోటు లేదు. ఆటగాళ్లంతా పట్టే పడవలాంటి లిమోజిన్ కారులో నగరంలో అత్యంత ఖరీదైన షాంపేన్ సీసాలు, క్యూబన్ సిగార్స్ తీసుకొని అంతా పర్వతంపైకి చేరుకుంటారు. అక్కడి నుంచి నగరాన్ని, తాము ఆడిన మైదానాన్ని చూస్తూ గెలుపు వేడుకలు జరుపుకుంటారు. ఈ ఏర్పాట్లన్నీ చేసే బాధ్యత వికెట్ కీపర్‌దే! 2009 నుంచి 2013 మధ్య వెల్లింగ్టన్‌లో కివీస్ ఒక్క టెస్టు కూడా గెలవకపోవడంతో ఆ నాలుగేళ్లు ఈ పర్వత సంబరాలు జరగలేదు.

# పదికి పది వికెట్లు

## మహిళల అండర్-19 వన్డేలో అరుదైన ఘనత
## చండీగఢ్ బౌలర్ కశ్వీ గౌతమ్ రికార్డు




**కడప స్పోర్ట్స్:** దేశవాళీ మహిళల క్రికెట్‌లో సరికొత్త రికార్డు నమోదైంది. బీసీసీఐ అండర్-19 వన్డే టోర్నీలో భాగంగా కేఎస్‌ఆర్ఎం కళాశాల మైదానంలో జరిగిన మ్యాచ్‌లో చండీగఢ్ బౌలర్ కశ్వీ గౌతమ్ అద్భుతం చేసింది. ఈ వన్డే ఇన్నింగ్స్‌లో మొత్తం 10 ప్రత్యర్థి వికెట్లను కశ్వీ పడగొట్టి చరిత్ర సృష్టించింది. భారత్ తరఫున టెస్టుల్లో అనిల్ కుంబ్లే, దులీప్ ట్రోఫీ మ్యాచ్‌లో దేబాశిష్ మొహంతి, రంజీ మ్యాచ్‌లో రెక్స్ సింగ్ గతంలో ఒకే ఇన్నింగ్స్‌లో 10కి 10 వికెట్లు పడగొట్టారు. అయితే బోర్డు గుర్తింపు పొందిన ఒక వన్డే మ్యాచ్‌లో ఇలాంటి ఘనత నమోదు కావడం ఇదే తొలిసారి కావడం విశేషం. చండీగఢ్ కెప్టెన్ కూడా అయిన కశ్వీ ప్రత్యర్థి జట్టు అరుణాచల్ ప్రదేశ్‌ను ఒంటి చేత్తో పడగొట్టింది. 4.5 ఓవర్లు వేసిన ఆమె ఒక ఓవర్ మెయిడిన్ సహా 12 పరుగులిచ్చి 10 వికెట్లు పడగొట్టింది. తన రెండో ఓవర్ చివరి మూడు బంతుల్లో వికెట్లు తీసి 'హ్యాట్రిక్' కూడా సాధించింది. కశ్వీ బౌలింగ్ దెబ్బకు అరుణాచల్ ప్రదేశ్ 25 పరుగులకే కుప్పకూలింది. జట్టులో 8 మంది డకౌట్ కాగా... ముగ్గురు 10, 4, 3 చొప్పున పరుగులు చేశారు. మరో 8 పరుగులు ఎక్స్‌ట్రాల రూపంలో వచ్చాయి. అంతకుముందు 50 ఓవర్లలో 4 వికెట్లకు 186 పరుగులు చేసిన చండీగఢ్ 161 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. బ్యాటింగ్‌లో కూడా కశ్వీ (68 బంతుల్లో 49; 6 ఫోర్లు)నే టాప్ స్కోరర్‌గా నిలిచింది.

# ఆసియా జట్టులో కోహ్లి

## వరల్డ్ ఎలెవన్‌తో రెండు టి20 మ్యాచ్‌ల పోరు

**ఢాకా:** బంగ్లాదేశ్ జాతిపిత షేక్ ముజీబుర్ రహమాన్ శత జయంతి ఉత్సవాల సందర్భంగా నిర్వహించనున్న రెండు మ్యాచ్‌ల ప్రత్యేక టి20 సిరీస్‌లో భారత క్రికెట్ జట్టు కెప్టెన్ విరాట్ కోహ్లి పాల్గొనే అవకాశం ఉంది. ఆసియా ఎలెవన్, వరల్డ్ ఎలెవన్ మధ్య మార్చి 21, 22 తేదీల్లో ఈ మ్యాచ్‌లు జరుగుతాయి. కోహ్లి దీనిని అధికారికంగా ధ్రువీకరించకపోయినా అతను కనీసం ఒక మ్యాచ్‌లోనైనా ఆడతాడని సమాచారం. బీసీసీఐ అధ్యక్షుడు సౌరవ్ గంగూలీతో చర్చించిన తర్వాత దీనిపై కోహ్లి స్పష్టతనిస్తాడు. భారత జట్టు సొంతగడ్డపై దక్షిణాఫ్రికాతో మార్చి 18న చివరి వన్డే ఆడనుండగా... మార్చి 29న ఐపీఎల్ ప్రారంభమవుతుంది. తన బిజీ షెడ్యూల్ నుంచి కోహ్లి ఈ మ్యాచ్ కోసం ప్రత్యేకంగా సమయం కేటాయించాల్సి ఉంది. కోహ్లి ఒక మ్యాచ్ ఆడితే మరో మ్యాచ్‌లో కేఎల్ రాహుల్ బరిలోకి దిగనున్నట్లు తెలిసింది. మరో నలుగురు భారత క్రికెటర్ల పేర్లు మాత్రం ఖరారయ్యాయని బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (బీసీబీ) వెల్లడించింది. శిఖర్ ధావన్, రిషభ్ పంత్, మొహమ్మద్ షమీ, కుల్దీప్ యాదవ్ ఈ సిరీస్‌లో ఆడనున్నారు. భారత్, బంగ్లాదేశ్‌లతో పాటు శ్రీలంక, అఫ్గానిస్తాన్‌కు చెందిన ఆటగాళ్లు కూడా ఆసియా ఎలెవన్ టీమ్‌లో ఉంటారు. అదే సమయంలో పాకిస్తాన్ సూపర్ లీగ్ (పీఎస్‌ఎల్) జరుగుతున్నందున ఆ దేశపు ఆటగాళ్లను ఆహ్వానించడం లేదు. వరల్డ్ ఎలెవన్ జట్టు తరఫున డు ప్లెసిస్, గేల్, బెయిర్‌స్టో, పొలార్డ్ తదితరులు ఈ రెండు మ్యాచ్‌లలో పాల్గొనే అవకాశం ఉంది. జట్ల వివరాలు ఇలా ఉన్నాయి.

**ఆసియా ఎలెవన్:** కోహ్లి, రాహుల్, ధావన్, పంత్, కుల్దీప్, షమీ(భారత్), తిసారా పెరీరా, మలింగ (శ్రీలంక), ముజీబుర్ రహమాన్, రషీద్ ఖాన్ (అఫ్గానిస్తాన్), సందీప్ లమిచానె (నేపాల్), ముస్తఫిజుర్ , తమీమ్ ఇక్బాల్, ముష్ఫికర్ రహీమ్, లిటన్ దాస్, మహ్మదుల్లా (బంగ్లాదేశ్).

**వరల్డ్ ఎలెవన్:** అలెక్స్ హేల్స్, బెయిర్‌స్టో (ఇంగ్లండ్), క్రిస్ గేల్, నికోలస్ పూరన్, కీరన్ పొలార్డ్, షెల్డన్ కాట్రెల్ (వెస్టిండీస్), డు ప్లెసిస్, ఇన్‌గిడి (దక్షిణాఫ్రికా), ఆండ్రూ టై (ఆస్ట్రేలియా), మిచెల్ మెక్లీనగన్ (న్యూజిలాండ్).

## రంజీ ట్రోఫీలో డీఆర్‌ఎస్

### సెమీస్‌లో ప్రయోగాత్మకంగా పరీక్ష

**ముంబై:** దేశవాళీ ఫస్ట్ క్లాస్ క్రికెట్ టోర్నీ రంజీ ట్రోఫీలో తొలిసారి అంపైర్ నిర్ణయ సమీక్షా పద్ధతి (డీఆర్‌ఎస్)ను ప్రవేశపెట్టబోతున్నారు. శనివారం నుంచి గుజరాత్, సౌరాష్ట్ర జట్ల మధ్య... కర్ణాటక, బెంగాల్ జట్ల మధ్య జరిగే సెమీఫైనల్ మ్యాచ్‌లలో దీనిని ఉపయోగిస్తారు. ప్రతీ ఇన్నింగ్స్‌లో ఒక జట్టు నాలుగు సార్లు రివ్యూకు వెళ్లే అవకాశం ఉంది. అయితే అంతర్జాతీయ మ్యాచ్‌లలో డీఆర్‌ఎస్ ద్వారా ఫలితాన్ని పొందేందుకు వాడే అల్ట్రా ఎడ్జ్ టెక్నాలజీ, హాక్ ఐ లేకుండానే బీసీసీఐ కొత్త విధానాన్ని ప్రయోగాత్మకంగా పరిశీలిస్తుండటం ఆశ్చర్యకరం.

## ఫైనల్లో ఆంధ్ర యూనివర్సిటీ

**కటక్:** ఖేలో ఇండియా యూనివర్సిటీ క్రీడల్లో పురుషుల బ్యాడ్మింటన్ విభాగంలో ఆంధ్ర యూనివర్సిటీ జట్టు ఫైనల్‌కు చేరుకుంది. మంగళవారం జరిగిన సెమీఫైనల్లో కలగ జగదీశ్, ప్రణయ్ రెడ్డి, గారగ కృష్ణప్రసాద్, గోపరాజు ఆదిత్య బాపినీడు, ఆకాశ్ చంద్రన్, పొదిలె శ్రీకృష్ణ సాయికుమార్‌లతో కూడిన ఆంధ్ర యూనివర్సిటీ 3–1తో జైన్ యూనివర్సిటీ (కర్ణాటక)పై గెలిచింది. నేడు జరిగే ఫైనల్లో పంజాబ్ యూనివర్సిటీ (చండీగఢ్)తో ఆంధ్ర జట్టు తలపడుతుంది. మహిళల విభాగంలో నిశిత వర్మ, అక్షిత, ప్రీతిలతో కూడిన ఆంధ్ర యూనివర్సిటీ జట్టు ప్లే ఆఫ్ మ్యాచ్‌లో 2–1తో ఢిల్లీ యూనివర్సిటీపై నెగ్గి కాంస్య పతకం సాధించింది.

# తుది జట్టులో పేస్

## క్రొయేషియాతో డేవిస్ కప్ మ్యాచ్ కోసం భారత జట్టు ప్రకటన



**న్యూఢిల్లీ:** ఈ ఏడాది అంతర్జాతీయ కెరీర్‌కు వీడ్కోలు పలకనున్న భారత టెన్నిస్ దిగ్గజం లియాండర్ పేస్‌కు అఖిల భారత టెన్నిస్ సంఘం (ఏఐటీఏ) చివరిసారి జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించే అవకాశం కల్పించింది. మార్చి 6, 7 తేదీల్లో జాగ్రెబ్‌లో క్రొయేషియా జట్టుతో జరిగే డేవిస్ కప్ టీమ్ టెన్నిస్ వరల్డ్ క్వాలిఫయింగ్ మ్యాచ్‌లో పాల్గొనే ఐదుగురు సభ్యులతో భారత తుది జట్టును ఏఐటీఏ మంగళవారం ప్రకటించింది. ఈ మేరకు ఆటగాళ్ల జాబితాను అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్)కు పంపించింది. 24 జట్లు పాల్గొనే క్వాలిఫయర్స్‌లో గెలిచిన 12 జట్లు ఈ ఏడాది చివర్లో జరిగే డేవిస్ కప్ ఫైనల్స్ టోర్నీకి అర్హత సాధిస్తాయి. సింగిల్స్‌లో భారత టాప్–3 ర్యాంకర్లు సుమీత్ నాగల్, ప్రజ్నేశ్ గుణేశ్వరన్, రామ్‌కుమార్ రామనాథన్... డబుల్స్‌లో భారత నంబర్‌వన్ రోహన్ బోపన్న, నాలుగో ర్యాంకర్ లియాండర్ పేస్‌లను భారత జట్టులో ఎంపిక చేశామని ఏఐటీఏ తెలిపింది. డబుల్స్‌లోభారత రెండో ర్యాంకర్ దివిజ్ శరణ్‌ను రిజర్వ్ ప్లేయర్‌గా ఎంపిక చేశారు. 'ఈ సీజన్‌లో పేస్ బాగా రాణిస్తున్నాడు. మంచి ఫామ్‌లో ఉన్నాడు. టాటా ఓపెన్‌లో దివిజ్ శరణ్ జంటపై పేస్ జోడీ గెలిచింది. బెంగళూరు ఓపెన్ చాలెంజర్ టోర్నీలో పేస్ ద్వయం రన్నరప్‌గా నిలిచింది. అంతేకాకుండా ఈ ఏడాది పేస్ కెరీర్‌లో చివరిది. 30 ఏళ్లుగా దేశానికి సేవ అందిస్తున్న వ్యక్తికి అత్యున్నత గౌరవం ఇవ్వాలనే ఉద్దేశంతో కూడా అతడిని ఎంపిక చేశాం. దివిజ్ కూడా ఇదే అభిప్రాయంతో ఉన్నాడు' అని భారత నాన్ ప్లేయింగ్ కెప్టెన్ రోహిత్ రాజ్‌పాల్ తెలిపారు. డేవిస్ కప్‌లో క్రొయేషియా, భారత్ తలపడనుండటం ఇది రెండోసారి మాత్రమే. 1995లో న్యూఢిల్లీ వేదికగా జరిగిన మ్యాచ్‌లో భారత్ 3–2తో క్రొయేషియాను ఓడించింది. ఈ పోటీలో పేస్ సింగిల్స్‌తోపాటు డబుల్స్‌లోనూ బరిలోకి దిగి విజయం సాధించాడు.

# విదేశీ లీగ్‌లలో ఆడతా: ఓజా




**ముంబై:** ఇటీవలే ఆటకు వీడ్కోలు పలికిన భారత లెఫ్టార్మ్ స్పిన్నర్ ప్రజ్ఞాన్ ఓజా విదేశీ టి20 లీగ్‌లలో ఆడాలనుకుంటున్నట్లు వెల్లడించాడు. అందుకు బీసీసీఐ అనుమతి కోసం వేచి చూస్తున్నట్లు ఈ హైదరాబాద్ క్రికెటర్ చెప్పాడు. 'ప్రస్తుతానికి నేను వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్నాను. బీసీసీఐలో కూడా భాగంగా ఉన్నా. ఇకపై విదేశీ లీగ్‌లలో ఆడాలనేది నా ఆలోచన. అందుకే బోర్డు పెద్దల సలహా తీసుకోవాలని భావిస్తున్నా. అనుమతి లభిస్తే మాత్రం ఆడేందుకు సిద్ధం' అని ఓజా వ్యాఖ్యానించాడు. భారత్ తరఫున మరిన్ని మ్యాచ్‌లు ఆడలేకపోవడం తన కెరీర్‌లో నిరాశకు గురి చేసిన అంశమని అతను విశ్లేషించాడు. 'చకింగ్' కారణంగానే తన కెరీర్ ఇబ్బందుల్లో పడిందని విషయాన్ని అతను అంగీకరించలేదు. ఆ వివాదం తనకు సమస్య కాలేదని, 22 రోజుల్లోనే బౌలింగ్ శైలిని సరిదిద్దుకొని మళ్లీ రంజీ బరిలోకి దిగిన విషయాన్ని ఓజా గుర్తు చేసుకున్నాడు.

# 3 నెలలు వేచి చూస్తాం!

## టోక్యో ఒలింపిక్స్ నిర్వహణపై ఐఓసీ

**టోక్యో:** కోవిడ్–19 వైరస్ వేగంగా ప్రబలుతున్న నేపథ్యంలో టోక్యో ఒలింపిక్స్ నిర్వహణ సందేహాస్పదంగా మారడంపై అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ) సీనియర్ సభ్యుడు డిక్ పౌండ్ కీలక వ్యాఖ్య చేశారు. తుది నిర్ణయం తీసుకునే ముందు మరో మూడు నెలల పాటు వేచి చూస్తామని ఆయన అన్నారు. జూలై 24 నుంచి 2020 టోక్యో ఒలింపిక్స్ జరగాల్సి ఉంది. 'అన్ని రకాలుగా సన్నద్ధమయ్యేందుకు క్రీడల ఆరంభ తేదీకి ముందుగా కనీసం రెండు నెలల సమయమైనా మాకు అందుబాటులో ఉండాలి. ఒలింపిక్స్‌కు ఇంకా ఐదు నెలల సమయం ఉంది. కోవిడ్–19 వైరస్‌కు సంబంధించి మూడు నెలల్లోగా మరింత స్పష్టత వస్తుంది కాబట్టి అప్పుడే నిర్ణయం తీసుకుంటాం. ఆలోగా కోవిడ్–19 అదుపులోకి వస్తుందని విశ్వసిస్తున్నాం' అని పౌండ్ అభిప్రాయపడ్డారు. ప్రస్తుతానికి మాత్రం ఆటగాళ్లు ఎక్కడా అలసత్వానికి తావీయకుండా శిక్షణ కొనసాగించాలని ఆయన సూచించారు. మరోవైపు దక్షిణ కొరియాలోని బుసాన్ నగరంలో మార్చి 22 నుంచి జరగాల్సిన వరల్డ్ టీమ్ టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్ పోటీలు జూన్‌కు వాయిదాపడ్డాయి.



# ఫైనల్లో సంజన

## ఫ్రెంచ్ ఓపెన్ వైల్డ్ కార్డు టోర్నీ

**సాక్షి, హైదరాబాద్:** ఫ్రెంచ్ ఓపెన్ జూనియర్ వైల్డ్ కార్డు క్వాలిఫయింగ్ టోర్నమెంట్‌కు అర్హత సాధించేందుకు హైదరాబాద్ టెన్నిస్ ప్లేయర్ సంజన సిరిమల్ల విజయం దూరంలో నిలిచింది. న్యూఢిల్లీ వేదికగా జరుగుతోన్న రొలాండ్ గారోస్ వైల్డ్ కార్డు టోర్నీ బాలికల సింగిల్స్ విభాగంలో సంజన ఫైనల్‌కు చేరింది. సెమీఫైనల్లో సంజన 6–4, 7–5తో టాప్ సీడ్ రేష్మా మారూరి (కర్ణాటక)పై గెలిచింది. నేడు జరిగే ఫైనల్లో వైష్ణవి ఆడ్కర్ (మహారాష్ట్ర)తో సంజన ఆడుతుంది. ఈ మ్యాచ్‌లో గెలిచిన వారు పారిస్‌లో జరిగే ఫ్రెంచ్ ఓపెన్ క్వాలిఫయింగ్ టోర్నీకి అర్హత సాధిస్తారు. ఆ టోర్నీలో మెక్సికో, బ్రెజిల్, చైనా దేశాల నుంచి అర్హత సాధించిన క్రీడాకారిణులతో ఆడతారు. క్వాలిఫయింగ్ టోర్నీ విజేతకు మే–జూన్‌లో జరిగే ఫ్రెంచ్ ఓపెన్ జూనియర్ టోర్నీలో మెయిన్ 'డ్రా'లో పాల్గొనే అవకాశం లభిస్తుంది. బాలుర సింగిల్స్ సెమీఫైనల్స్‌లో టాప్ సీడ్ దేవ్ జవియా 6–2, 6–1తో నితిన్ సింగ్‌పై, మూడో సీడ్ చిరాగ్ 6–1, 6–0తో మోహిత్‌పై గెలుపొందారు.

# ప్రజ్నేశ్ పరాజయం



**దుబాయ్:** ఈ ఏడాది బరిలోకి దిగిన ఐదో టోర్నమెంట్‌లోనూ భారత అగ్రశ్రేణి టెన్నిస్ ప్లేయర్ ప్రజ్నేశ్ గుణేశ్వరన్‌కు నిరాశ ఎదురైంది. దుబాయ్ ఓపెన్ ఏటీపీ–500 టోర్నమెంట్‌లో చెన్నైకి చెందిన 30 ఏళ్ల ప్రజ్నేశ్ తొలి రౌండ్‌లోనే నిష్క్రమించాడు. ప్రపంచ 96వ ర్యాంకర్ డెన్నిస్ నొవాక్ (ఆస్ట్రియా)తో మంగళవారం జరిగిన మ్యాచ్‌లో ప్రపంచ 134వ ర్యాంకర్ ప్రజ్నేశ్ 4–6, 3–6తో ఓడిపోయాడు. 77 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో ప్రజ్నేశ్ తన సర్వీస్‌ను నాలుగుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను రెండుసార్లు బ్రేక్ చేశాడు.

### క్వార్టర్ ఫైనల్లో పేస్ జంట

ఇదే టోర్నీ పురుషుల డబుల్స్ విభాగంలో లియాండర్ పేస్ (భారత్)–మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జంట శుభారంభం చేసింది. పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో పేస్–ఎబ్డెన్ ద్వయం 6–4, 6–3తో ఇవాన్ డోడిగ్ (క్రొయేషియా)–ఫిలిప్ పొలాసెక్ (స్లొవేకియా) జోడీపై విజయం సాధించింది. క్వార్టర్ ఫైనల్లో హెన్రీ కొంటినెన్ (ఫిన్‌లాండ్)–జాన్ లెనార్డ్ స్ట్రఫ్ (జర్మనీ) జంటతో పేస్–ఎబ్డెన్ ద్వయం ఆడుతుంది.

# బంగ్లాదేశ్ ఘనవిజయం

- ఇన్నింగ్స్, 106 పరుగుల తేడాతో జింబాబ్వే పరాజయం
- నయీమ్ హసన్‌కు ఐదు వికెట్లు




**ఢాకా:** జింబాబ్వేతో జరిగిన ఏకైక టెస్టు మ్యాచ్‌లో బంగ్లాదేశ్ ఘనవిజయం సాధించింది. బౌలింగ్‌లో నయీమ్ హసన్ (5/82), తైజుల్ ఇస్లామ్ (4/78) హడలెత్తించడంతో... ఓవర్‌నైట్ స్కోరు 9/2తో మంగళవారం ఆట కొనసాగించిన జింబాబ్వే తమ రెండో ఇన్నింగ్స్‌లో 189 పరుగులకు ఆలౌటైంది. దాంతో బంగ్లాదేశ్ ఇన్నింగ్స్, 106 పరుగుల తేడాతో విజయం సాధించింది. తొలి ఇన్నింగ్స్‌లో ఫర్వాలేదనిపించిన జింబాబ్వే రెండో ఇన్నింగ్స్‌లో పూర్తిగా విఫలమైంది. కెప్టెన్ ఇర్విన్ (43; 6 ఫోర్లు, సిక్స్), మరూమ (41; 5 ఫోర్లు) మాత్రమే ఫర్వాలేదనిపించారు. తొలి ఇన్నింగ్స్‌లో డబుల్ సెంచరీతో చెలరేగిన ముష్ఫికర్ రహీమ్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది.

epaper.sakshi.com

## గో'మాత' వాత్సల్యం



**ధారూరు:** గోమాత మేకపిల్లలకు పాలిస్తూ తన మాతృత్వాన్ని చాటుకుంది. వికారాబాద్ జిల్లా ధారూరు మండలంలోని నాగారం తండాలో ఈ దృశ్యం కనిపించింది. గ్రామానికి చెందిన రైతు రెడ్యానాయక్ వద్ద ఉన్న ఆవు మంగళవారం మేక పిల్లలకు పాలిచ్చింది. లేగదూడతో పాటు ఆరు మేక పిల్లలకు నిత్యం ఆవు పాలు ఇస్తోందని రెడ్యానాయక్ తెలిపారు.



## గుమ్మడవెల్లిని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతాం

**కందుకూరు:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల స్థానికుల సహకారంతో గుమ్మడవెల్లి గ్రామాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. సంసద్ ఆదర్శ గ్రామ యోజన పథకం కింద ఆయన ఎంపిక చేసుకున్న రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం గుమ్మడవెల్లిలో మంగళవారం తన భార్యతో కలసి పర్యటించారు. అనంతరం గ్రామంలోని మహాత్మాగాంధీ, అంబేడ్కర్ విగ్రహాలను ఆవిష్కరించారు. అనంతరం అక్కడి గిరిజనులు చేసిచ్చిన రొట్టెలనుమంత్రిమధ్యాహ్న భోజనంగా తీసుకున్నారు.

## గ్రీన్ చాలెంజ్‌లో సినీ హీరో అర్జున్



**సాక్షి, హైదరాబాద్:** సినీ హీరో అర్జున్ గ్రీన్ చాలెంజ్‌లో పాల్గొని మొక్కలు నాటారు. చెన్నైలోని తన నివాసంలో ఆయన మొక్కలు నాటడంతో పాటు 'ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటండి, వాటిని కన్నబిడ్డల్లా పెంచండి' అంటూ 40 సెకన్ల నిడివితో ఓ వీడియోను పోస్ట్ చేశారు. 'గ్రీన్ చాలెంజ్ మంచి కార్యక్రమం. ధర్మో రక్షతి రక్షిత: మాదిరిగానే వృక్షో రక్షతి రక్షత:... చెట్లను మనం రక్షిస్తే, అవే మనకి రక్షణ ఇస్తాయి' అని పేర్కొన్నారు.



# మాట ముచ్చట C\o హైదరాబాద్ హౌస్

- దేశాధినేతలెవరైనా అధికారిక చర్చలు జరిగేది అందులోనే
- హస్తినలోని ప్రభుత్వ భవనాలకు తలమానికం
- నగిషీల నుంచి గుమ్మటం వరకు అన్నీ ప్రత్యేకమే
- అంతటా అబ్బురపరిచే యూరోపియన్ నిర్మాణ శైలి
- 36 గదులతో నిర్మించుకున్న ఏడో నిజాం
- స్వాతంత్ర్యానంతరం స్వాధీనం చేసుకున్న కేంద్ర ప్రభుత్వం

హైదరాబాద్ హౌస్.. మన దేశానికి విదేశీ దేశాధినేతలు వచ్చినప్పుడల్లా ప్రపంచానికి 'హైదరాబాద్' పేరు వినిపిస్తుంది. ప్రముఖులు రావడం కంటే వారితో మన దేశం చర్చలు జరిపి చేసుకొనే ఒప్పందాలపైనే ప్రపంచ దృష్టి నిలుస్తుంది. ఆ ఒప్పందాలతో పాటే మార్మోగే పేరు హైదరాబాద్ హౌస్. ఇప్పుడు అగ్రరాజ్యాధినేత డొనాల్డ్ ట్రంప్‌తో కీలక ఒప్పందాలకు, ద్వైపాక్షిక చర్చలకు కూడా ఈ భవనమే మరోసారి వేదికై అంతర్జాతీయంగా మరోసారి తన పేరును గుర్తుచేసింది. దేశ రాజధానిలో ఎన్నో వేదికలున్నా విదేశీ దేశాధినేతలతో చర్చలు అనగానే హైదరాబాద్ హౌస్ తప్ప మరో పేరు గుర్తుకు రాదు.

### ఇంతకూ ఆ భవనమే ఎందుకు?

చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ భారత్ పర్యటనలో భాగంగా అహ్మదాబాద్‌కు వచ్చినప్పుడు ప్రధాని మోదీతో కలసి ఊయల్లో కూర్చొని కాసేపు మాట్లాడారు. రెండోసారి వచ్చినప్పుడు మహాబలిపురంలో సముద్ర తీరాన కొబ్బరి బొండాలు ఆస్వాదిస్తూ చర్చించుకున్నారు. అవన్నీ సరదా చర్చలకే పరిమితం. అసలు సిసలు చర్చలంటే చలో హైదరాబాద్ హౌస్ అనాల్సిందే. రెండు దేశాల మధ్య ఒప్పందాలు అనగానే వాటిని ఫలప్రదం చేసే స్థాయిలో చర్చలు జరగాలి. ఆ చర్చలకు సానుకూల వాతావరణం కల్పించే ప్రాంగణం ఉండాలి. వాటన్నింటికీ కేరాఫ్ అడ్రస్ హైదరాబాద్ హౌసే. ఎందుకంటే ఆ నిర్మాణ కౌశలం గంభీరంగా ఉంటుంది.. అందులోని ఇంటీరియర్ రాజసాన్ని ఒలకబోస్తుంది. పచ్చిక బయళ్ల గంభీర వాతావరణాన్ని తెలికపరుస్తాయి. ప్రవేశ మార్గంలో వాడిన రాతి నగిషీలు మొదలు, భవనంపైన ఉన్న గుమ్మటం శిఖరం వరకు అన్నీ ప్రత్యేకమే. అందుకే ఆ భవనం ఢిల్లీలో ఓ ప్రత్యేకం.

### స్థాయికి తగ్గట్లు కావాలని..

ఏడో నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ ఏది చేసినా తన స్థాయికి తగ్గట్టే ఉండాలని కోరుకునేవారు. దానికి అప్పట్లోనే హైదరాబాద్‌కు ఒనగూరిన హంగులే సాక్ష్యం. రాచరికంలో కనిపించిన ఆర్భాటాన్ని అమితంగా ఇష్టపడే ఆయన తన కీర్తి హైదరాబాద్‌కే పరిమితం కావద్దనుకున్నారు. దానికి సజీవ సాక్ష్యమే ఢిల్లీలోని హైదరాబాద్ హౌస్.

### విదేశాల నుంచి వస్తువులు..

దేశ రాజధానిలో తమకు ఓ విడిది ఉండాలనేది అప్పటి సంస్థానాధీశుల కోరిక. అందుకు నాటి ఆంగ్ల పాలకులు అంగీకరించారు. అంతే స్థలాలు సమకూర్చుకొని భారీ ప్యాలెస్‌లు నిర్మించుకున్నారు. ఢిల్లీలోని ఇండియా గేట్, రాష్ట్రపతి భవన్‌ను రూపొందించింది ఎడ్విన్ లూటెన్స్ అనే ఆర్కిటెక్ట్. నాటి వైస్‌రాయ్ అధికారిక నివాసం లాగే తన అధికారిక నివాసం కూడా ఉండాలని ఎడ్విన్‌కు దాని ప్రణాళిక బాధ్యతలు అప్పగించాడు ఏడో నిజాం. విదేశాల నుంచి తెప్పించిన కలప, రాళ్లను తొలుత హైదరాబాద్ పబ్లిక్ గార్డెన్‌లో నిజాం కోసం ప్రదర్శించారు. ఆయన పచ్చజెండా ఊపగానే నిర్మాణంలో వాడారు. 1926లో నిర్మాణం ప్రారంభం కాగా, రెండేళ్లకు పూర్తయింది. 8.77 ఎకరాల సువిశాల విస్తీర్ణంలో 36 గదులను అన్ని హంగులతో నిర్మిం చారు. అప్పట్లో నిర్మాణానికి రూ. 1.86 కోట్లు ఖర్చయింది. నిజాం ప్యాలెస్‌గా పేరు పెట్టారు. స్వాతంత్ర్యానంతరం నిజాం ప్యాలెస్ హైదరాబాద్ హౌస్‌గా మారిపోయింది.

### కొడుకులకు నచ్చలేదు..

ప్రపంచంలోనే ఆర్భాటంగా ఉండాలని నిజాం కోరుకున్నా జీవన విధానం పూర్తి ఇస్లాం పద్ధతిలో ఉండేది. మతానికి ఆయన ఎంతో ప్రాధాన్యం ఇచ్చేవారు. తన వారసులనూ అలానే పెంచారు. హైదరాబాద్ హౌస్ విషయంలో తండ్రీకొడుకుల మధ్య అభిప్రాయభేదాలకు కూడా అదే కారణమైంది. రాజప్రాసాదంలా ఉండాలన్న ఉద్దేశంతో హైదరాబాద్ హౌస్‌కు ఆయన ఆర్కిటెక్ట్‌గా నియమించుకున్న ఎడ్విన్‌కు నిర్మాణంలో పూర్తి స్వేచ్ఛనిచ్చారు. అప్పటికే సిద్ధమైన వైస్‌రాయ్ భవనంపై ఉండే గుమ్మటం (డోమ్) సాంచీలో ఉండే బౌద్ధస్థూపం నమూనాలో నిర్మించారు. దానికి కాస్త పోలికలుంటూనే యూరోపియన్ నిర్మాణ శైలితో నియో క్లాసికల్‌గా హైదరాబాద్ హౌస్‌పై డోమ్‌ను నిర్మించారు. దీంతోపాటు మొత్తం భవనం నాటి ఆధునిక యురోపియన్ ఆర్కిటెక్ట్ శైలితో రూపొందింది. అయితే ఆయన ఇద్దరు కుమారులు అజంజాహీ, మొజంజాహీలు మాత్రం నొచ్చుకున్నారు. సంప్రదాయ ఇస్లామిక్ నిర్మాణ శైలిని కాదని యురోపియన్ డిజైన్‌తో నిర్మించిన భవనంలో ఉండేందుకు నిరాకరించారు. 1932లో తన ఇద్దరు కుమారులు, కోడళ్లయిన దుర్రు షెహావర్, నిలోఫర్‌తో కలసి నిజాం ఆ భవనానికి రాగా దాన్ని చూసి కొడుకుల ముఖాలు వాడిపోయాయి. తండ్రితో వాదనకు కూడా దిగారంటారు.

### నాలుగు పర్యాయాలే వచ్చిన నిజాం...

ఎంతో ముచ్చటపడి కట్టించుకున్న ఆ అద్భుత ప్యాలెస్‌ను నిజాం సందర్శించింది మాత్రం నాలుగు పర్యాయాలేనట. 1928లో భవనం ప్రారంభానికి ఆయన వచ్చినప్పుడు ఢిల్లీ వీధుల్లో భారీ ప్రదర్శన నిర్వహించారు. భారీ ర్యాలీ మధ్య ఆయన భవనానికి చేరుకుని అందులో విడిది చేశారు. ఆ తర్వాత 1932లో కుమారులతో కలిసి వచ్చారు. స్వాతంత్ర్యానంతరం ఒక పర్యాయం వచ్చారు. హైదరాబాద్ సంస్థానం భారతయూనియన్‌లో విలీనం అయ్యాక రాజ్‌ప్రముఖ్‌గా బాధ్యతలు స్వీకరించిన నిజాం 1954లో చివరిసారి హైదరాబాద్ హౌస్‌కు వచ్చారు.

### నెహ్రూకు హైదరాబాద్ చాయ్ తాగించిందిక్కడే....

నిజాం తన చివరి పర్యటనలో భాగంగా ఆ ప్యాలెస్‌కు వచ్చినప్పుడు అక్కడ భారీ ఎత్తున గార్డెన్ పార్టీ ఏర్పాటు చేశారు. దానికి నాటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ, నాటి రాష్ట్రపతి, ఇతర ప్రముఖులు హాజరయ్యారు. వారికి ఆయన ప్రత్యేకంగా హైదరాబాద్ చాయ్ తాగించారు. ప్యాలెస్ ముందు పచ్చికబయళ్లలో అటూఇటూ కలియదిరుగుతూ నెహ్రూ చాయ్‌ను ఆస్వాదించారని చెబుతారు.

### ఇప్పుడు అదే ప్రధాన ఆతిథ్య విడిది..

విదేశీ ప్రముఖులు వస్తే చాలు ద్వైపాక్షిక చర్చలు, ఉమ్మడి విలేకరుల సమావేశాలు, సదస్సులు, సమావేశాలు.... ఇలా అన్నింటికీ ఇప్పుడు హైదరాబాద్ హౌసే వేదిక. నరేంద్ర మోదీ ప్రధాని అయ్యాక భారత్‌కు విదేశీ దేశాధినేతల రాక బాగా పెరిగింది. దాంతోపాటు హైదరాబాద్ హౌస్‌లో సందడి కూడా అధికమైంది.







## అక్రమ బంగారు బిస్కెట్ల పట్టివేత



**సాక్షి, హైదరాబాద్:** డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) అధికారులు మరో అక్రమ బంగారం రవాణాను భగ్నం చేశారు. బంగారం అక్రమ రవాణా జరుగుతోందన్న ముందస్తు సమాచారంతో డీఆర్ఐ అధికారులు సోమవారం షాద్‌నగర్ సమీపంలోని చిలకమర్రి గ్రామ సమీపంలోని రాయికల్ టోల్‌గేట్ వద్ద ఓ ప్రైవేటు క్యాబ్‌ను ఆపారు. అందులో ప్రయాణిస్తున్న నలుగురు వ్యక్తులను తనిఖీ చేయగా వారి వద్ద 3,099 గ్రాముల బరువున్న 31 విదేశీ బంగారు బిస్కెట్లు లభించాయి. ఎలాంటి రసీదులు లేకుండా తరలిస్తున్న ఆ బిస్కెట్లను అధికారులు స్వాధీనం చేసుకొని నిందితులని అరెస్టు చేసి విచారిస్తున్నారు. ఈ బంగారు బిస్కెట్ల విలువ రూ. 1.38 కోట్లుగా ఉంటుందని అధికారులు వెల్లడించారు.

## అమెరికాలో రోడ్డు ప్రమాదం

- హైదరాబాద్‌కు చెందిన దంపతులు మృతి
- వారితోపాటు గుంటూరుకు చెందిన స్నేహితుడు కూడా..

**హైదరాబాద్:** అమెరికాలోని టెక్సాస్ రాష్ట్రంలో ఉన్న ఫ్రిస్కో ప్రాంతంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు తెలుగువారు మృతి చెందారు. మృతుల్లో భార్యభర్తలది హైదరాబాద్ కాగా, మరొకరిది ఏపీలోని గుంటూరు. గాంధీనగర్‌లో నివసించే రిటైర్డ్ ఆంధ్రాబ్యాంకు మేనేజర్ గౌతమ బుద్ధ, శివలీలలకు దీప్తి, దివ్య సంతానం. అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న ఘట్‌కేసర్ సమీపంలోని సింగపూర్ టౌన్‌షిప్‌కు చెందిన గవిని రాజుతో దివ్యకు 2007లో వివాహం జరిగింది. ఇద్దరూ అమెరికాలో ఉద్యోగం చేస్తున్నారు. వీరికి కుమార్తె రియా (7) ఉంది. రాజు స్నేహితుడైన గుంటూరు జిల్లాకు చెందిన ప్రేమ్‌నాథ్ నివాసంలో ప్రస్తుతం వీరు నివాసం ఉంటున్నారు. ఫ్రిస్కోలో నూతనంగా ఇల్లు నిర్మించుకుంటున్నారు. ఆదివారం కావడంతో కూతురు రియాను డాన్స్ క్లాసులో వదిలి కొత్త ఇంటి నిర్మాణాన్ని పరిశీలించేందుకు కారులో వెళ్లారు. వీరితో పాటు ప్రేమ్‌నాథ్ కూడా వెళ్లారు. తిరిగి వస్తున్న క్రమంలో మితిమీరిన వేగంతో వెనుకనుంచి దూసుకొచ్చిన మరో కారు ఢీ కొట్టింది. భారత కాలమానం ప్రకారం ఆదివారం సాయం త్రం 7 గంటల సమయంలో జరిగిన ఈ ప్రమాదంలో ముగ్గురూ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. వీరి కారును ఢీకొట్టిన వాహనాన్ని ఓ మైనర్ నడుపుతున్నట్లు పోలీసులు గుర్తించారు. అమెరికాలోని కొలంబస్‌లో ఉంటున్న దివ్య అక్క.. విషయం తెలుసుకున్న దీప్తి తన భర్తతో కలసి సంఘటన స్థలానికి చేరుకున్నారు. ప్రస్తుతం రియా వారి సంరక్షణలోనే ఉంది. దివ్య పుట్టిన రోజు ఆదివారమేనని, ప్రమాదం జరిగిన సమయం, ఆమె పుట్టిన సమయం దాదాపు ఒకటేనని కుటుంబీకులు విలపిస్తున్నారు. ఆ ముగ్గురి మృతదేహాలు శుక్రవారం నగరానికి చేరుకునే అవకాశం ఉంది.



మృతి చెందిన ప్రేమ్‌నాథ్, గవిని రాజు, దివ్య (ఫైల్ ఫొటో)

## కనీసం 5 పరిశ్రమలతో ఎంవోయూ చేసుకోవాల్సిందే..

- 8 కొత్త కోర్సుల్లో ప్రవేశాలకు అనుబంధ గుర్తింపు
- నేటి నుంచి అనుబంధ గుర్తింపునకు దరఖాస్తులు
- స్పష్టం చేసిన జేఎన్‌టీయూ

**సాక్షి, హైదరాబాద్:** విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించేలా రాష్ట్రంలోని ప్రతి ఇంజనీరింగ్ కాలేజీ కనీసం 5 పరిశ్రమలతో ఒప్పందాలు చేసుకొని విద్యార్థులను భాగస్వామ్యం చేయాలని జేఎన్‌టీయూ స్పష్టం చేసింది. మార్కెట్‌లో డిమాండ్ ఉన్న 8 కొత్త కోర్సులను 2020–21 విద్యా సంవత్సరంలో జేఎన్‌టీయూ పరిధిలోని ఇంజనీరింగ్ కాలేజీల్లో నిర్వహించేందుకు అనుబంధ గుర్తింపు ఇస్తామని జేఎన్‌టీయూ స్పష్టం చేసింది. ప్రస్తుతం ఉన్న సీట్లు (ఇన్‌టేక్) పెరగకుండా, ఉన్న సీట్లలోనే కోర్సులు బదలాయించుకోవచ్చని వెల్లడించింది. అదనపు సీట్లను ఇచ్చేది లేదని స్పష్టం చేసింది. సైబర్ సెక్యూరిటీ, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్, నెట్ వర్కింగ్, మిషన్ లెర్నింగ్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐవోటీ), రొబోటిక్స్, త్రీడీ ప్రింటింగ్ వంటి కోర్సులకు అనుబంధ గుర్తింపు ఇస్తామని పేర్కొంది. ఈ నెల 26 నుంచి యాజమాన్యాలు అనుబంధ గుర్తింపు కోసం దరఖాస్తు చేసుకోవచ్చని, మార్చి 10 వరకు ఎలాంటి ఆలస్య రుసుము లేకుండా దరఖాస్తులు స్వీకరిస్తామని స్పష్టం చేసింది. మార్చి 11 నుంచి మార్చి 16 వరకు ఆలస్య రుసుముతో దరఖాస్తులు స్వీకరిస్తామని వెల్లడించారు. మార్చి 16 నుంచి దరఖాస్తు చేసుకున్న కాలేజీల్లో సదుపాయాలు, ఫ్యాకల్టీ పరిశీలన కోసం ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీల (ఎఫ్‌ఎఫ్‌సీ) ఆధ్వర్యంలో తనిఖీలు చేస్తామని తెలిపారు. జేఎన్‌టీయూ అనుబంధ గుర్తింపు ప్రాసెస్‌పై కాలేజీల యాజమాన్యాలతో మంగళవారం జేఎన్ టీయూ సమావేశం నిర్వహించింది.

### ఏఐసీటీఈ అనుమతిస్తేనే మేం ఇస్తాం

రాష్ట్రంలో భవన నిర్మాణ అనుమతులు, ల్యాండ్ కన్వర్షన్‌లో సమస్యలు ఉన్న 238 కాలేజీల్లో 154 కాలేజీలు జేఎన్‌టీయూ పరిధిలోనే ఉన్నాయని జేఎన్‌టీయూ పేర్కొంది. అందులో 79 కాలేజీలు తమ లోపాలకు సంబంధించిన వివరణలతో కూడిన నివేదికలు అందజేశాయని పేర్కొంది. ఇంకా 75 కాలేజీలు వివరణలతో కూడిన నివేదికలు ఇవ్వలేదని, తాము ఎన్నిసార్లు నోటీసులిచ్చినా పట్టించుకోవట్లేదని పేర్కొంది. అయితే ఏఐసీటీఈ గుర్తింపు ఇస్తేనే అనుబంధ గుర్తింపు ఇస్తామని స్పష్టం చేసింది.

### మూడు రోజుల్లో గవర్నింగ్ బాడీల నామినీలు

ప్రతి కాలేజీ గవర్నింగ్ బాడీలు ఏర్పాటు చేయాల్సిందేనని యాజమాన్యాలకు జేఎన్‌టీయూ స్పష్టం చేసింది. 15 రోజుల్లో సమావేశాలు నిర్వహించాలని పేర్కొంది. అధ్యాపకులు, విద్యార్థులు ఆన్‌లైన్‌లో చేసే ఫిర్యాదులను కాలేజీలు వారం రోజుల్లో పరిష్కరించాలని స్పష్టం చేసింది. కెరీర్ అడ్వాన్స్‌మెంట్ స్కీం కింద కాలేజీల్లో పదోన్నతులు ఇచ్చుకోవచ్చని, వాటిని యూనివర్సిటీలో ర్యాటిఫై చేయించుకోవాలని తెలిపింది. ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు 1:2:6 రేషియోలో ఉండాల్సిందేనంది. మ్యాథమెటిక్స్, కెమిస్ట్రీ, ఫిజిక్స్, ఇంగ్లిష్ విభాగాల్లో పనిచేయాలంటే అధ్యాపకులకు నెట్, సెట్, పీహెచ్‌డీల్లో ఏదైనా ఒక అర్హత ఉండాలని, ఆ నిబంధన నుంచి ఈ ఏడాదే మినహాయింపు ఇస్తామని పేర్కొంది.




Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited,Sakshi Press, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792, Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.